
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 117

గురువారం 18-7-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బుల్లెట్ దిగాలి..
భారత షూటర్లపై భారీ అంచనాలు.. ఈసారి 21 మంది బరిలోకి - 12లో



శౌర్యకు కాంస్యం
ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్లో పరాజయం - 12లో



గూండారాజ్

రాజకీయ కక్షతో పల్నాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దారుణ హత్య

వినుకొండలో కొబ్బరి బొండాల కత్తితో మాటు వేసి నడిరోడ్డుపై విచక్షణా రహితంగా దాడి

నిందితుడు పట్టణ తెలుగు యువత నేత తమ్ముడు

- వందల మంది జన సందోహం సమక్షంలో పాశవిక ఘటన
- వినుకొండలోనే ఎస్పీ, భారీగా పోలీసులు.. అయినా నిర్భయంగా హత్య
- పూర్తి విచారణ చేయకుండా వ్యక్తిగత కక్షలే కారణమని ప్రకటించిన కొత్త ఎస్పీ

ఘోరం.. దారుణం.. అత్యంత దుర్మార్గం.. మాటలకందని మహా క్రౌర్యం.. నారావారి ఏలుబడిలో నరనరాన ఉన్మాదాన్ని నింపుకున్నట్లు పసుపుగూండాలు పేట్రేగిపోతున్నారు.. పల్నాడులో అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై టీడీపీ కార్యకర్త కొబ్బరి బొండాల కత్తితో తెగబడ్డాడు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తను అత్యంత దారుణంగా నరికేశాడు. పసుపు గూండాల బరితెగింపునకు ఈ ఘటన పరాకాష్ట. రాష్ట్రంలో 40 రోజులుగా అమలవుతున్న 'రెడ్‌బుక్ రాజ్యాంగం' ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసింది. హత్యలు, దాడులు, గృహదహనాలు, ప్రభుత్వ-ప్రైవేటు ఆస్తుల విధ్వంసాలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. పచ్చమూకలకు సెల్యూట్ చేస్తూ పోలీసు యంత్రాంగం పక్కకు తప్పుకుంది. టీడీపీ రౌడీలు ఆయుధాలు చేతబట్టి కాలకేయుల్లా దాడులకు తెగబడుతున్నారు. ఇదీ చంద్రబాబు రాక్షసపాలనలో ఏపీ ముఖచిత్రం... రెడ్‌బుక్ రాజ్యాంగంతో నెలకొన్న అరాచక రాజ్యం. 2 లో

రాబందుల రాజ్యంలో రాక్షస కాండ

- వరుస హత్యలు, దాడులతో పేట్రేగిపోతున్న టీడీపీ గూండాలు
- కూటమి ప్రభుత్వం వచ్చిన ఒక్క నెలలోనే 31 మంది హత్య
- వేధింపులు తాళలేక మరో 35 మంది ఆత్మహత్య

2 లో


టీడీపీ గూండా జిలానీ కత్తితో నరకడంతో రక్తపు మడుగులో పడి ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్


నిందితుడు సిద్ధూ

ప్రేమోన్మాది ఘాతుకం

- విశాఖ జిల్లా గొంతివానిపాలెంలో సిద్ధూ అనే ప్రేమోన్మాది రెచ్చిపోయాడు. తనను ప్రేమించాలంటూ ఓ యువతిని వేధించడంతో పాటు వారింట్లోకి కత్తితో చొరబడి ఆమె తల్లిపై విరుచుకుపడ్డాడు. ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వారు రావడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు.

3లో



బెయిలొచ్చినా.. మళ్లీ అరెస్ట్ చేశారు

- ఢిల్లీ మద్యం కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు రిజర్వ్ చేసింది. ఈడీ కేసులో బెయిల్ వచ్చినా జైలు నుంచి బయటకు రావొద్దనే ఉద్దేశంతోనే సీబీఐ మళ్లీ అరెస్ట్ చేసిందని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది వాదించారు.

6లో



కొనసాగుతున్న అల్పపీడనం

- అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండగా.. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కోస్తాంధ్రలో గురు, శుక్రవారాల్లో పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పిడుగులు పడే అవకాశం ఉందని.. అప్రమత్తంగా ఉండాలని ప్రజలను విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

13లో

'పసుపు బిళ్ల'తో వస్తే పనిచేయొద్దు

విజయనగరం జిల్లా నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే ఆదేశాలు

- తాను చెప్పిన పనులే, చెప్పిన వారికే చేయాలని అధికారులకు మాధవి హుకుం
- ప్రభుత్వ కార్యాలయాలకు జనసేన పార్టీ నేతల పేర్లతో జాబితాలు
- ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరేసి చొప్పున కార్యకర్తలతో అధికారులకు డైరెక్షన్
- ఎమ్మెల్యే తీరుపై టీడీపీ నాయకుల గుర్రు
- పసుపు బిళ్లతో కాదు.. పసుపు చొక్కాతో వచ్చినా పనులు కావడం లేదని మండిపాటు

10 లో





Denkada	Nathavalasa	B Srinivas
Denkada	Singavaram	Lingam Ramesh
Denkada	Denkada	Rongali Venkatrao
Denkada	Pinathadivada	Mahanthi Siva
Denkada	Peddathadivada	Chintapalli Ram murthy
Denkada	Vedullavalasa	Mynapu Sriram
Denkada	D. Thallavalasa	Ippada Ramana
Denkada	Amakam	Baddila Ramarao
Denkada	Bangarampeta	Kolli Veerababu
Denkada	Jonnada	Adada Pramela
Denkada	Chinthalavalasa	Pinnoti Rajarao
Denkada	Kondarupeta	Kolli Lakshman Reddy
Denkada	Mopada	Pinnati Upendra
Denkada	Modavalasa	Pyla Suresh
Denkada	Akulapeta	Pandranki Mahesh
Denkada	Akkivaram	Kandi Kiran
Denkada	Bantupalli	[illegible]
Denkada	Boddavalasa	Kona Ramakrishna
Denkada	Challapeta	Tomadi Surya Prakash
Denkada	Gantlam	[illegible]
Denkada	D Kollam	K. Harish
Denkada	Goragam	Dindi Chandu
Denkada	Gunupuru	Mahanthi Laxman
Denkada	Gunupurpeta	Pyla Appalrau
Denkada	Pedada	Raghu
Denkada	Raghumanda	Pilla Nani

ఎమ్మెల్యే మాధవి ప్రభుత్వ కార్యాలయాలకు పంపించిన జనసేన కార్యకర్తల జాబితా



కన్నడనాట 'స్థానిక' రగడ!


6 లో

- ప్రైవేటు ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్.. మేనేజ్‌మెంట్‌లో 50, నాన్‌మేనేజ్‌మెంట్‌లో 75 శాతం
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం, బిల్లుకు కేబినెట్ ఆమోదం.. ఐటీ సంస్థలు, విపక్షాల విమర్శలతో యూ టర్న్
- ప్రస్తుతానికి వెనుకడుగు.. మరింత అధ్యయనం చేస్తామని కర్ణాటక సీఎంవో ప్రకటన

1,17,136 ఇంజనీరింగ్ సీట్లు భర్తీ

19,524 సీట్లు మిగులు.. 19 నుంచి తరగతులు

సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీ సెట్–2024 కౌన్సెలింగ్‌లో తొలివిడత సీట్ల కేటాయింపును పూర్తి చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు, ప్రవేశాల కన్వీనర్ డాక్టర్ బి.నవ్య బుధవారం తెలిపారు. విద్యార్థులు ఈ నెల 22 లోపు కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు. అయితే ఈ నెల 19 నుంచే తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించిన 1,86,031 మందిలో తొలి విడత కౌన్సెలింగ్ కోసం 1,28,619 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. ధ్రువపత్రాల తనిఖీ అనంతరం 1,28,065 మంది అర్హత సాధించారన్నారు. మొత్తం 245 కళాశాలల్లో 1,36,660 సీట్లు ఉండగా, 1,17,136 సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన 19,524 సీట్లను రెండో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటాలకు సంబంధించి మెరిట్ జాబితా రానందున ఈ సీట్లను చివరిగా భర్తీ చేస్తామని వివరించారు.







చిరుద్యోగిని సస్పెండ్ చేసి.. అక్రమాలపై 'మట్టి' కప్పి..

ఎర్రమట్టి దిబ్బల అక్రమ తవ్వకాలపై తూతూ మంత్రంగా చర్యలు

సచివాలయం ఇన్‌చార్జి ప్లానింగ్ సెక్రటరీ సస్పెన్షన్


ఎర్రమట్టి దిబ్బలను తవ్వేస్తున్న దృశ్యం (ఫైల్)

- అసలైన పాత్రధారులను తప్పించేందుకు కుయుక్తులు
- 'సాక్షి' కథనంతో కూటమి ప్రభుత్వంలో వణుకు
- బుధవారం తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన జేసీ
- విచారణకు ఆదేశం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- ఎంత విస్తీర్ణంలో తవ్వేశారో గనుల శాఖ లెక్కలు

3 లో

నంద్యాల జిల్లా బనగానపల్లెలో మాతం నిర్వహిస్తున్న షియాలు



భక్తిశ్రద్ధలతో మొహర్రం

త్యాగం, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచే మొహర్రంను బుధవారం రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అనంతపురం జిల్లా గూగూడు, శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి, నంద్యాల జిల్లా బనగానపల్లె తదితర ప్రాంతాలు జనసాగరాన్ని తలపించాయి. బనగానపల్లెలో షియాలు నల్లటి వస్త్రాలు ధరించి బ్లేడ్లు, చురకత్తులతో ఎద, వీపుపై మాతం నిర్వహిస్తూ తమ రక్తాన్ని చిందించారు. 5 లో

ఘనంగా ప్రారంభమైన

రొట్టెల పండుగ

5 లో

భక్తులతో పోటెత్తిన నెల్లూరు బారాషహీద్ దర్గా


నెల్లూరు స్వర్ణాల చెరువులో రొట్టెలు ఇచ్చిపుచ్చుకుంటున్న భక్తులు


రషీద్‌పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేస్తున్న టీడీపీ గూండా జిలానీ




పోలీసుల అదుపులో నిందితుడు


ఆస్పత్రిలో రషీద్ మృతదేహం


తెగిపడిన రషీద్ చెయ్యి

గూండారాజ్

రాజకీయ కక్షతో పల్నాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దారుణ హత్య

కొబ్బరిబొండాల కత్తితో మాటు వేసి నడిరోడ్డుపై విచక్షణా రహితంగా దాడి


షేక్ అబ్దుల్ రషీద్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తొలి ఏకాదశి పర్వదినం.. ఎటు చూసినా కోలాహలం.. పల్నాడులో రామలింగేశ్వరుడి దర్శనం కోసం కిక్కిరిసిన భక్త జన సందోహం.. బందోబస్తు విధుల్లో వందల మంది పోలీసులు.. స్వయంగా ఎస్పీ పర్యవేక్షణ.. బుధవారం రాత్రి 7.30 గంటల సమయం.. రాజకీయ కక్షలతో ఒక్కసారిగా పచ్చ మూకల ఉన్మాదం పురి విప్పింది! వినుకొండ నడిబొడ్డున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కార్యకర్తను కొబ్బరిబొండాలు నరికే కత్తితో దారుణంగా నరికి చంపారు. వందలాది మంది చూస్తుండగానే నిత్యం రద్దీగా ఉండే ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. మరోవైపు సత్తెనపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో పలువురు గాయపడగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

కొబ్బరిబొండాల కత్తితో మాటు వేసి..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన షేక్ అబ్దుల్ రషీద్ (27) రాత్రి ఇంటికి వెళ్తుండగా పట్టణ తెలుగు యువత నాయకుడు ఎస్‌కె.జానీ తమ్ముడైన జిలానీ మరో ఇద్దరితో కలసి ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో మాటు వేశాడు. రషీద్ అక్కడికి చేరుకోగానే వెంట తెచ్చుకున్న కొబ్బరిబొండాల కత్తితో ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. ఈ హఠాత్ పరిణామంతో బాధితుడి చెయ్యి తెగిపోయి దూరంగా పడిపోయింది. అయినా ఆగకుండా నిందితుడు కిందపడిపోయిన రషీద్‌పై కూర్చుని విచక్షణా రహితంగా నరుకుతూనే ఉన్నాడు. తర్వాత తాపీగా అక్కడి నుంచి వెళ్లాడు. పోలీసులకు హత్యాయుధాన్ని అప్పగించి లొంగిపోయాడు. ఈ పాశవిక ఘటనతో వినుకొండ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

కొత్త ఎస్పీ రాగానే మళ్లీ మొదలు..

సార్వత్రిక ఎన్నికల సమయంలో పల్నాడులో దాడులు, దౌర్జన్యాలు, రిగ్గింగ్‌లకు పాల్పడిన టీడీపీ నేతలు మరోసారి వైఎస్సార్ సీపీ కార్యకర్తలే టార్గెట్‌గా దాడులకు తెగబడుతున్నారు. ఎన్నికల రోజు దాడులు, విధ్వంసాలకు సంబంధించి అప్పటి ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు పలువురు పోలీసు అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. తాజాగా కంచి శ్రీనివాసరావు ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న రెండు రోజుల్లోనే పల్నాడులో హింసాకాండ తిరిగి మొదలైంది. ఎస్పీ స్వయంగా వినుకొండలో ఉన్న సమయంలోనే తెలుగు యువత నాయకుడి తమ్ముడు నడిరోడ్డుపై హత్యకు తెగబడ్డాడు. కాగా ఈ ఘటనపై పూర్తి విచారణ చేయకుండా వ్యక్తిగత కక్షలే కారణమని కొత్తగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కంచి శ్రీనివాసరావు ఫక్తు రాజకీయ నేత మాదిరిగా వ్యాఖ్యానించడంపై తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది.

రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుకుంటున్న రషీద్‌ను పోలీసులు వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైద్యశాల వద్దకు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సత్తెనపల్లిలో..

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీకి చెందిన ఓ మహిళ కుటుంబంపై టీడీపీ నేతలు దాడి చేశారు. ఘటనలో గాయపడ్డ వారిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. ఒక్కసారిగా మళ్లీ పల్నాడులో దాడులు మొదలు కావడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సినిమా అయిపోలేదని, ఇంకా ఉందంటూ టీడీపీ నేతలు బరి తెగించి హెచ్చరికలు చేస్తుండటం గమనార్హం.

ప్రభుత్వ హత్యలే: మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి



వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ హత్య, సత్తెనపల్లిలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తల దాడులను చూస్తుంటే జిల్లా ఎస్పీని మార్చిన వెంటనే హింసకు తెగబడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ హింసాకాండను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. ఇవన్నీ సర్కారు హత్యలే. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించాలి.

నిమ్మకు నీరెత్తినట్టు ప్రభుత్వం



రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. వినుకొండలో వైఎస్సార్‌సీపీ నేత రషీద్ హత్యే ఇందుకు నిదర్శనం. రషీద్ హత్యోదంతాన్ని సోషల్ మీడియాలో చూడలేకపోయాం. టీడీపీ నేతలు కిరాతకంగా చంపేశారు. రోజుకో దారుణం జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉంటోంది. పోలీసులు చోద్యం చూస్తున్నారు. ఇలా కత్తులతో దాడి చేసి రోడ్లపై చంపేస్తుంటే ప్రజలు రోడ్లపై ఎలా తిరుగుతారు. చంద్రబాబు, లోకేశ్ ప్రోద్బలంతోనే ఈ హత్యలు, దాడులు, ఆస్తుల ధ్వంసం జరుగుతోంది.

– అంజాద్ బాషా, మాజీ మంత్రి

టీడీపీ హత్యా రాజకీయాలకు పరాకాష్ట



ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి పల్నాడు జిల్లాలో టీడీపీ హత్యా రాజకీయాలనే నమ్ముకుంటోంది. పోలింగ్ రోజు, ఆ తరువాత ప్రతి నియోజకవర్గంలో దాడులు, దౌర్జన్యాలతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను టార్గెట్ చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో హత్యా రాజకీయాలకు చోటుండకూడదు. వినుకొండ పట్టణ నడిబొడ్డున అతి కిరాతకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తను హత్య చేయడం అమానుషం. టీడీపీ హత్యా రాజకీయాలకు పరాకాష్ట.

– అంబటి రాంబాబు, మాజీ మంత్రి

చూస్తూ ఊరుకోం



వినుకొండలో ప్రజలంతా తొలి ఏకాదశి పండుగ జరుపుకుంటుంటే.. టీడీపీ నేతలు మాత్రం వైఎస్సార్‌సీపీ కార్యకర్తను చంపి ప్రజలను భయాందోళనకు గురి చేశారు. టీడీపీ హత్యారాజకీయాలకు ఓ ముస్లిం యువకుడు బలైపోయాడు. దీనికి చంద్రబాబు, లోకేశ్, జీవీ ఆంజనేయులే కారణం. వారిపై కేసులు నమోదు చేయాలి. కొత్త ఎస్పీ రాగానే టీడీపీ రౌడీలు పేట్రేగిపోయారు. టీడీపీ హత్యా రాజకీయాలను చూస్తూ ఊరుకోం.

– బొల్లా బ్రహ్మనాయుడు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే

శాంతి భద్రతలు లోపించాయి



ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎటువంటి వివక్ష లేకుండా పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పాలన అందించాం. టీడీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పల్నాడులో శాంతి భద్రతలు లోపించాయి. ఫలితాలొచ్చిన రోజే జిల్లాలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన వేలాది కుటుంబాలు జిల్లాను వదిలి వెళ్లిన భయానక పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ హత్యారాజకీయాలతో మళ్లీ పల్నాడులో ఫ్యాక్షన్ పురుడుపోసుకొనేలా ఉంది. కొత్తగా వచ్చిన ఎస్పీ జిల్లాలో టీడీపీ రౌడీ మూకలను కట్టడి చేయాలి.

– కాసు మహేష్‌రెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే

వ్యక్తిగత కక్షల వల్లే హత్య జరిగిందట!

- దర్యాప్తు చేయకుండానే తేల్చేసిన పల్నాడు జిల్లా ఎస్పీ
- ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో వెంటనే మీడియాకు వెల్లడి
- గంటల వ్యవధిలోనే ఎందుకంత తొందర?
- ఫక్తు టీడీపీ నాయకుడిలా వ్యవహరించిన వైనం

నరసరావుపేట: వ్యక్తిగత కక్షల వల్లే పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో రషీద్ అనే వ్యక్తిని జిలాని అనే వ్యక్తి నరికి చంపాడని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు తేల్చేశారు. మృతుడు వైఎస్సార్‌సీపీ కార్యకర్త. చంపిన వ్యక్తి టీడీపీలో స్థానికంగా క్రియాశీలకం. అయినప్పటికీ వ్యక్తిగత కక్షల వల్లేనంటూ ఎస్పీ గంటల వ్యవధిలో స్పష్టం చేయడం గమనార్హం. ప్రభుత్వ పెద్దల ఒత్తిడి వల్లే ఎలాంటి దర్యాప్తు లేకుండానే నిర్దిష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఎక్కడైనా ఒక హత్య జరిగితే చాలా తతంగం ఉంటుంది. పలు ఆధారాలు, దర్యాప్తు అనంతరం హత్యకుగల కారణాన్ని వెల్లడిస్తుంటారు. అలాంటిది ఏమీ లేకుండానే ఎస్పీ హడావుడిగా బుధవారం అర్ధరాత్రి తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, టీడీపీ తరఫున వకాల్తా పుచ్చుకున్నట్లు మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సంఘటనలో పార్టీల ప్రమేయం లేదని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైనా, ప్రోత్సహించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ప్రజలు అందరూ సంయమనం పాటించాలని కోరారు. పట్టణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నరరూప రాక్షసుల్లా టీడీపీ గూండాలు

ఎక్స్ వేదికగా ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ గూండాలు నరరూపరాక్షసుల్లా తయారయ్యారని వైఎస్సార్‌సీపీ ధ్వజమెత్తింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై విచక్షణా రహితంగా దాడులకు తెగబడుతున్నారంటూ మండిపడింది. పల్నాడు జిల్లా వినుకొండలో బుధవారం రాత్రి నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనమని పేర్కొంది. వినుకొండ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు రషీద్‌పై టీడీపీకి చెందిన గూండా జిలానీ పాశవికంగా కత్తితో దాడిచేసి హతమార్చారని ఆరోపించింది. అందరూ చూస్తుండగా, దారుణంగా రెండు చేతులు నరికి మెడపై కూడా పదేపదే కత్తితో వేటువేయడంతో రక్తపుమడుగులో కుప్పకూలిపోయాడని తెలిపింది. కొన ఊపిరితో ఉన్న రషీద్‌ను ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడని పేర్కొంది. టీడీపీతో పాటు హోంమంత్రి వంగలపూడి అనిత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను ట్యాగ్ చేస్తూ టీడీపీ వాళ్ల రాక్షసానందానికి ఇంకెంత మంది బలి అవ్వాలి? అంటూ ఎక్స్ వేదికగా వైఎస్సార్‌సీపీ ప్రశ్నించింది.

క్రూరంగా చంపేశారు




వైఎస్సార్‌సీపీ నాయకుడు రషీద్‌ను రెండు చేతులు నరికి క్రూరంగా చంపేశారు. రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోంది. లోకేశ్ రెడ్‌బుక్ ప్రకారం హత్యా రాజకీయాలు చేస్తూ రాక్షస పాలన సాగిస్తున్నారు. రెడ్‌బుక్‌లో పేర్లు ఉన్న ఒక్కొక్కరిని హత్య చేస్తూ వస్తున్నారు. తన అనుంగు పోలీసు అధికారులకు కీలకమైన పోస్టింగ్‌లు ఇచ్చి వారి ఆధ్వర్యంలో రెడ్ బుక్‌ను అమలు చేస్తున్నారు. ఇది మానవ సమాజానికి మంచిది కాదు.

– ఎమ్మెల్సీలు ఇసాక్ బాషా, మర్రి రాజశేఖర్

కిరాతకం రాజ్యమేలుతోంది



కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో కిరాతకం రాజ్యమేలుతోంది. వినుకొండలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రషీద్‌ను టీడీపీ వ్యక్తులు ఎంత కిరాతకంగా చంపారో యావత్ ప్రపంచం చూసింది. ఆటవికంగా రెండు చేతులు నరికి క్రూరంగా చంపారు. ఇంత జరుగుతున్నా పోలీసులు రెడ్‌బుక్‌కి సెల్యూట్ చేస్తున్నారు. రషీద్ హత్యోదంతానికి కారకులు చంద్రబాబు, లోకేశ్‌లే. ఎన్నికల తర్వాత పల్నాడులో ప్రజలు జీవించలేని పరిస్థితులు నెలకొన్నాయి.

– ఖాదర్‌బాషా, అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం

రాబందుల రాజ్యంలో రాక్షస కాండ

- వరుస హత్యలు, దాడులతో పేట్రేగిపోతున్న టీడీపీ గూండాలు
- కూటమి ప్రభుత్వం వచ్చిన ఒక్క నెలలోనే 31 మంది హత్య
- వేధింపులు తాళలేక మరో 35 మంది ఆత్మహత్య
- 1,050 దాడులు.. 300 హత్యాయత్నాలు
- భయంతో గ్రామాలను విడిచిపెట్టేసిన వేలాది కుటుంబాలు
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న టీడీపీ బీభత్సకాండ
- గజినీ, ఘోరీలను తలదన్నే రీతిలో దురాగతాలు
- తాలిబన్లను మించి కిరాతకాలు
- చోద్యం చూస్తున్న పోలీసు శాఖ
- రెడ్‌బుక్ రాజ్యాంగానికే సలాం

రాష్ట్రంలో రక్తం ఏరులైపారుతోంది.. మధ్యయుగాల నాటి మారణకాండను తలపిస్తూ నడిరోడ్డు పైనే, అదీ అందరూ చూస్తుండగానే మనుషులను నరికిపారేస్తున్నారు. తాలిబన్‌లను మించి అత్యంత పాశవికంగా మనుషుల ప్రాణాలు తీసేస్తున్నారు. దేశంలో ఇప్పటివరకు కనీవినీ ఎరుగని రీతిలో మారణకాండను సృష్టిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చింది మొదలు.. నెల రోజులుగా పచ్చ మూక ఉన్మాదానికి నెత్తురు కట్టలు తెంచుకుంటోంది.. తలకాయలు తెగిపడుతున్నాయి. వారి అధికార మదానికి ప్రాణాలు దూదిపింజల్లా రాలిపోతున్నాయి.

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను బుధవారం రాత్రి టీడీపీ నేత జిలానీ కత్తితో దాడి చేసి రెండు చేతులు తెగనరికాడు.. అదే కత్తితో తలపైనా, మెడపైనా విచక్షణారహితంగా నరికాడు. ఇంతటి దారుణ హత్య ఎక్కడో చీకట్లోనో.. దొంగచాటుగానో చేయలేదు.. నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే బహిరంగంగానే ఇంతటి ఘోరానికి ఒడిగట్టాడు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తామని నారా లోకేశ్ హోర్డింగుల సాక్షిగా స్పష్టం చేశారు.. దీంతో పోలీసు యంత్రాంగం పక్కకు తప్పుకుని టీడీపీ అరాచకాలకు రాచబాట పరిచింది.. అంతకంటే ఇంకేం కావాలని టీడీపీ రౌడీలు మారణాయుధాలు చేతబట్టి కాలకేయుల్లా రాష్ట్రంపై దండెత్తారు. ఇదీ చంద్రబాబు రాక్షసపాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖచిత్రం.. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో నెలకొన్న అరాచక రాజ్యం. మధ్యయుగాలనాటి గజినీ, ఘోరీల దురాగతాలను మించి టీడీపీ గూండాలు హత్యలకు తెగబడుతున్నారు. తాలిబన్ మూకలను మించి పచ్చ మూకలు స్వైరవిహారం చేస్తూ కర్కశంగా విరుచుకుపడుతున్నాయి. తమ పదఘట్టనల కింద యథేచ్ఛగా విధ్వంసకాండ కొనసాగిస్తున్నాయి. నడిరోడ్లపై రాక్షసరాజ్యం కరాళ నృత్యం చేస్తోంది. 75ఏళ్ల స్వాతంత్య్ర భారతదేశ చరిత్రలో ఇప్పటివరకు చూడని రీతిలో హింసాకాండతో చంద్రబాబు ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోంది. చంద్రబాబు అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే టీడీపీ మూకల దాడుల్లో 31 మంది హత్యకు గురయ్యారు. మరో 35 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇలా హత్యలతో రాష్ట్రం అట్టుడికిపోతోంది. ఇళ్లు, ఆస్తులు, మహానేత విగ్రహాలను నేలమట్టం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను కూలుస్తున్నారు. ప్రభుత్వ ప్రేరేపిత దాడులతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారినా పట్టించుకునేవారే లేరు.

నెల రోజుల్లోనే 31 హత్యలు

మహాభారతంలో బకాసురుడి కథ అందరికీ తెలిసిందే. అతడికి ఒక ఎడ్ల బండి నిండుగా అన్ని రకాల ఆహార పదార్థాలను పంపేవారు. ఆ ఆహార పదార్థాలను, బండికి కట్టిన ఎద్దుల్ని, బండిని తోలుకొచ్చిన మనిషిని కూడా కరకరానమిలి పారేసేవాడు. ఇలా రోజూ ఎడ్లబండి నిండుగా ఆహార పదార్థాలను నింపి మనిషితో పంపాల్సిందే. భీముడు వెళ్లి బకాసురుడిని సంహరించే వరకు ఈ అరాచకం కొనసాగింది. ఇప్పుడు బకాసురుడి రీతిలోనే చంద్రబాబు ప్రభుత్వంలో టీడీపీ రౌడీలు రోజుకొకరిని అత్యంత కిరాతకంగా అంతమొందిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక్క నెల రోజుల్లోనే రాష్ట్రంలో 31 మందిని పచ్చ నేతలు, కార్యకర్తలు దారుణంగా హత్య చేశారు. వీరి దాడులు, వేధింపులను తట్టుకోలేక 35 మంది తమ ప్రాణాలను బలితీసుకున్నారు. ఇవన్నీ ఇప్పటివరకు నమోదైన అధికారిక లెక్కలు. కానీ వాస్తవంగా అంతకుమించిన రాక్షస కాండలో రాష్ట్రం అల్లకల్లోలంగా మారింది. టీడీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగుతున్న దౌర్జన్యకాండ కావడంతో ఫిర్యాదులు చేసేందుకు పలువురు బాధితులు వెనుకంజ వేస్తున్నారు. వీరంతా ఫిర్యాదు చేస్తే మరిన్ని కేసులు వెలుగుచూసేవి.

నెల రోజుల్లో వేయికిపైగా దాడులు.. 300 హత్యాయత్నాలు

టీడీపీ రౌడీ మూకలు రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసకాండ కొనసాగిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో పాటు వ్యాపారులు, సాధారణ ప్రజలపై కర్కశంగా విరుచుకుపడుతున్నారు. నెల రోజుల్లోనే రాష్ట్రంలో 1,050 దాడులకు తెగబడటం టీడీపీ యథేచ్ఛగా కొనసాగిస్తున్న దౌర్జన్యకాండకు నిదర్శనం. వాటిలో 300కుపైగా హత్యాయత్నాలే కావడం గమనార్హం. అంటే టీడీపీ గూండాలు రోజుకు సగటున 100 దాడులు.. 10 హత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. ఒక్క ప్రాంతమని లేదు.. శ్రీకాకుళం నుంచి అనంతపురం జిల్లా వరకు రాష్ట్రవ్యాప్తంగా రాక్షస కాండను కొనసాగిస్తున్నారు. ఎస్సీ కాలనీలపై దాడులు చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నారు. ఇళ్లు, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో చీనీ తోటలను నరికేస్తున్నారు.

ఊళ్లు వదిలిపోయిన వేలాది కుటుబాలు

టీడీపీ రౌడీమూకలు హత్యాకాండకు తెగబడుతుండటంతో సామాన్యులు ప్రాణభయంతో తమ గ్రామాలు వదిలేసి వెళ్లిపోతున్నారు. ఒక్క పల్నాడు జిల్లాలోనే 1,500 కుటుంబాలు తెలంగాణకు వెళ్లి తలదాచుకోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. చిత్తూరు జిల్లాలో దాదాపు 500, అనంతపురం జిల్లాలో 350, శ్రీసత్యసాయి జిల్లాలో 100, అన్నమయ్య జిల్లాలో 120, కర్నూలు జిల్లాలో 135 కుటుంబాలు తమ సొంత ఊళ్లను విడిచిపెట్టేశాయి. వ్యాపారులను కూడా టీడీపీ మూకలు వదిలిపెట్టడం లేదు. నెల రోజుల్లోనే రాష్ట్రంలో 560 ప్రైవేటు ఆస్తులు, 490 ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు.


రెడ్‌బుక్ రాజ్యాంగానికే పోలీస్ శాఖ సలాం..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని పాటించాల్సిన పోలీసు శాఖ నారా లోకేశ్ విరచిత రెడ్‌బుక్ రాజ్యాంగానికే సలాం కొడుతోంది. రెడ్‌బుక్ పేరిట రాష్ట్రంలో హోర్డింగులు పెట్టి మరీ దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసు శాఖ చోద్యం చూస్తోంది. రెడ్‌బుక్ రాజ్యాంగానికి సెల్యూట్ చేస్తూ టీడీపీ అరాచకాల అడుగులకు మడుగులొత్తుతోంది. రాష్ట్రస్థాయిలో లోకేశ్‌ను అనుసరిస్తూ నియోజకవర్గ స్థాయిల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తలో రెడ్‌బుక్‌ను తెరపైకి తెచ్చి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. తమ హింసాకాండను అడ్డుకుంటే పోలీసుల సంగతి తేలుస్తామని టీడీపీ ప్రభుత్వ పెద్దలు బహిరంగంగానే ప్రకటిస్తుండటం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది.

ఒక్క నెలలోనే టీడీపీ రాక్షస కాండ ఇలా..

దాడులు, దౌర్జన్యాలు	1,050
హత్యలు	31
హత్యాయత్నాలు	300
ఆత్మహత్యలు	35
ప్రైవేటు ఆస్తుల ధ్వంసం	560
ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం	490
గ్రామాలు విడిచివెళ్లిన కుటుంబాలు	2,705

వైఎస్సార్‌సీపీ కుటుంబంపై టీడీపీ శ్రేణుల దాడి


దాడికి గురైన కుటుంబం

సత్తెనపల్లి: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఓ కుటుంబంపై టీడీపీ శ్రేణులు దాడికి తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన బలమాల జ్యోతి, భర్త ఆనంద్‌రావు, కుమారుడు శ్యాంసన్, కుమార్తె శ్రీవల్లి బుధవారం రాత్రి నిద్రిస్తున్నారు. అదే సమయంలో భాగ్యనగర్ కాలనీ టీడీపీకి చెందిన బలమాల ప్రభుదాసు, కొండలు, మార్క్, శ్యాంబాబు, వెంకటేష్, తిరుపతిరావులు ఒక్కసారిగా జ్యోతి ఇంటిపై దాడి చేశారు. ఘటనలో జ్యోతి వస్త్రాలు చిరిగి, గాయాలయ్యాయి. హుటాహుటిన ఇరువర్గాలకు చెందిన బాధితులను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

క్లుప్తంగా...

ముచ్చుమర్రి ఘటనలో రూరల్ సీఐ, ఎస్‌ఐ సస్పెన్షన్



విజయభాస్కర్, సీఐ / జయశేఖర్, ఎస్‌ఐ

నందికొట్కూరు: నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలికపై అత్యాచారం, హత్య ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్‌లను కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు బుధవారం సస్పెండ్ చేశారు. బాలిక అదృశ్యంపై ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు, ఆ తర్వాత పరిణామాల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్లే వీరిపై డీఐజీ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

ఎర్రమట్టి దిబ్బలను ప్రభుత్వం పరిరక్షించాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): చరిత్రాత్మక వారసత్వ సంపద అయిన విశాఖ ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత చింతా మోహన్ పేర్కొన్నారు. స్థానిక వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాలపై తమకు నమ్మకం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వాలు చేసిన ఖర్చుపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మునిగిపోయే నావ వంటిదని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎవరూ ప్రైవేటీకరించలేరని, ఆ విధంగా నాటి ప్రధాని ఇందిరా గాంధీ గట్టి పునాది వేశారని చెప్పారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి విశాఖ పర్యటన వల్ల ఒరిగేదేమీ లేదన్నారు. తిరుపతి ఎయిర్‌పోర్టును కూడా ప్రైవేటీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు.

సాగుకు సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: రైతుల ఆదాయం పెంపే లక్ష్యంగా ముందుకెళతానని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ..విస్తరిస్తోన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి తదనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేస్తామని చెప్పారు.

విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

భారతి దాసన్ వర్సిటీ ఏడీ పార్థసారథి




సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు తగిన ప్రాధాన్యతనిచ్చినప్పుడే దేశం పురోభివృద్ధి చెందుతుందని భారతి దాసన్ వర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం తిరుపతిలో మహిళా వర్సిటీలో ఎస్వీయూ, ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఈపీ–2020 పాత్ వే ఫర్ ద ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్టేటస్, చాలెంజెస్ అండ్ స్ట్రాటజీస్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్థసారథి ప్రసంగిస్తూ..దేశంలో నైపుణ్యతతో కూడిన విద్య అవసరమన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు దేశంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం సెమినార్ సావనీర్‌ను ఆవిష్కరించారు. సదస్సులో డాక్టర్ డి.ఉమాదేవి, ప్రొఫెసర్ ఎల్.రాజా, కేసీ.చౌదరి, పలు వర్సిటీల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేతిలో అల్లావుద్దీన్ అద్భుత దీపం లేదు

ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వం చేతిలో అల్లావుద్దీన్ అద్భుత దీపం లేదని, రాష్ట్రంలో సంపద సృష్టికి మరింత సమయం పడుతుందని ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ చెప్పారు. ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాను కలిశారు. అనంతరం ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సంపద సృష్టిస్తామని అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అప్పులు చేస్తోందని మీడియా ప్రశ్నించగా... 'సంపద సృష్టిస్తామని చెప్పినమాట వాస్తవమే. కానీ ప్రభుత్వం చేతిలో అల్లావుద్దీన్ అద్భుత దీపమైతే లేదు. ఒక్క రోజులో సంపద సృష్టించబడదు. కొంత సమయం పడుతుంది. తప్పని పరిస్థితుల్లోనే అప్పులు చేయాల్సి వస్తోంది' అని మంత్రి బదులిచ్చారు.

అంతా అధికార పార్టీ నేత అనుచరుడి పనే!

- ముచ్చుమర్రి ఘటనలో ఓ నిందితుడి తాతకు.. అధికార పార్టీ నేతతో 40 ఏళ్లుగా అనుబంధం
- పాపను ముక్కలుగా చేసి.. నీటి కుక్కలకు, చేపలకు ఆహారంగా వేసింది అతనే
- అందుకే మృతదేహం దొరకలేదని స్థానికుల్లో చర్చ.. అప్పట్లో ఆ నేతకు అడ్డొచ్చిన వారెందరికో ఇదే గతి
- బాలిక మృతదేహాన్ని మొసళ్లు తినేసి ఉండొచ్చని పోలీసుల అనుమానం
- అసలు బ్యాక్ వాటర్‌లో మొసళ్లే లేవంటున్న స్థానికులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ముచ్చుమర్రికి చెందిన బాలికపై అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించి కొత్త విషయాలు వెలుగులోకొస్తున్నాయి. హత్యాచారానికి పాల్పడ్డ ముగ్గురు బాలురులో ఓ బాలుడి తాత.. ఆ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కుటుంబం వద్ద నాలుగు దశాబ్దాలుగా పనిచేసే వాడని తెలుస్తోంది. 1994 ప్రాంతంలో ఆ నాయకుడికి ఫ్యాక్షన్‌లో అడ్డొచ్చిన కొందరిని ముక్కలు ముక్కలుగా చేసి అక్కడి చేపలకు, నీటి కుక్కలకు ఆహారంగా వేసేవాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. అప్పట్లో మిస్సయిన వ్యక్తుల ఆచూకీ నేటికీ తెలియలేదని, అదే తరహాలోనే ఇప్పుడు బాలిక శవాన్ని కూడా ముక్కలు చేశారని స్థానికుల్లో ప్రచారం జరుగుతోంది. అయితే పోలీసు వర్గాలు మాత్రం శవాన్ని సంచిలో పడేసి రాయి కట్టడంతోనే దొరకలేదని చెబుతున్నారు. నిజానికి బాలిక పొట్ట కోయకుండా రాయి కట్టి పడేసినా శవం బయటకొస్తుందని కొందరంటున్నారు. బ్యాక్ వాటర్‌లో పడేయడంతో మొసళ్లు ఆహారంగా తీసుకుని ఉంటాయని కొందరు పోలీసులు భావిస్తున్నారు. అయితే అక్కడ మొసళ్లే లేవని గ్రామస్తులు చెబుతున్నారు.

అందుకే మృతదేహం ఇక దొరకదు!

ఈనెల 7న పాత ముచ్చుమర్రిలో ఐదో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలికపై ఆరో తరగతి బాలుడు, పదో తరగతి చదివే ఇద్దరు బాలురు అత్యాచారం చేశారు. ఆపై పాప ఎవరికైనా చెబుతుందేమోనని భయపడి వెంటనే పాప గొంతు నులిమి చంపేశారు. వీరిలో ఒకడు విషయాన్ని తండ్రికి చెప్పాడు. ఆయన మిగిలిన తల్లిదండ్రులతో కలిసి.. ఆ చిట్టితల్లిని గోనె సంచిలో వేసి, దానికి రాయి కట్టి కృష్ణానది బ్యాక్ వాటర్‌లో పడేశారు. పోలీసుల విచారణలో ఆ ముగ్గురి పిల్లల తండ్రులు చెప్పిన విషయం ఇది. అయితే చిన్నారిపై అత్యాచారం చేసింది నిజం.. చంపింది నిజమేగానీ, శవాన్ని మాయం చేసిన విధానంపై చెబుతోంది మాత్రం అబద్ధం. ఈ రెండు ఊర్లే కాదు. ఈ 12 రోజుల్లో ఆ నోటా, ఈ నోటా చర్చ జరిగి ఇప్పుడు కర్నూలు, నంద్యాల రెండు జిల్లాల్లో ఈ విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. పాపను చంపి ముచ్చుమర్రి–హంద్రీ నది అప్రోచ్ చానల్లో పడేశారని మొదట చెప్పారు. ఆ తర్వాత ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వద్ద వేశామన్నారు. శవాన్ని తీసుకెళ్లి సంగమేశ్వరంలో వేశామని మరోసారి చెప్పారు. లేదు.. కొణిదెల శ్మశాన వాటికలో పూడ్చామన్నారు.. అయితే వీటిలో ఏదీ వాస్తవం కాదని కొత్త విషయం వెలుగు చూస్తోంది. ముగ్గురి బాలురలో ఒక బాలుడి తాత ఆధ్వర్యంలో బిడ్డను ముక్కలుగా నరికినట్లు తెలుస్తోంది. ముక్కలను బ్యాక్ వాటర్‌లో అక్కడక్కడా పడేసి ఉంటారని, నీటి కుక్కలు, చేపలు ఈ ముక్కలను తినేసి ఉంటాయని, అందుకే శవం దొరకడం లేదని.. మరో నెలైనా దొరకదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఎక్స్‌గ్రేషియా ఏది?

సాక్షి, నంద్యాల: ముచ్చుమర్రిలో బాలిక హత్యాచారానికి సంబంధించి ఘటనలో బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల సాయం అందజేస్తామని హోం మంత్రి అనిత ప్రకటించారు. గురువారంతో మూడు రోజులవుతున్నా ఇంత వరకూ బాధిత కుటుంబానికి సాయం అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బాధితులకు పరిహారం ప్రకటిస్తే గంటల వ్యవధిలోనే జిల్లా అధికారులు ఆ సాయాన్ని అందించేవారు. సంబంధిత మంత్రులు లేదా జిల్లా కలెక్టర్ బాధితులను కలిసి భరోసా కల్పించేవారు. కానీ కూటమి ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

పవన్, చంద్రబాబు నోరు మెదపరేం?

కర్నూలుకు చెందిన సుగాలి ప్రీతిపై తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో కొందరు అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ ఘటనపై మొన్నటి ఎన్నికల ప్రచారం వరకూ పవన్ కళ్యాణ్ ఆవేశంతో ఊగిపోయేవారు. ఇప్పుడు టీడీపీతో పాటు తమ భాగస్వామ్యం ఉన్న ప్రభుత్వంలో పదేళ్ల బాలికపై అత్యాచారం చేసి, హత్య చేసి.. 12 రోజులుగా శవాన్ని కనపడకుండా చేస్తే ఆ ఘటనపై నోరెత్తలేదు. ముఖ్యమంత్రీ స్పందించలేదు. హోం మంత్రి ఇక్కడ పర్యటించనే లేదు. దీనికి కారణం బాలిక హత్యతో ముడిపడి ఉన్న కుటుంబానికి చెందిన వారు అధికార పార్టీకి చెందిన నేతల అనుచరులు కావడమేనని చెప్పుకొంటున్నారు. ఈ కేసులో చాలా సెక్షన్ల కింద బాలురు, వారి తండ్రులపై కేసులు నమోదు కావాల్సి ఉంటుందని.. అందువల్లే ఘటనను తేలిగ్గా తీసిపారేస్తున్నారని తెలుస్తోంది.

చిరుద్యోగిని సస్పెండ్ చేసి.. అక్రమాలపై 'మట్టి' కప్పి..

ఎర్రమట్టి దిబ్బల అక్రమ తవ్వకాలపై తూతూమంత్రం చర్యలు

- సచివాలయం ఇన్‌చార్జి ప్లానింగ్ సెక్రటరీ సస్పెన్షన్
- అసలైన పాత్రధారులను తప్పించేందుకు కుయుక్తులు
- 'సాక్షి' కథనంతో దిగొచ్చిన కూటమి ప్రభుత్వం



తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ అశోక్

సాక్షి, విశాఖపట్నం: ఎర్రమట్టి దిబ్బల్ని టీడీపీ నేతలు ధ్వంసం చేసిన వ్యవహారంలో కూటమి ప్రభుత్వం విచారణను మమ అనిపించేసింది. ఓ చిరుద్యోగిని బలి చేసి, అసలు పాత్రధారులు, సూత్రధారులైన కూటమి నేతల్ని పక్కకి తప్పించేసింది. భౌగోళిక వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బల్ని పరిరక్షించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బఫర్ జోన్‌ని దాటి అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న దారుణాన్ని 'సాక్షి' బట్టబయలు చేసింది. 'మట్టి దిబ్బలు మటాష్!' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనంతో కూటమి ప్రభుత్వం ఉలిక్కిపడింది. అధికార కూటమి నేతలే ఎర్రమట్టి దిబ్బల్ని హరిస్తుండటంతో దిద్దుబాటు చర్యలు చేపడుతున్నట్లు నాటకమాడింది. ప్రభుత్వ ఆదేశంతో జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) మయూర్ అశోక్, రెవెన్యూ, గనులశాఖ అధికారులు బుధవారం ఆ ప్రాంతాన్ని మొక్కుబడిగా పరిశీలించారు. అక్రమ తవ్వకాలపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా చేస్తున్న పనులను వెంటనే ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణకు ఆదేశించారు. స్థానిక అధికారులదే తప్పని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామంటూ హడావుడి చేశారు. ఈ ప్రాంతాన్ని సమగ్ర సర్వే చేయాలని నిర్ణయించారు. ఎంత విస్తీర్ణంలో తవ్వేశారో గనుల శాఖ అధికారులు కూడా లెక్కలు వేస్తున్నారు. వెంటనే ఇక్కడ తవ్వకాలు నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

చిరుద్యోగిపై చర్య

ఎర్రమట్టి దిబ్బలు నిడిగడ్డు సచివాలయం పరిధిలో ఉండటంతో ఆ సచివాలయం ఇన్‌చార్జి ప్లానింగ్ సెక్రటరీ కాగిత అజయ్‌కుమార్ సరిగా స్పందించలేదని ఆయన్ని సస్పెండ్ చేశారు. వాస్తవానికి అజయ్‌కుమార్ భీమిలి తోట వీధి సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ. నిడిగడ్డుకు ఇన్‌చార్జిగా వచ్చారు. తుది విచారణలోనూ ఉద్యోగుల్నే బలి చేయాలని, నేతల పేర్లు బయటికి తేవద్దంటూ ఇప్పటికే జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బఫర్ జోన్‌కు బయట 70, 80 ఏళ్లుగా జీడితోటలు వేసుకొన్న రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ చేసిన వ్యవహారంపై బాబు, పవన్ పెద్ద రాద్ధాంతం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు వారు అధికారంలోకి వచ్చిన నెలలోనే టీడీపీ, జనసేన నేతలు కుమ్మక్కై బఫర్‌జోన్ దాటి తవ్వకాలు జరిపి మట్టి తరలించేస్తున్నారు. దీనిపై సాక్షి కథనంతో ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తల నుంచి తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తమైంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. పవన్ ఇప్పుడు సంబంధిత శాఖ మంత్రిగా ఉండి స్పందించకపోవడాన్ని తప్పుబడుతున్నారు.

ప్రభుత్వ పెద్దల సహకారంతోనే తవ్వకాలు

కొమ్మాది: ప్రభుత్వ పెద్దల సహకారంతో, స్థానిక కూటమి నేతల మద్దతుతోనే ఎర్రమట్టి దిబ్బలను తవ్వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. ఆయన బుధవారం తవ్వకాల వద్ద సెల్ఫీ తీసుకుని ఈమేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బాబు కూటమి అధికారంలోకి వచ్చిన 35 రోజుల్లో భౌగోళిక వారసత్వ సంపదైన ఎర్రమట్టి దిబ్బల పరిస్థితి ఇదంటూ పోస్టు చేశారు.

చిన్నారిపై లైంగిక దాడి.. ఆపై హత్య

తిరుపతి జిల్లాలో దారుణం



ఘటనా స్థలంలో డీఎస్పీ విచారణ

దొరవారిసత్రం (తిరుపతి జిల్లా): ఓ చిన్నారిపై కామాంధుడు లైంగిక దాడిచేసి ఆపై గొంతు నులిమి హత్య చేసిన ఘటన బుధవారం దొరవారిసత్రం నెలబల్లి గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..బిహార్ రాష్ట్రంలోని దర్భాంగా ప్రాంతానికి చెందిన దంపతులు వారి కుమార్తెతో కలిసి 40 రోజుల కింద నెలబల్లి గ్రామ పరిధిలోని రైస్ మిల్లులో వంట చేసేందుకు వచ్చారు. బుధవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అదే రైస్ మిల్లులో కార్మికుడు, బిహార్‌కు చెందిన దిలీప్‌కుమార్ మిల్లు ఆవరణలో ఆడుకుంటున్న బాలికకు మాయ మాటలు చెప్పి సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులకు ఎక్కడ చెబుతుందో అని బాలిక మెడకు కండువా బిగించి దారుణంగా హత్య చేసి తిరిగి ఏమి తెలియనట్లుగా 10.30 గంటలకు మిల్లుకు వచ్చేశాడు. ఇంతలో మేకలు మేపేందుకు అటుగా వెళ్లిన కొందరు బాలిక మృతదేహాన్ని గుర్తించి నెలబల్లి గ్రామస్తులకు తెలియజేశారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులరెడ్డి, సీఐ జగన్మోహన్‌రావు, ఎస్‌ఐ తిరుమలరావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం రైస్ మిల్లులోని సీసీ కెమెరాల్లోని ఫుటేజీలను పరిశీలించగా దిలీప్‌కుమార్ బాలికను తీసుకెళ్లి.. తిరిగి ఒంటరిగా వచ్చినట్టు గుర్తించారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమోన్మాది ఘాతుకం

- ఇంట్లోకి చొరబడి యువతి తల్లిపై కత్తితో దాడి
- విశాఖ జిల్లాలో ఘటన

పెదగంట్యాడ(విశాఖ): ప్రేమోన్మాది రెచ్చిపోయాడు.. తనను ప్రేమించాలంటూ ఓ యువతిని వేధించడంతో పాటు వారింట్లోకి కత్తితో చొరబడి యువతి తల్లిపై విరుచుకుపడ్డాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొంతివానిపాలెంలో సింగనపల్లి కేశవరావు అనే వ్యక్తి భార్య సావిత్రి, ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్నాడు. ట్యాక్సీ నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని పెద్ద కుమార్తె సింగనపల్లి శ్యామల ఓ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన సిద్ధూ అనే యువకుడు ఏడాది కాలంగా శ్యామలను ప్రేమించమంటూ వెంట పడుతున్నాడు. ఈ నేపథ్యంలో కేశవరావు ఆ యువకుడిని పలుమార్లు హెచ్చరించాడు. అయినా ఆ యువకుడి తీరులో మార్పు రాకపోగా.. కేశవరావుతో తరచూ గొడవలు పడడంతో పాటు అతనిపై దాడి చేశాడు. దీంతో ఆయన గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గాజువాక పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. కొంతకాలం పాటు జైలులో ఉన్న ఆ యువకుడు విడుదలైన తర్వాత మళ్లీ ఆ యువతి వెంట పడడం మొదలెట్టాడు. అంతేకాకుండా ఈ నెల 16న రాత్రి 9 గంటల సమయంలో ఆ యువతి ఇంట్లోకి కత్తితో చొరబడ్డాడు. అడ్డువచ్చిన యువతి తల్లి సావిత్రిపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో ఆ యువకుడు పరారయ్యాడు. బాధితురాలిని వెంటనే గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి సావిత్రి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బాలికపై అధ్యాపకుడి లైంగిక వేధింపులు

బాధితురాలి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

అడ్డతీగల: గిరిజన విద్యార్థిని (మైనర్)పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే అభియోగంపై అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు కె.రామకృష్ణపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం కింద స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. తాను బాత్రూమ్‌కి వెళుతున్న సమయంలో ఫోటోలు తీయడానికి అధ్యాపకుడు ప్రయత్నించి అసభ్యంగా ప్రవర్తించాడని అదే కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలిక (17) ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ఈ ఘటనపై దర్యాప్తు అధికారిగా చింతూరు ఏఎస్పీని ఎస్పీ అమిత్ బర్దర్ నియమించారు.

విక్రమసింహపురి-అమరావతి ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అప్పికట్ల, నిడుబ్రోలు, చుండూరు సెక్షన్‌లో జరుగుతున్న ఇంటర్ లాక్ పనుల కారణంగా ఈ నెల 15 నుంచి 30 వరకు రద్దు చేసిన విక్రమ సింహపురి–అమరావతి ఎక్స్‌ప్రెస్(12744/12743) రైలును గురువారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్వో నుస్రత్ మండ్రుప్కర్ ఓ ప్రకటనలో తెలిపారు.

అడుగు బయట పెట్టాలంటేనే ఆడబిడ్డలు హడలిపోతున్నారు

వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



బీచ్‌రోడ్డు: 'రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా క్షీణించింది. ఆడ పిల్లలకు రక్షణ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 40 రోజుల్లో రాష్ట్రంలో రోజూ మూడు హత్యలు, ఆరు అత్యాచారాలు అన్నట్లు పరిస్థితి తయారైంది' అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా సీఎం చంద్రబాబుగానీ, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌గానీ స్పందించడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలోని ఆమె కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వరుసగా చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలతో.. ఆడపిల్లలు ఇళ్లల్లోంచి బయటకు రావాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొందన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో 12 రోజులు గడిచినా చిన్నారి మృతదేహాన్ని కనిపెట్టలేకపోయారంటే.. ప్రభుత్వ చేతగానితనం స్పష్టమవుతోందని చెప్పారు. చంద్రబాబు, పవన్.. అంబానీ ఇంట పెళ్లికి వెళ్లారుగానీ, ఆ చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించడానికి వారికి సమయమే లేదా? అని ప్రశ్నించారు. కనీసం హోం మంత్రి, చివరకు ఇతర మంత్రులు కూడా వెళ్లలేదంటే.. సామాన్య ప్రజల పట్ల ప్రభుత్వ వైఖరి ఎలా ఉందనేది స్పష్టమవుతోందన్నారు.

దిశ చట్టం నిర్వీర్యంతోనే ఈ దుస్థితి

గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశ చట్టం, దిశ యాప్ తీసుకొచ్చారని, దిశ యాప్‌ను 1.30 కోట్ల మంది డౌన్ లోడ్ చేసుకున్నారని వరుదు కళ్యాణి గుర్తు చేశారు.

బాలికపై లైంగిక దాడి

విడవలూరు: బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి తెగబడ్డాడు. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ముదివర్తికి చెందిన పట్టుపు రోహిత్ మూడు రోజుల కిందట అదే గ్రామానికి చెందిన ఓ బాలికకు మాయ మాటలు చెప్పి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. మూడు రోజులుగా కుమార్తె అన్యమనస్కంగా ఉండటాన్ని గమనించిన తండ్రి.. ఏమైందంటూ ప్రశ్నించడంతో జరిగిన విషయం చెప్పింది. బాలిక తండ్రి బుధవారం విడవలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్టు ఎస్‌ఐ రాజా చెప్పారు.

ఐక్యతతోనే కురబల హక్కుల సాధన

కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్




కేంద్ర మంత్రి బఘేల్, ఆర్.కృష్ణయ్యను సత్కరిస్తున్న సంఘం నేతలు

తిరుపతి కల్చరల్/శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): కురబలంతా ఐక్యతతో తమ హక్కులను సాధించుకోవాలని కేంద్ర మత్స్య, పశుసంవర్థక, డెయిరీ, పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కురబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం తిరుపతిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో కురుబ సామాజిక వర్గ ప్రజాప్రతినిధుల సన్మానసభ నిర్వహించారు. కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తున్నదని, మోదీ సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. కురబలు బాగా చదివి విజ్ఞానవంతులుగా ఎదిగినప్పుడే అభ్యున్నతి సాధ్యమన్నారు. దేశంలోని కురుబ సామాజిక ప్రజాప్రతినిధులను ఒక వేదికపైకి తీసుకొచ్చి సత్కరించడం అభినందనీయమని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన సామాజిక వర్గం కురబ కులమన్నారు. కోట్ల రుణాలు ఎగ్గొట్టిన కార్పొరేట్లకు కొమ్ము కాసే ప్రభుత్వాలు బీసీల సంక్షేమం పట్ల చిన్నచూపుతో దగా చేస్తున్నారని ధ్వజమెత్తారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ సాధన కోసం ఆగస్టు 6, 7 తేదీల్లో 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. కర్ణాటక మాజీ మంత్రి రేవణ్ణ, కర్ణాటక ఎంపీ బసవరాజ్, గుజరాత్ రాజ్యసభ సభ్యుడు బాయ్‌బాబు బాయ్‌ను ఘనంగా సత్కరించారు. ఏపీ కురబ, కురుమ, కురవ సంఘం నాయకులు రెడ్డికుమార్, మంగిరెడ్డెప్ప, గుండ్లూరు శ్రీనివాసులు, రుయామల్లి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అంతకుముందు కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలపై సీనియర్ ఆఫీసర్లతో కమిటీ

ఎమ్మెల్యే గంటా

కొమ్మాది(విశాఖ): ఎర్రమట్టి దిబ్బల్లో జరుగుతున్న తవ్వకాలపై రెవెన్యూ, ఫారెస్ట్, మైనింగ్ కార్పొరేషన్ల సీనియర్ ఆఫీసర్లతో ఒక కమిటీ ఏర్పాటు చేసి దానిపై విచారణ చేయనున్నట్లు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి ఇక్కడ తవ్వకాలను పరిశీలించారు. ఎర్రమట్టి దిబ్బల్లో ఎటువంటి అనుమతులేకుండా తవ్వకాలు జరిగింది వాస్తవమే అని ఒప్పుకున్నారు. ఇప్పటికే ఈ విషయాలను కలెక్టర్‌తో ప్రస్తావించినట్లు చెప్పారు. ఇక్కడ ఉన్న ఎర్రమట్టి దిబ్బల్లో 91 ఎకరాలు భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించారని, దీనిని మినహాయించి ఇక్కడ బిల్డింగ్ సొసైటీకి సంబంధించిన వారు పనులు ప్రారంభించినట్లు సొసైటీ సభ్యులు తెలిపినట్లు వివరించారు.



> జీవితం అని పిలవబడే ఈ అనంతమైన రంగస్థలంలో
> ప్రతి ఒక్కరూ తమ పాత్రను పోషించే దివ్యమైన హక్కును కలిగివున్నారు.
> – బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 18 జూలై 2024

జనశక్తి... శ్రమయుక్తి...

సగం నీళ్ళున్న గాజు గ్లాసును చూసి... సగం నిండుగా ఉందని ఆశావహ దృక్పథం అవలంబించవచ్చు. సగం ఖాళీయే అని నిరాశ పడనూవచ్చని మనస్తత్వ శాస్త్రవేత్తలు చెబుతారు. ప్రపంచ జనాభా గురించి, అందులోనూ భారత జనాభా పొంగు కుంగుల గురించి తాజాగా వెల్లడైన లెక్కల్ని చూసినప్పుడు సరిగ్గా ఇలాగే ఎవరి ఆలోచనలు, అంచనాలు వారివి. ఐక్యరాజ్యసమితి (ఐరాస) గత వారం విడుదల చేసిన 'ప్రపంచ జనాభా దృశ్యం' (డబ్ల్యూపీపీ) నివేదికలోని సమాచారం విస్తృత చర్చనీయాంశమైంది అందుకే! ప్రాథమికంగా ఈ నివేదిక ప్రపంచ జనసంఖ్య ఎలా మారనున్నదీ అంచనా వేసి, వివిధ ప్రాంతాలు, దేశాలపై దాని ప్రభావం ఎలా ఉండనుందో భవిష్యత్ దర్శనం చేస్తోంది. ప్రపంచ జనాభా గణనీయంగా పెరగనుందనీ, 2080ల నాటికి 1000 కోట్లు దాటుతుందనీ నివేదిక అంచనా. ఆ తరువాత నుంచి మొత్తం మీద జనాభా క్రమంగా తగ్గుతుందట. అలాగే, ఇప్పటికే ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశమని పేరుబడ్డ మన భారత్ గురించి కూడా ఈ నివేదిక కీలక అంచనాలు కట్టింది. ఫలితంగా ఈ నివేదిక ఆసక్తి రేపి, ఆలోచనలు పెంచుతోంది.

అసలు 2011 తర్వాత మనం దేశంలో అధికారిక జనగణన జరగనే లేదు. దశాబ్దానికి ఒకసారి జరిపే కీలకమైన ఈ ప్రక్రియ నిజానికి 2021లోనే జరగాల్సి ఉంది. కరోనా కాలంలో ఈ బృహత్తర ప్రయత్నాన్ని ప్రభుత్వం పక్కనపెట్టింది. ఆ మహమ్మారి కథ ముగిసిన ఇన్నేళ్ళ తరువాత కూడా ఎందుకనో దానికి మోక్షం కలగనే లేదు. దేశ జనాభా స్థితిగతులపై స్పష్టమైన అవగాహన కల్పించి, పాలకులకూ, సంక్షేమ పథకాలకూ ఒక దిక్సూచిగా నిలవగలిగిన జనగణనపై ప్రభుత్వం ఎందుకనో ఇప్పటికీ ఉదాసీనత చూపుతోంది. ఈ పరిస్థితుల్లో ఐరాస వెలువరించిన ప్రతిష్ఠాత్మక డబ్ల్యూపీపీ నివేదిక మనకు మార్గదర్శి. లింగ, వయో భేదాల వారీగా వచ్చే 2100 వరకు భారత జనాభా ఎలా ఉండవచ్చనే అంచనాలను ఈ నివేదిక వివరంగా పేర్కొంది. జనసంఖ్యా సంబంధమైన సమాచారంలో ఈ ఐరాస నివేదిక ప్రపంచంలోనే అత్యంత ప్రామాణికమైనది కాబట్టి, సరిగ్గా ఉపయోగించుకుంటే భవిష్యత్ వ్యూహ రచన విషయంలో మన పాలకులకు ఇది బాగా పనికొస్తుంది.

అధికారిక లెక్కలు లేకపోయినా, గడచిన 2023 జనవరి – జూలై నెలల మధ్యలోనే ప్రపంచంలోకెల్లా అత్యధిక జనాభా గల దేశంగా భారత్ అవతరించినట్టు వార్తలొచ్చాయి. గత వారపు ఐరాస లెక్క ప్రకారం ప్రస్తుతం మన దేశ జనాభా 145 కోట్లు. సమీప భవిష్యత్తులోనూ జనసంఖ్య విషయంలో చైనా కన్నా భారతే ముందుండనుంది. 2060లలో కానీ భారత జనాభాలో తగ్గుదల మొదలు కాదు. పెరుగుతున్న ఈ జనాభా తీరుతెన్నులు, మంచీచెడుల పట్ల సహజంగానే రకరకాల విశ్లేషణలు, వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. జనాభాతో పాటు పెరిగే కనీస అవసరాలను తీర్చడం అంత సులభమేమీ కాదన్నది నిజమే. అలాగని అధిక జనాభా అన్ని విధాలా నష్టమని అతిగా భయపడాల్సిన అవసరమూ లేదు. అందుబాటులో ఉండే ఈ మానవ వనరులను సవ్యంగా వినియోగించుకోగలిగితే, ఏ దేశానికైనా దాని జనసంఖ్య అయాచిత వరమే అవుతుంది. ఐరాస నివేదిక ప్రకారం 2060ల వరకు, అంటే వచ్చే నాలుగు దశాబ్దాల పాటు భారత్‌కు అధిక జనాభా తప్పదు. దాన్ని సానుకూలంగా మార్చుకొని, ఎలా దేశాభివృద్ధికి సాధనం చేసుకోవాలన్నది కీలకం.

పనిచేసే వయసు జనాభా భారత్‌లో ప్రస్తుతం 86 కోట్లుంది. 2049 వరకు ఈ సంఖ్య పెరుగుతూ పోయి, అప్పటికి వంద కోట్లు దాటుతుందట. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని సంకల్పం చెబుతున్న మన పాలకులు నివేదికలోని ఈ అంచనాపై లోతుగా దృష్టి పెట్టాలి. పనిచేసే వయసులోని ఈ వంద కోట్ల మందిని ఎంత నిపుణులుగా తీర్చిదిద్దుతామన్నదాన్ని బట్టి దేశ పురోగతి ఉంటుంది. ఇటీవల గుజరాత్‌లో 10 ఉద్యోగాలకు 1,800 మంది – ముంబయ్‌లో 2 వేల ఉద్యోగాలకు 22 వేల మంది హాజరవడం, తొక్కిసలాట జరగడం దేశంలోని నిరుద్యోగ తీవ్రతకు మచ్చుతునక. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సమకాలీన అవసరాలకు తగ్గ నైపుణ్యాభివృద్ధిని కల్పించి, యువజనులను సరైన ఉపాధి మార్గంలో నడపడం ముఖ్యం. అలా చేయగలిగితే ఆర్థిక ముఖచిత్రమే మారిపోతుంది. లేదంటే ఇదే జనశక్తి ఆర్థిక, రాజకీయ అస్థిరతకు కారణమవుతుంది.

ప్రపంచం సంగతికొస్తే రాగల దశాబ్దాల్లో సోమాలియా, రిపబ్లిక్ ఆఫ్ కాంగో సహా ప్రధానంగా ఆఫ్రికా ప్రాంతంలో జనాభా పెరగనుంది. విలువైన సహజ వనరులకు అవి నెలవైనందున భౌగోళిక రాజకీయ ప్రాబల్యం కోసం ఘర్షణలు తలెత్తవచ్చు. మన దాయాది పాకిస్తాన్ సైతం దాదాపు 39 కోట్ల జనాభాతో అమెరికాను సైతం దాటి, ప్రపంచ జనాభాలో మూడో స్థానంతో కీలకంగా మారనుంది. ఐరాస నివేదికలో మరో కీలకాంశం – ప్రపంచ జనాభా పతాక స్థాయికి చేరడానికి రెండు దశాబ్దాల ముందే 2060ల నుంచి భారత జనాభా తగ్గడం మొదలుపెడుతుంది. అదే సమయంలో పనిచేసే వయసులోని వారి సంఖ్య 2050 నుంచే తగ్గిపోనుంది. పనిచేసే వయసు (15 నుంచి 65 ఏళ్ళు) కన్నా తక్కువ గానీ, ఎక్కువ గానీ ఉంటూ ఇతరులపై ఆధారపడేవారి నిష్పత్తి 2040 నుంచే పెరగనుంది. అంటే, నేటి యువశక్తి నైపుణ్యాలనూ, ఆర్జన మార్గాలనూ భవిష్యత్ అవసరాలకూ, ఆధారపడేవారికీ సరిపడేలా తీర్చిదిద్దడం ముఖ్యం. వృత్తివిద్యా శిక్షణ, అప్రెంటిస్‌షిప్‌లతో మన చదువుల్ని కొంత పుంతలు తొక్కించాలి. లేదంటే, ఆధారపడేవారి సంఖ్య పెరిగాక చిక్కులు తప్పవు. ఏమైనా, రాగల మూడు దశాబ్దాలు ఇటు జనశక్తి, అటు శ్రమయుక్తితో సంఖ్యాపరమైన సానుకూలత మనదే. వాటితో ముడిపడ్డ చిక్కుల్ని ఎదుర్కొంటూ, ఈ శక్తిని సమర్థంగా వినియోగించుకోవడమే సవాలు. అందులో తడబడితే... అక్షరాలా 'అమృతకాలం' దాటిపోయినట్టే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** శు.ద్వాదశి సా.6.13 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.2.19 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.7.07 నుండి 8.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.48 వరకు తదుపరి ప.3.07 నుండి 3.58 వరకు, **అమృత ఘడియలు:** సా.5.32 నుండి 6.41 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

'బ్రిక్స్' పార్లమెంట్ రానున్నదా?

విశ్లేషణ



టంకశాల అశోక్

ఈ నెల 11–12 తేదీలలో జరిగిన బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ బ్రిక్స్ పార్లమెంట్ ఏర్పాటు ప్రస్తావన చేశారు. ఆ మాట విని ప్రపంచమంతా ఉలిక్కిపడింది. ఆ కొత్త సంస్థ యూరోపియన్ పార్లమెంటుకు, లేదా అసలు ఐక్యరాజ్య సమితికే పోటీ కాకున్నా సమాంతర సంస్థ కాగలదా అన్న ప్రశ్న ఉత్పన్నమయ్యింది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌కు పోటీయా అన్నట్లు ఇప్పటికే బ్రిక్స్ బ్యాంక్ ఏర్పడింది. బ్రిక్స్ దేశాల మధ్య, దానితో పాటు తమ ద్రవ్య మారకాలను అంగీకరించే దేశాలతో అమెరికన్ డాలర్ బదులు తమ కరెన్సీలలోనే లావాదేవీలు జరపటం పెరిగిపోతున్నది. ఈ పరిణామాలన్నీ అమెరికా ఆధిపత్యాన గల ఏకధ్రువ ప్రపంచాన్ని బహుళ ధ్రువ ప్రపంచంగా తిరుగులేకుండా మార్చుతున్నాయి.

ప్రస్తుతం ప్రపంచమంతటా చర్చ జరుగుతున్న సరికొత్త విషయం బ్రిక్స్ పార్లమెంట్ నిజంగా ఏర్పడవచ్చునా అన్నది! 'బ్రిక్స్' గురించి తెలిసిందే. 'బ్రిక్స్' పార్లమెంటరీ ఫోరం మాట విన్నదే. కానీ 'బ్రిక్స్' పార్లమెంట్ కొత్త మాట. పార్లమెంటరీ ఫోరం సమావేశాలు ఈ నెల 11–12 తేదీలలో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగినప్పుడు, మొదటి రోజున ప్రారంభోపన్యాసం చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్, ఉరుములేని పిడుగువలె బ్రిక్స్ పార్లమెంట్ ఏర్పాటు ప్రస్తావన చేశారు. ఆ మాట విని ప్రపంచమంతా ఉలికి పడింది. ఆయన ఆలోచనలోని ఉద్దేశమేమిటి? 'బ్రిక్స్' దేశాలు అందుకు సమ్మతిస్తాయా? ఆ కొత్త సంస్థ లక్ష్యాలేమిటి? అది యూరోపియన్ పార్లమెంటుకు, లేదా అసలు ఐక్యరాజ్య సమితికే పోటీ కాకున్నా సమాంతర సంస్థ కాగలదా? అనే ప్రశ్నలు శరపరంపరగా తలెత్తటం మొదలైంది. ఇది ముఖ్యంగా పాశ్చాత్య దేశాలకు కలవరపాటు కలిగిస్తున్నదనేది గమనించవలసిన విషయం.

ఇందుకు సంబంధించి తెలుసుకోవలసిన సమాచారాలు కొన్నున్నాయి. అంతకన్నా ముఖ్యంగా అర్థం చేసుకోవలసిన అంతర్జాతీయ విషయాలు చాలా ముఖ్యమైనవి కొన్నున్నాయి. ఇందులో మొదటగా సమాచారాలను చూద్దాం. 'బ్రిక్స్' అనే సంస్థ మొదట 'బ్రిక్' (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా) అనే పేరిట 2006లో ఏర్పడింది. తర్వాత 2011లో సౌత్ ఆఫ్రికా చేరికతో 'బ్రిక్స్' అయింది. ఈ సంవత్సరం ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరాయి. తమను కూడా చేర్చుకోవాలంటూ మరొక పాతిక దేశాల వరకు దరఖాస్తు చేసుకున్నాయి. 'బ్రిక్స్' సభ్యదేశాలు 2009లో పార్లమెంటరీ ఫోరంను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ ఫోరం 10వ సమావేశాలు ఈ నెలలో జరిగినపుడే పుతిన్ తన ప్రతిపాదన చేశారు. ఆ సమావేశంలో మన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పాల్గొన్నారు. నిజానికి బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం అన్నది సభ్య దేశాల పార్లమెంట్ స్పీకర్ల ఫోరం. అందుకు భిన్నంగా, పుతిన్ ప్రతిపాదన కొత్తగా ఒక ఉమ్మడి పార్లమెంటును ఏర్పాటు చేసుకోవటం. 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశాలు వచ్చే అక్టోబర్‌లో రష్యాలోని కజాన్ నగరంలో జరగనున్నాయి. ఈ ప్రతిపాదన అపుడు అధికారికంగా చర్చకు వచ్చి, అందరూ ఆమోదించే పక్షంలో ఆచరణకు వస్తుంది. ఈలోగా ఈ విషయమై ప్రపంచమంతటా చర్చలు సాగుతాయి. మరొకవైపు సభ్య దేశాల మధ్య ముందస్తు సంప్రదింపులు జరగగలవని వేరే చెప్పనక్కరలేదు.

పోతే, బ్రిక్స్ లక్ష్యాలే బ్రిక్స్ పార్లమెంటు లక్ష్యాలు, విధులు కాగలవని భావించవచ్చు. బ్రిక్స్ 2006లో ఏర్పడింది. ఎందుకు? ఈ 18 సంవత్సరాలలో ఆ సంస్థ చేసిందేమిటి? అన్నవి మొదట ఉత్పన్నమయే ప్రశ్నలు. ఇది ప్రధానంగా ఆర్థిక, వాణిజ్యపరమైన సంబంధాల కోసం ఏర్పడినటువంటిది. పరస్పర సంబంధాలతో పాటు ఇతర దేశాలతో ఆర్థిక, వాణిజ్య సంబంధాల అభివృద్ధి కూడా ఈ పరిధిలోకి వస్తుంది. బ్రిక్స్‌కు రాజకీయపరమైన, సైనికమైన, వ్యూహాత్మకమైన లక్ష్యాలు ఏవీ లేవని, గత 18 సంవత్సరాలుగా అదే ప్రకారం పని చేస్తున్నదనేది గమనించవలసిన విషయం.



అంతే గమనించవలసిందేమంటే తన ఆర్థిక లక్ష్యాల ప్రకారం బ్రిక్స్ చాలా సాధించింది. ఉదాహరణకు తాజా లెక్కల ప్రకారం, పాశ్చాత్య దేశాల కూటమి అయిన జీ–7 జీడీపీ ప్రపంచంలో 29 శాతం మాత్రమే కాగా, బ్రిక్స్ జీడీపీ 36.8 శాతానికి చేరింది. ఆర్థిక రంగంలో జరుగుతున్నదాని సూచనలను బట్టి చూడగా ఈ వ్యత్యాసం ఇంకా పెరుగుతూ పోగలదన్నది నిపుణుల అంచనా. అది చాలదన్నట్లు మునుముందు సౌదీ అరేబియా, ఇండోనేషియా, మెక్సికో తదితర దేశాలు చేరినపుడు పరిస్థితి ఏమిటో ఊహించవచ్చు. అమెరికా శిబిరానికి బ్రిక్స్ అంటే సరిపడకపోవటానికి ముఖ్యకారణం ఇదే. లోగడ ఆసియాలో ఏషియాన్, ఆఫ్రికాలో ఎకోవాస్, ఇఎసి, లాటిన్ అమెరికాలో సదరన్ కామన్ మార్కెట్ వంటివి ఏర్పడ్డాయి. ఏషియాన్ గొప్పగా విజయవంతం కాగా తక్కినవి అంతగా కాలేదు. పైగా వాటిలో అమెరికా జోక్యాలు బాగా సాగినందున తమకు పోటీగా మారలేదు. తమను అధిగమించటం అంతకన్నా జరగలేదు. బ్రిక్స్ రికార్డు వీటన్నిటికి భిన్నంగా మారింది. ఆ సంస్థ అమెరికా జోక్యానికి సమ్మతించలేదు. ఇండియాతో సహా ఎవరూ ఒత్తిళ్లకు లొంగలేదు. ఇది చాలదన్నట్లు అర్థికాభివృద్ధిలో తమను మించిపోతున్నారు. ఒత్తిళ్లను కాదని ఇదే సంవత్సరం ఈజిప్టు, యూఏఈ వంటివి చేరాయి. ఇరాన్‌ను చేర్చుకోరాదన్న ఒత్తిడికి బ్రిక్స్ సమ్మతించలేదు. అదే పద్ధతిలో సౌదీ, టర్కీ, ఇండోనేషియా, లిబియా, మెక్సికో వంటివి ముందుకు వస్తున్నాయి.

ఇదంతా చాలదన్నట్లు, ప్రపంచంపై పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆధిపత్యాన్ని సవాలు చేసే పరిణామాలు మరికొన్ని జరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌కు పోటీయా అన్నట్లు బ్రిక్స్ బ్యాంక్ ఒకటి 2014 లోనే ఏర్పడింది. అమెరికన్ డాలర్ ప్రాబల్యాన్ని అరికట్టేందుకు బ్రిక్స్ కరెన్సీ అయితే ఇంకా రూపొందలేదు గానీ, బ్రిక్స్ దేశాలకు చెల్లింపుల కోసం బ్రిక్స్ చెయిన్ పేరిట ఒక సాధనం చలామణీలోకి వచ్చింది. అట్లాగే ఈ దేశాల మధ్య, దానితో పాటు తమ ద్రవ్య మారకాలను అంగీకరించే దేశాలతో అమెరికన్ డాలర్ బదులు తమ కరెన్సీలలోనే లావాదేవీలు జరపటం పెరిగిపోతున్నది. బ్రిక్స్ బ్రిడ్జ్ పేరిట మరొక చెల్లింపుల పద్ధతి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటన్నింటి ప్రభావాలతో పాశ్చాత్య ప్రపంచపు ఆర్థిక ప్రాబల్యం, పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్యం క్రమంగా బలహీనపడుతున్నాయి. ఉదాహరణకు ప్రస్తుత సంవత్సరంలో బ్రిక్స్ సగటు అర్థికాభివృద్ధి 3.6 శాతం మేర, జీ–7 దేశాలది కేవలం 1 శాతం మేర ఉండగలవని అంచనా. ప్రపంచంలో ఇప్పటికే రెండో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారిన చైనా మరొక దశాబ్దం లోపలే అమెరికాను మించగలదన్నది అంతటా వినవస్తున్న మాట. ఈ పరిణామాలన్నీ అమెరికా ఆధిపత్యాన గల ఏకధ్రువ ప్రపంచాన్ని బహుళధ్రువ ప్రపంచంగా తిరుగులేకుండా మార్చుతున్నాయి. ఈ శతాబ్దం ఆసియా శతాబ్దం కాగలదనే జోస్యాలు ఆ విధంగా బలపడుతున్నాయి. చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో అమెరికా ఒత్తిళ్లను కాదని ఇప్పటికి 150 దేశాలు చేరటం, అందులో వారి శిబిరానికి చెందినవి కూడా ఉండటం ఈ ఆర్థిక ధోరణులకు దోహదం చేస్తున్నది.

ఈ విధమైన ప్రభావాలను ముందుగానే అంచనా వేసి కావచ్చు అమెరికన్లు, యూరోపియన్లు మొదటినుంచే బ్రిక్స్‌ను, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌ను అడ్డుకునేందుకు, బ్రిక్స్‌లోని సభ్య దేశాలను ఒత్తిడి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తూ వస్తున్నాయి. రకరకాల ఆంక్షలు ఏదో ఒక సాకుతో విధించటం (ఇండియాపై కూడా), వివిధ దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను భంగపరచజూడటం అందులో భాగమే. భారత, రష్యాల విషయంలోనూ అదే వైఖరి చూపటానికి తాజా ఉదాహరణ ఈ నెల ఎనిమిదిన ప్రధాని మోదీ, పుతిన్‌ను కలవటంపై ఆగ్రహించటం. అమెరికా శిబిరం ప్రజాస్వామ్యమనీ, ఆసియా దేశాల స్వేచ్ఛ అనీ, అంతర్జాతీయ నియమాలకూ, ఐక్య రాజ్యసమితి ఛార్టర్‌కూ కట్టుబడటమనీ నీతులు చాలానే చెప్తుంది. కానీ అందుకు విరుద్ధమైన తమ చర్యల గురించి ఎన్ని రోజుల పాటైనా చెప్పవచ్చు.

వీటన్నింటికి విరుగుడుగా తక్కిన ప్రపంచ దేశాలు తీసుకుంటున్న వివిధ చర్యలలో, బ్రిక్స్ పార్లమెంట్ అనే కొత్త ప్రతిపాదన ఒక ముందడుగు కాగల అవకాశం ఉంది. ప్రపంచ దేశాల మధ్య సమానత్వ ప్రాతిపదికగా పరస్పర సహకారానికి, ఇతోధికాభివృద్ధికి అవసరమైన చర్చలు బ్రిక్స్ పార్లమెంటులో జరగాలన్నది తన ఆలోచన అయినట్లు పుతిన్ చెప్తున్నారు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఫేవరెట్!



స్కూల్లో ఉన్నప్పుడు ఇంగ్లిష్ టీచర్ తమ అభిమాన టీచర్‌గా ఉన్నవాళ్లు నాలాగే ఇంకా ఎవరైనా ఉన్నారా? అసలు ఎప్పుడూ ఎందుకు ఇంగ్లిష్ టీచరే మనకు అభిమాన టీచర్‌గా ఉంటారు?

– ఇస్మత్ ఆరా, జర్నలిస్ట్

సమాజ వాస్తవం



కొంతమంది అమ్మాయిలు దీన్ని నిజంగా అర్థం చేసుకోవాలి: కొన్నిసార్లు మీరు వెళ్తున్న ప్రదేశాన్ని బట్టి దుస్తులు ధరించాలి; ప్రతిసారీ 'నా జీవితం, నా ఎంపిక, నా దుస్తులు' అనేది ఉండదు.

– ధీమహీ జైన్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సింగిల్స్ బిజినెస్



పెళ్లి చేసుకుని ఒంటరితనానికి గురికావడం కంటే, ఒంటరిగా ఉండటం మేలు. నాకు నలభై ఏళ్లకు కొంచెం తక్కువ. కుటుంబాలు అద్భుతం, కానీ అన్ని వివాహాలు గొప్పగా లేవు. వివాహితుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. రానున్న 10-15 ఏళ్లలో నలభై దాటిన సింగిల్స్ జీవితాన్ని అర్థవంతం చేసే స్టార్టప్స్ వస్తాయి. అది మంచి వ్యాపారంగా వర్ధిల్లుతుంది కూడా!

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

బాగైపోతారంతే!



యూపీఎస్సీకి ఏదో మంత్ర శక్తి ఉంది. ఎంపికకు ముందు కాళ్లల్లో సమస్య ఉన్న ఒక ఐఏఎస్ అధికారిణి ఇప్పుడు నదిలో రాఫ్టింగ్ చేస్తూ, సైక్లింగ్ చేస్తూ, మైళ్లకొద్దీ ట్రెక్కింగ్ చేస్తూ కనబడింది. ఎయిమ్స్ గురించి గొప్పగా చెబుతుంటారు గానీ, యూపీఎస్సీ నిజమైన ఆసుపత్రి.

– ముదిత్ గుప్తా, యూపీఎస్సీ బోధకుడు

డాలర్ తగ్గాలి!



రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ తాలూకు ఈ అభిప్రాయాలతో నాకు ఏకీభావం ఉంది: 1. ఇప్పటికీ అమెరికాకు అత్యంత ప్రముఖ విదేశీ శత్రువు చైనా. 2. అమెరికా ప్రధాన ప్రాంతాల్లో పునఃపారిశ్రామికీకరణ మొదలుపెట్టాలి. 3. 'బలమైన డాలర్' అనేది పునఃపారిశ్రామికీకరణకు అవరోధం.

– నోవా స్మిత్, యూఎస్ బ్లాగర్

అలాంటి కాలం వస్తుందా?



1939-1945 మధ్య ఆరేళ్లపాటు జర్మనీ ప్రాపగాండా మంత్రిత్వ శాఖ అధిపతిగా జోసెఫ్ గోబెల్స్ ఒక సూచన చేశారు. యూదులందరికీ 'సాధారణ ప్రత్యేక చిహ్నం' ఉండాలన్నారు. యూదు బ్యాడ్జీ ధరించడం అనేది యూదులందరికీ, ఆఖరికి ఆరేళ్ల పిల్లలకు కూడా తప్పనిసరైంది.

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

మన యూపీ నయం



2022లో దేశంలోని మరి ఏ ఇతర రాష్ట్రంలో లేనంతగా ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక హత్యలు జరిగాయి. 3,600 సంఘటనలు. అంటే రోజుకు పది. ఏటా ప్రతిరోజూ! ఇందులో అన్నిరకాల హత్యలున్నాయి– తుపాకీ కాల్పులు, తల నరకడాలు, మూకదాడులు, అన్నీ! అదే అమెరికాలో కేవలం తుపాకీ కాల్పుల హత్యలే ఏటా 48,000. అంటే... రోజుకు 132. ఇవన్నీ అధికారిక లెక్కలే!

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

అభివృద్ధికి కొలమానం... సంపదా? సంతోషమా?

అభిప్రాయం



దానీ

ఆత్మహత్యల్ని సామాజిక సమస్యగా పేర్కొంటూ దీని పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త గౌరవ్ కుమార్ బన్సాల్ వేసిన ప్రజాప్రయోజన వాజ్యం (పిల్) విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. సామాన్యులతోపాటూ వైద్యశాస్త్ర నిపుణులు సహితం ఇప్పటికీ ఆత్మహత్యల్ని మానసిక సమస్యగా పరిగణిస్తుంటారు. భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు మన సాధారణ అవగాహనలో ఒక గొప్ప ముందడుగు అనే భావించాలి.

ప్రభుత్వాలు ఆర్థిక సూచికల్ని ప్రచారం చేసుకున్నంతగా ఆనంద సూచికల్ని ప్రచారం చేయవు. స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) వంటి ఆర్థిక సూచికల గణాంకాలను సేకరించడం సులువు. అవి ప్రజలకు కూడ సులువుగా అర్థమవుతాయి. ఆరోగ్యం, ఆనందం, సంతృప్తి, భవిష్యత్తు మీద నమ్మకం వంటి సామాజిక సూచికల గణాంకాలు తీయడం అంత సులువు కాదు. మనుషులు తమ వ్యక్తిగత ఆందోళన, ఒత్తిడి, కుంగుబాట్లను ఇతరులతో పంచుకోరు.

జనాభాలో మనదేశం ఇప్పుడు ప్రపంచంలో అగ్రస్థానంలో వుంది. మన తరువాత చైనా, అమెరికా, ఇండోనేషియా, పాకిస్తాన్, నైజీరియా, బ్రెజిల్, బంగ్లాదేశ్, రష్యా, మెక్సికో ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థల్లో 29 ట్రిలియన్ డాలర్లతో అమెరికాది అగ్రస్థానం. నాలుగు ట్రిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో ఇండియా ఉంది. త్వరలో మనం జపాన్, జర్మనీలను అధిగమించి ప్రపంచంలో మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నట్టు కేంద్ర ప్రభుత్వ పెద్దలు కొంతకాలంగా గట్టిగా ప్రచారం చేస్తున్నారు. అది సాధ్యమూ కావచ్చు.

ఈ సందర్భంగా గమనించాల్సిన ముఖ్యమైన అంశాలు మరికొన్ని వున్నాయి. మనం జనాభాలో చైనాను అధిగమించవచ్చుగానీ చైనా ప్రజల జీవనస్థాయికి చేరుకోలేము. చైనా సాలీన తలసరి ఆదాయం 13 వేల డాలర్లు. అది అమెరికాలో 85 వేల డాలర్లు. మన దేశంలో 3 వేల డాలర్లకన్నా తక్కువ. జీడీపీలో మనం జర్మనీని అధిగమించవచ్చు గానీ, మన ప్రజల జీవన స్థాయి జర్మన్ల జీవన స్థాయిలో 20వ వంతు మాత్రమే వుంటుంది. ఇవి సగటు లెక్కలు మాత్రమే. వాస్తవానికి జనాభాలో 20 శాతం జీవనస్థాయి ఇంతకన్నా చాలా మెరుగ్గా వుంటుంది. 80 శాతం జీవనస్థాయి ఇంతకన్నా మరీ హీనంగా వుంటుంది. మన దేశంలో సంపదకు లోటు లేనప్పటికీ సంపద పంపిణి విధానంలో ఘోరమైన లోటు ఉన్నదని ఈ గణాంకాలు చెబుతున్నాయి.



జీడీపీ, తలసరి ఆదాయాలకు భిన్నమైన ప్రమాణాలు కూడా సమాజంలో ఉంటాయి. ఐక్య రాజ్య సమితి ప్రతి సంవత్సరం మార్చి 20న 'అంతర్జాతీయ ఆనంద దినోత్స'వాన్ని నిర్వహిస్తోంది. ఆ సందర్భంగా ప్రపంచ ఆనంద నివేదికను (వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్–డబ్ల్యూహెచ్ఆర్) పకటిస్తుంది. డబ్ల్యూహెచ్ఆర్ – 2024లో 143 దేశాల ర్యాంకులున్నాయి. గత ఏడు సంవత్సరాలుగా ఫిన్లాండ్ ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. స్కాండినేవియన్ రాజ్యాలు, సంక్షేమ దేశాలుగా పేరొందిన నార్వే, స్వీడన్, డెన్మార్క్ తొలి పది సంతోష దేశాల్లో ఉన్నాయి. అఫ్గానిస్తాన్ అన్నింటికన్నా దిగువన వుందని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. మరి ఈ జాబితాలో ఇండియా స్థానం ఎక్కడా? 143లో 126. శ్రీలంక, మయన్మార్, పాకిస్తాన్, నేపాల్ దేశాల ప్రజలు మనకన్నా సంతోషంగా ఉన్నారని ఐక్య రాజ్య సమితి ప్రకటించింది.

సంతోష సూచికలకు, ఆత్మహత్యలకు ఒక విలోమానుపాత సంబంధం ఉంటుంది. సంతోష సూచికలు మెరుగ్గా ఉంటే ఆత్మహత్యల రేటు తక్కువగా ఉంటుంది. సంతోష సూచికలు తక్కువగా ఉంటే ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటుంది. సంతోష సూచికలు తక్కువగావున్న కారణంగా భారతదేశంలో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉందని నివేదికలు చెపుతున్నాయి. ఇండియా ఇప్పుడు ఆత్మహత్యల కేంద్రంగా మారిందని అనేకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2022లో దేశంలో 1 లక్షా 71 వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. జనాభాలో లక్ష మందికి సాలీనా 12.4 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఇది ప్రపంచ రికార్డు. ఇవి అధికారిక గణాంకాలు మాత్రమే.

మనుషులు వ్యక్తిగత మానసిక కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటారని అనిపించడం సహజం. కానీ, ఇది రూపం మాత్రమే; సారం వేరు. ఆత్మహత్యలకు అసలు కారణం 'సమాజం సంక్షోభంలో పడడం' అని తొలిసారిగా చెప్పినవాడు ఫ్రెంచ్ సమాజ శాస్త్రవేత్త ఎమిలే దుర్ఖేమ్ (1858–1917). ఆయన అభిప్రాయం ప్రకారం సమాజ మౌలిక స్వభావం సంఘీభావం. సమాజం తన మౌలిక స్వభావమైన సంఘీభావాన్ని కోల్పోయినపుడు అక్కడ మనుషులు బతకలేరు. గ్రామీణ ప్రాంతాల్లో కన్నా నగరాల్లో, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోకన్నా అభివృద్ధి చెందిన దేశాల్లో; నిరక్షరాస్యులకన్నా విద్యావంతుల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి.

ప్రతి చారిత్రక దశలోనూ తిరిగితిరిగి ఒకే ప్రశ్న మన ముందుకు వచ్చి నిలబడుతుంది. అభివృద్ధికి కొలమానం ఏమిటి?– సంపదా? శాంతా? జీడీపీ పెరుగుదల రేటా? సంతోష సూచికలా?

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోనే ఒక అమానవీయ లక్షణం ఉందన్నాడు కార్ల్ మార్క్స్. కార్మికుడు తాను ఉత్పత్తి చేసిన సరుకుకు పరాయివాడైపోతాడు అన్నాడు. ఈ పరాయీకరణ ఫ్యాక్టరీ నుండి ఫ్యామిలీ లోనికి ప్రవేశించినపుడు మనిషి ఒంటరివాడయిపోతాడు. సంఘీభావానికి నోచుకోలేడు. ఓదార్చేవాడు కనుచూపు మేరలో కనిపించకపోతే మనిషి స్వచ్ఛందంగా లోకాన్ని వదిలేస్తాడు. మనం మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి ముందే ఆత్మహత్యల నిలయంగా మారాము. అదీ విషాదం!

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు

మానసికంగా త్యజించాలి!

సన్యాసం... భౌతికంగా కన్నా అంతరంగిక ప్రాముఖ్యాన్ని అధికంగా కలిగి ఉంటుంది. కర్తవ్యాన్ని మానుకోవడం సన్యాసం కాదు. మతపరమైన ఆచార, సంప్రదాయాలు పాటించడం, మంత్రోచ్చాటన చేయడం, కాషాయ వస్త్రాలు ధరించడం వంటివి సన్యాసానికి చిహ్నాలు కాదు. అహంకార, మమకారాలను విడిచిపెట్టాలి. బాధలన్నింటికీ మూలం ఇవే. అందుకే 'నేను', 'నాది' అనే భావాలను మానసికంగా త్యజించినప్పుడే ఎవరైనా సన్యాసి కాగలడు. కాషాయ వస్త్రాన్ని ధరించడం మానసిక త్యాగానికి చిహ్నం మాత్రమే.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

అంతరంగ పరిత్యాగం పొందాలంటే, కొన్ని క్రమశిక్షణా పద్ధతులు లేక ఆచరణలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. సంపద, సంతానం, పేరు ప్రఖ్యాతులు కావాలనే కోరికలను ప్రతి సన్యాసీ త్యజించాలి. కేవలం ఇంతటితో ఆగకుండా వైరాగ్యాన్ని పెంచుకోవాలి. ప్రపంచంలోని వస్తువులతో సంబంధం కలిగి ఉండడం వల్ల కష్టాలు కలుగుతాయనే అవగాహన అవసరం. వాస్తవంగా సన్యాసం అనేది ఇవ్వడానికి లేక పుచ్చుకోవడానికి వీలైన వస్తువు కాదు. కేవలం స్వయం ప్రేరణతో ప్రయత్నించి, తగిన కృషితో సంపాదించదగిన ఒక స్థితి. ఎవరైతే ఆలోచించకుండా, తొందరపడి సన్యాసం స్వీకరిస్తారో అటువంటివారు ఆ తర్వాత తప్పనిసరిగా పశ్చాత్తాప పడవలసి ఉంటుంది.

సంసార బంధాలను తెంచుకొని, శాశ్వత ఆనందాన్ని పొందడానికి శ్రద్ధతో ప్రయత్నించే వ్యక్తికి అనేక మార్గాలు ఉన్నాయి. ముఖ్యంగా కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, జ్ఞానయోగం అనేవి అందరికీ బాగా తెలిసినవే. వీటికి అదనంగా ఆచరణ సాధ్యమైన వేరొక మార్గాన్ని మన పవిత్ర గ్రంథాలు సూచిస్తున్నాయి. అదే 'సన్యాసయోగం'.

ప్రాపంచిక వస్తువుల నుంచి, ఉద్రేకాల నుంచి, ఆలోచనల నుంచి మనస్సును దూరం చేయడమే ఈ యోగంలోని ప్రధానాంశం. ప్రాపంచిక విషయాల నుంచి దూరమైన మనస్సు భగవంతుని పాదపద్మాలను అంటిపెట్టుకొని ఉంటుంది. ఈ దృష్టికోణంలో ఆలోచిస్తే 'సన్యాసయోగం' అంటే అసంగయోగం. ఈ యోగాన్ని ఎల్లప్పుడూ స్థిరంగా అభ్యాసం చేసినట్లయితే బుద్ధిపూర్వకంగా ప్రయత్నం చేసే సాధకుని ఆత్మ కడకు లక్ష్యాన్ని చేరుతుంది. అంటే సన్యాసి ఆత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడన్నమాట!

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

శ్రీమహావిష్ణువు ఆశీస్సులు అందరిపై ఉండాలి

ప్రజలకు తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: శ్రీ మహావిష్ణువు ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆకాంక్షించారు. 'పవిత్రమైన తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ మహా విష్ణువు ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి. అందరినీ చల్లగా చూడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ తెలుగువారందరికీ శుభాకాంక్షలు' అని ఎక్స్‌లో బుధవారం పోస్ట్ చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో 'శాకంబరీ' సందడి

విరాళంగా క్యాప్సికం, యాలకుల దండలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాల సందడి ప్రారంభమైంది. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి, ఆలయ అలంకరణకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను విరాళంగా పలువురు దాతలు బుధవారం సమర్పించారు. ఉయ్యూరుకు చెందిన అనూరాధ, హైదరాబాద్‌కు చెందిన దుర్గా మల్లేశ్వర్ క్యాప్సికం బాక్స్‌లు, విజయవాడకు చెందిన వక్కలగడ్డ పవన్‌కుమార్ కుటుంబం అమ్మవారి మూలవిరాట్ అలంకరణ నిమిత్తం రూ.10 వేల విలువైన ఎనిమిది కేజీల యాలకులతో తయారు చేసిన దండను దేవస్థానానికి అందించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

21న శాకంబరీదేవిగా శ్రీశైలం భ్రమరాంబ దర్శనం

శ్రీశైలం టెంపుల్: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 21న శ్రీశైలం శ్రీభ్రమరాంబాదేవి శాకంబరీదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమ్మవారి మూలమూర్తిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల ఫలాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే అమ్మవారి ఉత్సవమూర్తి, ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరిదేవి, గ్రామదేవత అంకాళమ్మ, ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు.

సురక్షితంగా ఇంటికి చేరిన కువైట్ బాధితుడు



వాల్మీకిపురం: కువైట్ ఎడారిలో కష్టాలు పడుతూ తనను ఆదుకోవాలని కోరుతూ వీడియో చేసిన బాధితుడు శివ..రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సురక్షితంగా ఇంటికి చేరుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో నెల రోజుల ముందు శివ ఓ ఏజెంట్ సహాయంతో కువైట్‌కు వెళ్లాడు. వెళ్లే ముందు చెప్పిన పని ఒక్కటి అక్కడ చేయించిన పని ఒక్కటవడంతో ఆయన తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. ఈ నేపథ్యంలో తాను కువైట్‌లోని ఎడారిలో దుర్భరమైన జీవితం గడుపుతున్నానని, తనను ఆదుకోవాలంటూ ఆయన ఇటీవల సోషల్ మీడియాలో వీడియో పెట్టాడు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం అక్కడ ఎంబసీతో సంప్రదించి..శివను కువైట్ నుంచి భారత్‌కు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీంతో శివ బుధవారం అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చింతపర్తికి చేరుకున్నాడు. భార్య, పిల్లలను కలుసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది.

ఎక్సైజ్ పాలసీపై విస్తృతస్థాయిలో అధ్యయనం

శ్రీవారి దర్శనానంతరం మీడియాతో మంత్రి కొల్లు రవీంద్ర



తిరుమల: ఎక్సైజ్ పాలసీపై విస్తృత స్థాయిలో అధ్యయనం చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో అనేక శాఖల్లో జరిగిన అవకతవకలపై శ్వేత పత్రాలు విడుదల చేశామన్నారు. మరో మూడు శాఖలపై శ్వేతపత్రాలు త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. అన్నిశాఖల్లో ప్రక్షాళన చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించడమే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు.

నాన్నకు మెడల్ గిఫ్ట్‌గా ఇవ్వాలని..

పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమైన జ్యోతికశ్రీ

అమ్మాయి అని వెనకడుగు వేయలేదు. తండ్రి కల నెరవేర్చాలనే తపనతో 11 ఏళ్లుగా కఠోర శ్రమ చేసింది. రన్నింగ్ ట్రాక్‌లో చీతాలా పరుగు పెట్టింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించింది. ఇప్పుడు ఒలింపిక్స్ పతకానికి ఒక్క అడుగు దూరంలో నిలిచింది దండి జ్యోతిక శ్రీ. ఉమెన్స్ 400 మీటర్ల రిలే జట్టులో భారత్ తరఫున పోటీ పడటానికి పారిస్ పయనమైంది. తను పుట్టిన తణుకు ప్రాంతానికి ప్రపంచ గుర్తింపు తెచ్చేందుకు సిద్ధమైంది.

400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చాటడానికి సిద్ధం

ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు కైవశం

తన కలలు నిజమయ్యాయి అంటున్న తండ్రి

తణుకు అర్బన్: అథ్లెటిక్స్‌లో రాణించి అందరి మన్ననలు పొందుతున్న దండి జ్యోతికశ్రీ ఈ నెల 26 నుంచి పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో భారతదేశం తరఫున పోటీ పడుతోంది. ఆగస్టు తొమ్మిదిన జరిగే మహిళల 400 మీటర్ల రిలేలో జ్యోతికశ్రీ సత్తా చాటనుంది. ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన జ్యోతికశ్రీ అసామాన్య ప్రతిభతో ఒలింపిక్స్ వరకూ ఎదగడం ఒక స్ఫూర్తిగా నిలుస్తోంది. తమ ప్రాంతానికి చెందిన అమ్మాయి ఒలింపిక్స్ వరకూ వెళ్లడంతో తణుకు ప్రాంతంలోని ప్రజల ఆనందానికి అవధుల్లేవు. ఒలింపిక్స్‌లో మెడల్ సాధించి రాష్ట్రానికే కాకుండా దేశానికి పేరు తీసుకువస్తుందని వారంతా ఆకాంక్షిస్తున్నారు. ఇక ఒలింపిక్స్‌కు ఎంపికైన వెంటనే ఆమెకు రాష్ట్రం నలుమూలల నుంచి శుభాకాంక్షల సందేశాలు వెల్లువెత్తాయి.

ప్రస్థానమిలా..

బాడీ బిల్డర్‌గా రాణించాలనుకున్న జ్యోతికశ్రీ తండ్రి శ్రీనివాసరావు కోరిక అప్పట్లో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా నెరవేరలేదు. తనకు కుమారుడు జన్మిస్తే మిస్టర్ ఇండియాగా తీర్చి దిద్దాలని అనుకున్నారు. అయితే ఇద్దరు కుమార్తెలు జన్మించారు. పెద్ద కుమార్తె కీర్తి సత్యశ్రీ చదువు పట్ల ఆసక్తి చూపగా.. చిన్న కుమార్తె జ్యోతికశ్రీ చదువు పట్ల మక్కువ చూపిస్తూనే తండ్రి కోరిక మేరకు పాఠశాల స్థాయిలోనే అథ్లెట్‌గా మారింది. 13 సంవత్సరాల వయసులో తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ప్రాక్టీస్ మొదలు పెట్టింది. అక్కడ కీర్తిశ్రీ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ కట్లపర్తి సీతారామయ్య తర్ఫీదులో రాటుదేలింది. స్థానిక మాంటిస్సోరీ స్కూలులో 10వ తరగతి పూర్తిచేసేలోగా జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో పలు పతకాలు సాధించింది. విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో ఇంటర్ చదువుతూ అప్పటి ఆంధ్ర చీఫ్ కోచ్ వినాయక ప్రసాద్ కోచింగ్‌లో అండర్–18 జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంది. కెన్యాలో నిర్వహించిన యూత్ వరల్డ్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసింది. 2020లో హైదరాబాద్‌లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ కోచింగ్‌లో బ్యాంకాక్, కెన్యాల్లో జరిగిన పోటీలతో పాటు భారతదేశ పలు ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సత్తా చాటి పలు స్వర్ణ, రజత పతకాలు సాధించింది. 2022లో ఇండియన్ క్యాంప్‌లో తర్ఫీదు పొందేలా అర్హత సాధించింది. తాజాగా 2024 మే నెలలో బహామాస్‌లో నిర్వహించిన వరల్డ్ ఉమెన్స్ రిలేలో అత్యుత్తమ ప్రదర్శన ద్వారా ఒలింపిక్స్‌కి అర్హత సాధించి యావత్ దేశాన్ని తన వైపు చూసేలా చేసింది. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 34 మెడల్స్ సాధించగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 50 వరకు మెడల్స్ సాధించింది.



సాధించిన మెడల్స్



మెడల్స్‌తో..

నాన్న కోసమే నా పరుగు..

నాన్న కల నెరవేర్చేందుకే నా పరుగు మొదలుపెట్టాను. ఒక కొడుకు ఉంటే తనను క్రీడాకారుడిగా తీర్చిదిద్దేవాడిని అనే నాన్న మాటలు నాలో పట్టుదలను పెంచాయి. దీంతో అథ్లెట్‌గా ఎదగాలనే దృఢ నిశ్చయంతో సాధన చేశాను. నాన్నతో పాటు మా అమ్మ, అక్క ఇచ్చిన సహకారం, కోచ్‌లు అందించిన అత్యున్నతమైన సూచనలు, సలహాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించాను. ఈ క్రమంలో ఎప్పటికైనా ఒలింపిక్స్‌కి అర్హత సాధించాలనే సంకల్పంతో ప్రయత్నించాను. భారతదేశం తరఫున ఒలింపిక్స్‌కు అర్హత సాధించాననే ప్రకటన నాకు చాలా సంతోషాన్నిచ్చింది. ఒలింపిక్స్‌లో పతకం సాధించి నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వాలని సిద్ధమవుతున్నాను.

– దండి జ్యోతికశ్రీ, అథ్లెట్

నా కల నెరవేరింది..

నేను సాధించలేకపోయిన గుర్తింపును నా కుమార్తె సాధించాలనే కృషి, పట్టుదల నాలో పెరిగింది. జ్యోతికశ్రీకి ఐఏఎస్, ఐపీఎస్ వైపు వెళ్లాలని చిన్ననాటి నుంచి ఆశ పడింది. నాకు ఇష్టమైన క్రీడారంగంలోకి వచ్చి నా కోరిక నెరవేర్చేందుకు పట్టుదలతో కృషి చేసింది. దేశం మెచ్చే క్రీడాకారిణిలా తనను తీర్చిదిద్దే క్రమంలో నాకు ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా నేనెప్పుడూ బెదరలేదు. ఆర్థిక సమస్యలను జయిస్తూ ముందుకు వెళ్లాను. నా కుమార్తె ప్రపంచంతో పోటీపడే స్థాయికి వెళ్లడం ద్వారా నేను కన్న కలలు నిజమయ్యాయి. ఒక తండ్రిగా నాకు ఇంతకంటే తృప్తి ఇంకేం కావాలి.

– దండి శ్రీనివాసరావు, జ్యోతికశ్రీ తండ్రి



తల్లిదండ్రులు, సోదరి సత్యశ్రీతో జ్యోతికశ్రీ

నేడు శ్రీవారి అక్టోబర్ నెల ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల



తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారిలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అలాగే వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఈ నెల 22న మధ్యాహ్నం మూడు గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో గదుల కోటాను మధ్యాహ్నం మూడు గంటలకు, తిరుమల–తిరుపతి శ్రీవారి సేవ కోటా ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. కాగా, అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు సుప్రభాత సేవ మినహా, మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. అక్టోబర్ 11, 12వ తేదీల్లో సుప్రభాత సేవతో పాటు అన్ని ఆర్జిత సేవలు రద్దయ్యాయి. అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు అంగప్రదక్షిణ, వర్చువల్ సేవా దర్శనం టికెట్లను రద్దు చేశారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.



ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందచేశారు. అనంతరం మల్లేశ్వరస్వామిని న్యాయమూర్తి దర్శించుకున్నారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)

భక్తులతో కోటప్పకొండ కిటకిట

తొలి ఏకాదశి రోజు త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకున్న వేలాది మంది భక్తులు / ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్

నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటప్పకొండపై కొలువైన త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకునేందుకు బుధవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కోటప్పకొండపైన, ఘాట్ రోడ్డు, ధ్యానశివుని విగ్రహం, నాగేంద్రుని పుట్ట, కొండ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం, అభిషేక దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో మూలవిరాట్‌కు అభిషేకాలు నిలిపివేసి అభిషేక మండపంలో నిర్వహించారు. ఆలయం వెనుక ఉన్న రావిచెట్టు వద్ద మహిళలు పూజలు నిర్వహించి పొంగళ్లు సమర్పించారు. సోపాన మార్గం ద్వారా మెట్లపూజ చేసుకుంటూ భక్తులు కొండపైకి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పాతకోటయ్య ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. భక్తులకు పేలపిండి ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను కోటప్పకొండకు నడిపింది. ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, ఈవో ఎస్.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి వారిని ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కోటప్పకొండ గిరి ప్రదక్షిణ చేశారు.

ట్రాఫిక్ జామ్‌తో భక్తుల ఇబ్బందులు..

కోటప్పకొండ ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ట్రాక్టర్‌లు, కార్లు, బైక్‌లపై భక్తులు రావడంతో కొండపైన పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయింది. దీంతో ఘాట్ రోడ్డు వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులు దృష్టి పెట్టలేదు. దీంతో భక్తులు రెండు గంటలపాటు ఘాట్ రోడ్డులోనే వేచి ఉండాల్సి వచ్చింది. గతంలో కొండపైన పార్కింగ్ ప్రదేశం వాహనాలతో నిండిపోతే కొండ దిగువన టోల్‌గేట్ సమీపంలోనే వాహనాలను నిలిపివేసేవారు. ఆ దిశగా బుధవారం పోలీసులు చర్యలు తీసుకోకపోవటంతో భక్తులు ఇబ్బందిపడ్డారు.



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి



ఘాట్‌రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

రాష్ట్రవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో మొహర్రం

సాక్షి, అనంతపురం/బనగానపల్లె: త్యాగం, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచే మొహర్రంను రాష్ట్ర వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకున్నారు. అనంతపురం జిల్లా గూగూడులో అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాలు కనుల పండువగా సాగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కుళ్లాయిస్వామిని దర్శించుకున్నారు. చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. ఇక పీర్లబేటీ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి జనసాగరాన్ని తలపించింది. బొప్పేపల్లి కాశీంస్వామి మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బత్తలపల్లి ప్రధాన కూడలిలో పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ముష్టూరు గ్రామాల పీర్లు బత్తలపల్లి చిన్నఖాసీం, పెద్ద ఖాసీం స్వాములతో బేటీ అయ్యాయి. అలాగే మొహర్రంను నంద్యాల జిల్లా బనగానపల్లెలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణలోని హైదరాబాద్ తర్వాత ఏపీలో ఆ స్థాయిలో ఇక్కడ మాతం నిర్వహించడం ప్రత్యేకత. బనగానపల్లె నవాబుకోట నుంచి నవాబు వంశీయులు మీర్ ఫజిలే అలీఖాన్, ఆయన కుమారుడు గులాం అలీఖాన్ పీర్ల వెంట నడువగా, షియా పెద్దలు, మతస్తులు నల్లటి వస్త్రాలు ధరించి అధిక సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం వీరంతా బ్లేడ్లు, చురకత్తులతో ఎద, వీపుపై మాతం నిర్వహిస్తూ తమ రక్తాన్ని చిందించారు.



పీర్ల భేటీ సందర్భంగా జన సంద్రమైన శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని ప్రధాన కూడలి



అనంతపురం జిల్లా గూగూడులో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న కుళ్లాయిస్వామి

ఘనంగా ప్రారంభమైన రొట్టెల పండుగ

భక్తులతో పోటెత్తిన నెల్లూరు బారాషహీద్ దర్గా

నెల్లూరు (బారకాసు): కులాలు, మతాలకతీతంగా నిర్వహించుకునే నెల్లూరు రొట్టెల పండుగ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వర్ణాల చెరువులో సందడి చేశారు. 5 రోజుల పాటు నిర్వహించే ఈ రొట్టెల పండుగలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. కోర్కెలు తీరిన భక్తులు రొట్టెలు వదిలేందుకు...కొత్త కోర్కెల రొట్టెలు పట్టుకునేందుకు వచ్చే భక్తులతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు భక్తులతో పోటెత్తింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా దీనికి భక్తులు హాజరయ్యారు. తొలిరోజు అంచనాకు మించి లక్ష మంది వరకు భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు.



చెరువులో రొట్టెలు ఇచ్చిపుచ్చుకుంటున్న భక్తులు

వీర జవాన్‌కు అంతిమ వీడ్కోలు

నందిగాం: జమ్మూలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ హవల్దారు సనపల జగదీశ్వరరావు అంత్యక్రియలు ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం వల్లభరాయునిపాడులో బుధవారం సైనిక లాంఛనాలతో నిర్వహించారు. సోమవారం జగదీశ్వరరావు మృతి చెందగా.. భౌతికకాయాన్ని జమ్ము నుంచి నందిగాంకు తీసుకురాగా..అక్కడి నుంచి వల్లభరాయునిపాడు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. జగదీశ్వరరావు మృతదేహాన్ని చూసి భార్య సమత, పిల్లలు, తల్లి కన్నీరుమున్నీరయ్యారు.



యువకుడి దారుణహత్య

కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలో ఘటన



రాంబాబు (ఫైల్)

పమిడిముక్కల: కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలంలోని తాడంకి గ్రామంలో ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గండికోట రాంబాబు(34)ని మంగళవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి హత్య చేశారు. ఈ ఘటనతో సమీప గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న గండికోట రాంబాబు ఇంటికి అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. రేకుల షెడ్డులో నిద్రిస్తున్న రాంబాబు తల్లి పద్మను నిద్రలేపి కొడుకు ఎక్కడని అడిగారు. పక్కనే ఉన్న మరో షెడ్డులో ఉన్నాడని పద్మ చెప్పింది. ఆ వెంటనే పద్మ కాళ్లు, చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కారు. తర్వాత పక్కనే ఉన్న షెడ్డులోకి వెళ్లి నిద్రిస్తున్న రాంబాబు తలపై కర్రలతో బలంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో నోట్లో కుక్కిన గుడ్డలను విడిపించుకుని తల్లి పెద్దగా అరవడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూడగా.. రాంబాబు రక్తపు మడుగులో ప్రాణాలు విడిచి ఉన్నాడు. సమాచారం అందుకున్న సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ శ్రీనివాస్ ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించాయి. రాంబాబుకు ఓ యువతితో ఉన్న వివాహేతర సంబంధమే దీనికి కారణమా, లేక మరేమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. శవ పంచనామా జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కిషోర్‌బాబు చెప్పారు.

'శ్రీవైష్ణవ' సంప్రదాయంలోనే లడ్డూ తయారీ

తిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను ఎన్నో దశాబ్దాల నుండి శ్రీవైష్ణవ బ్రాహ్మణులు సంప్రదాయానుసారంగా తయారు చేస్తున్నారని, సోషల్ మీడియా వేదికగా టీటీడీపై అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు టీటీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. తిరుమల శ్రీవారి పోటులో 980 మంది హిందూ మతానికి చెందిన పోటు కార్మికులు తమకు నిర్దేశించిన విధులను నిర్వహిస్తున్నారని, వీరిలో శ్రీవైష్ణవ బ్రాహ్మణులు లడ్డూల తయారీ, ముడి సరుకులు తీసుకురావడం వంటి పనులు చేస్తారని పేర్కొంది. ఇటీవల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను శ్రీ థామస్ అనే కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారనీ, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య వార్తలను నమ్మవద్దని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Head Office: 10-152/1, Ashok Nagar, Bandar Road, Kanuru, Vijayawada-520007

NATIONAL SHORT TENDER NOTICE (3rd call)
Tender No: PDS 1/35/Sugar Tender/July,24 to Sep,24 Date: 17.07.2024

BIDS ARE INVITED FROM ELIGIBLE BIDDERS FOR SUPPLY OF SUGAR TO ALL THE MLS POINTS OF FIVE(05) DISTRICTS IN ANDHRA PRADESH STATE THROUGH AP E-PROCUREMENT.

Andhra Pradesh State Civil Supplies Corporation Ltd invites bids from eligible bidders for supply of 3659.089 MTs of ISS Grade S-30/S-31 cane sugar in 1/2 Kg packet form with secondary packing in 50 Kg new polypropylene (PP) bags under PDS for the months of July,2024 to September,2024 to all the MLS Points of (05) districts of Zone-II in Andhra Pradesh State.

All the interested Sugar Manufacturers/Traders in All Over India may visit www.apscscl.in & www.apeprocurement.gov.in to view and download tender documents free of cost.

Interested tenderers to submit bids should be registered in website www.apeprocurement.gov.in and should also obtain Digital Signature Certificates from any Certifying Authority in India. The details and procedure for obtaining Digital Signature Certificates are mentioned in the website www.apeprocurement.gov.in or contact the helpdesk of procurement portal Phone: 9154383633/9154383634/7337318402.

Last date for registration and completion of formalities for the e-auction shall be up to 25.07.2024 at 5 p.m and the tentative date of online e-reverse auction through ap e-procurement platform would be 27.07.2024 at 2.00 pm onwards

Sd/- VC & Managing Director

యమునా తీరే.. ఎవరికి వారే


యూపీ బీజేపీలో ఇంటి పోరు!

యోగి వర్సెస్ డిప్యూటీ సీఎం మౌర్య

- సొంత ప్రభుత్వంపైనే మౌర్య వాగ్బాణాలు
- కార్యకర్తలకు గౌరవం లేదంటూ విమర్శలు
- వీటి వెనక అధిష్టానం ఉందంటూ వార్తలు
- త్వరలో కేబినెట్‌లో మార్పులు, పార్టీలో ప్రక్షాళన
- 'పెద్ద' మార్పు తప్పదంటున్న మౌర్య వర్గం

లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో పేలవ ఫలితాల దెబ్బకు రాష్ట్ర బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఒక్కసారిగా తెరపైకి వస్తున్నాయి. 2019తో పోలిస్తే యూపీలో బీజేపీ అనూహ్యంగా సగానికి సగం స్థానాలు కోల్పోవడం తెలిసిందే. పార్టీ కేంద్రంలో వరుసగా మూడోసారి సొంతంగా మెజారిటీ సాధించడంలో విఫలమవడానికి ఇదే ప్రధాన కారణంగా నిలిచింది. దీన్ని కమలనాథులు సీరియస్‌గా తీసుకున్నారు. రాష్ట్ర పార్టీలోనూ, యోగి కేబినెట్లోనూ త్వరలో భారీ మార్పుచేర్పులకు రంగం సిద్ధమవుతోంది. దీంతోపాటు సీఎం యోగి ఆదిత్యనాథ్ దూకుడుకు పగ్గాలు వేసేందుకు అధిష్టానమే ప్రయత్నిస్తున్నట్టు చెబుతున్నారు. యోగి ప్రభుత్వంపై సాక్షాత్తూ సొంత పార్టీకే చెందిన ఉప ముఖ్యమంత్రి మౌర్య బాహాటంగా విమర్శలు... రాష్ట్ర పార్టీ చీఫ్‌తో కలిసి ఆయన హస్తిన యాత్రలు... మోదీ, నడ్డా తదితర పెద్దలతో భేటీ... ఇవన్నీ అందులో భాగమేనని రాజకీయంగా జోరుగా చర్చ జరుగుతోంది...!


కేశవ్ ప్రసాద్ మౌర్య


యోగి ఆదిత్యనాథ్

ఉత్తరప్రదేశ్ బీజేపీ చీఫ్ భూపేంద్రసింగ్ చౌదరి బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యతో కలిసి ఆయన మంగళవారమే హస్తిన చేరుకున్నారు. అదే రాత్రి బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో మౌర్య గంటకు పైగా సమావేశమయ్యారు. అనంతరం చౌదరి కూడా నడ్డాతో విడిగా భేటీ అయ్యారు. నిజానికి యోగి, మౌర్య మధ్య మొదటినుంచీ సత్సంబంధాలు లేవు. యోగి అభీష్టానికి వ్యతిరేకంగా మౌర్యకు అధిష్టానం డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో మౌర్య, యూపీ బీజేపీ చీఫ్ హస్తిన యాత్ర రాష్ట్రంలో రాజకీయ కలకలం రేపుతోంది. మౌర్య నెల రోజులుగా కేబినెట్ సమావేశాలకు వరుసగా డుమ్మా కొడుతూ వస్తున్నారు. యూపీలో త్వరలో 10 అసెంబ్లీ స్థానాలకు కీలక ఉప ఎన్నికలు జరగనున్నాయి. వాటి సన్నద్ధత కోసం మంత్రులతో యోగి ఏర్పాటు చేసిన భేటీకి కూడా మౌర్య వెళ్లలేదు. పైగా నెల రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి సీనియర్ కేంద్ర మంత్రులు, పార్టీ పెద్దలను వరుస పెట్టి కలుస్తూ వస్తున్నారు. జూలై 14న కూడా నడ్డాతో చాలాసేపు మంతనాలు జరిపారు.

ఆ భేటీతో...

ఆదివారం లఖ్‌నవూలో జరిగిన బీజేపీ రాష్ట్రస్థాయి ప్రతినిధుల సమావేశం యూపీలో రాజకీయ వేడిని ఒక్కసారిగా పెంచేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు, బీజేపీ నేతలు, ప్రతినిధులు కలిపి 3,500 మందికి పైగా పాల్గొన్న ఆ భేటీలో వేదిక మీదే యోగి, మౌర్య మధ్య పరోక్షంగా మాటల యుద్ధం సాగింది. మౌర్య ప్రసంగిస్తూ, 'ప్రభుత్వం కంటే పార్టీయే మిన్న. కనుక పార్టీదే పై చేయిగా వ్యవహారాలు సాగాలి'' అంటూ బాహాటంగా వ్యాఖ్యలు చేశారు. దాంతో అంతా విస్తుపోయారు. ప్రభుత్వ వ్యవహారాల్లో బీజేపీ నేతల మాట పెద్దగా చెల్లడం లేదని పార్టీలో యోగి వ్యతిరేకులు చాలాకాలంగా వాపోతున్నారు. అధికారులకు యోగి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడమే ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతలు, కార్యకర్తలు దూకుడుగా పని చేయలేదని, రాష్ట్రంలో దారుణ ఫలితాలకు ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటన్నది వారి వాదన. ఎస్పీ, బీఎస్పీ సానుభూతిపరులైన అధికారులకు కీలక పదవులు కట్టబెట్టారంటూ వారంతా యోగిపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని సీఎం సమక్షంలోనే మౌర్య మాటల తూటాలు పేల్చారు. ''కార్యకర్తలే కీలకం. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అందరూ వారిని గౌరవించాల్సిందే. నేనైనా ముందు బీజేపీ కార్యకర్తను. తర్వాతే డిప్యూటీ సీఎంను'' అన్నారు. ''కార్యకర్తల బాధే నా బాధ. ప్రతి కార్యకర్తకూ నా ఇంటి తలుపులు నిత్యం తెరిచే ఉంటాయి'' అంటూ సర్కగర్భ వ్యాఖ్యలూ చేశారు. యోగి సమక్షంలోనే ప్రభుత్వ పనితీరును తప్పుబట్టేలా మౌర్య ఇలా మాట్లాడటం వెనక అధిష్టానం ఆశీస్సులున్నట్టు చెబుతున్నారు. అయితే మౌర్య అనంతరం మాట్లాడిన యోగి కూడా ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. ప్రభుత్వ పనితీరు ఏమాత్రం మారబోదని అదే వేదిక నుంచి కుండబద్దలు కొట్టారు. ఆ వెంటనే మౌర్య, చౌదరి హస్తిన వెళ్లడం, మోదీ, నడ్డా తదితరులతో భేటీ కావడం చకచకా జరిగిపోయాయి. అనంతరం తాజాగా బుధవారం ఎక్స్ పోస్టులో కూడా 'ప్రభుత్వం కంటే పార్టీయే పెద్ద'దన్న వ్యాఖ్యలను మౌర్య పునరుద్ఘాటించారు. వీటన్నింటినీ బేరీజు వేసి చూస్తే యూపీకి సంబంధించి బీజేపీ అధిష్టానం త్వరలో 'పెద్ద' నిర్ణయం తీసుకోవచ్చంటూ యోగి వ్యతిరేక వర్గం జోరుగా ప్రచారం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత యోగిని సీఎం పదవి నుంచి తప్పించడం ఖాయమని ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం పదేపదే చెబుతూ వస్తుండటం తెలిసిందే.

యోగి సంచలన వ్యాఖ్యలు

అధిష్టానం మనోగతాన్ని పసిగట్టిన యోగి ముందుగానే వ్యూహాత్మకంగా పై ఎత్తులు వేస్తున్నారని అంటున్నారు. అతి విశ్వాసమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కొంప ముంచిందని మూడు రోజుల క్రితం ఆయన ఏకంగా బహిరంగ సభలోనే వ్యాఖ్యలు చేయడం ఉద్దేశపూర్వకమేనని భావిస్తున్నారు. ఇవి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. బీజేపీ అధిష్టానం ఇప్పటికిప్పుడు యోగిని మార్చడం వంటి భారీ నిర్ణయాలకు వెళ్లకపోయినా అసెంబ్లీ ఉప ఎన్నికల్లో సత్ఫలితాలు రాబట్టలేకపోతే ఆయనకు ఇబ్బందులు తప్పేలా లేవు. మరోవైపు బీజేపీ ఇంటి పోరుపై విపక్షాలన్నీ చెణుకులు విసురుతున్నాయి. యూపీకి ముగ్గురు సీఎంలున్నారంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ సహా ఎద్దేవా చేస్తున్నాయి. అంతర్గత కుమ్ములాటల్లో మునిగి తేలుతూ పాలనను గాలికొదిలారంటూ దుయ్యబడుతున్నాయి. మౌర్య, మరో డిప్యూటీ సీఎం బ్రిజేశ్ పాఠక్ కూడా సీఎంలుగానే వ్యవహరిస్తున్నారన్నది వాటి విమర్శల అంతర్యం. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో అత్యధిక స్థానాలను నెగ్గడం యోగికి అత్యవసరం. రాష్ట్ర పార్టీ కీలక నేతల సహాయ నిరాకరణ నేపథ్యంలో ఈ కఠిన పరీక్షలో ఆయన ఏ మేరకు నెగ్గుకొస్తారన్నది ఆసక్తికరం.

– సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్‌పై దాడిలో మా ప్రమేయం లేదు

ఇరాన్ స్పష్టీకరణ

టెహ్రాన్: అమెరికా ఎన్నికల ప్రచారంవేళ మాజీ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యోదంతంలో తమ ప్రమేయం అస్సలు లేదని ఇరాన్ స్పష్టంచేసింది. రెండేళ్లక్రితం ఇరాక్‌లో ఇరాన్‌కు చెందిన సైన్యాధికారి జనరల్ ఖాసిం సులేమానీని ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికా సైనిక డ్రోన్ దాడిచేసి అంతంచేసింది. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆనాడు ఇరాన్ చేసిన ప్రతిజ్ఞకు, ట్రంప్ హత్యకు సంబంధం ఉండొచ్చన్న ఆరోపణల నడుమ ఇరాన్ బుధవారం స్పందించింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి కసీర్ కనానీ ఇరాన్ అధికారిక ఐఆర్ఎన్ఏ వార్తాసంస్థతో మాట్లాడారు. '' ట్రంప్ మేం దాడి చేయించామంటున్న వార్తల్లో వీసమెత్తు నిజం లేదు. మా సైనిక కమాండర్ సులేమానీని అంతం చేసినందుకు ట్రంప్‌ను అంతర్జాతీయంగా చట్టప్రకారం శిక్షార్హుడిని చేస్తాం. అంతేగానీ ఇలా హత్య చేయబోం'' అని ఆయన అన్నారు.

ఇరాన్ నుంచి ముప్పు నేపథ్యంలో ఇప్పటికే భద్రత పెంపు

ట్రంప్ హత్యకు ఆగంతకుడు విఫలయత్నం చేయడంతో ట్రంప్‌పై గతంలో కక్షగట్టిన ఇరాన్ పేరు మరోసారి తెరమీదకొచ్చింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ కమాండర్ సులేమానీని అమెరికా బలగాలు నాటి అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకే అంతమొందించాయని ఇరాన్ ఆరోపిస్తోంది. దీంతో ట్రంప్ అంతానికి ఇరాన్ కుట్ర పన్ని ఉండొచ్చని అమెరికా నిఘా వర్గాలు భావించాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ట్రంప్‌కు కొన్ని వారాల క్రితమే భద్రతను మరింత పెంచారు. అయితే ఇరాన్‌కు, ఆగంతకుడి దాడి ఘటనకు మధ్య సంబంధాన్ని అమెరికా నిఘా, దర్యాప్తు వర్గాలు సహా ఎవరూ నిర్ధారించలేకపోతున్నారు. అయితే ఇరాన్ నుంచి ముప్పు ఉందని, జాగ్రత్తగా ఉండాలని అమెరికా సీక్రెట్ సర్వీస్, ట్రంప్ ప్రచార బృందానికి గతంలోనే ముందస్తు హెచ్చరికలు చేశామని అమెరికా జాతీయ భద్రతా అధికారి ఒకరు చెప్పారు. దాడి జరగొచ్చని, తగు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని మాకు తరచూ సందేశాలు వస్తూనే ఉన్నాయని యూఎస్ సీక్రెట్ సర్వీస్ అధికార ప్రతినిధి ఆంటోనీ చెప్పారు. 'ట్రంప్‌కు ఇరాన్ నుంచి ముప్పు ఉంది. సులేమానీని చంపేశాక ఇది మరింత ఎక్కువైంది' అని అధ్యక్షభవనం వైట్‌హౌజ్‌లో జాతీయ భద్రతా మండలి మహిళా అధికార ప్రతినిధి ఆండ్రీనీ వాట్సన్ చెప్పారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారుగా జాన్ బోల్టన్ ఉండేవారు. ఆయనను చంపాలని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషన్ కోర్ సభ్యుడు కుట్ర పన్నాడు. ఆ సభ్యునిపై 2022లో న్యాయశాఖ నేరాభియోగాలు మోపింది. 'ట్రంప్‌ను కోర్టులో చట్టప్రకారం శిక్షపడేలా చేస్తాం. అంతేగానీ ఇలా చంపబోం' అని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ తాజాగా స్పష్టంచేశారు.

కన్నడనాట స్థానిక రగడ!

ప్రైవేటు ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్

- మేనేజ్‌మెంట్‌లో 50శాతం
- నాన్‌మేనేజ్‌మెంట్‌లో 75 శాతం
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం, బిల్లుకు కేబినెట్ ఆమోదం
- ఐటీ సంస్థలు, విపక్షాల తీవ్ర విమర్శలతో యూటర్న్

సాక్షి బెంగళూరు: కర్ణాటకలో మరోసారి స్థానిక, స్థానికేతర రగడ రాజుకుంది. రాష్ట్రంలో ప్రైవేట్ ఉద్యోగాల్లో కూడా స్థానికులకే ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇందుకు కారణమైంది. రాష్ట్రంలోని పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, ఇతర ప్రైవేటు సంస్థలన్నింట్లోనూ కన్నడిగులకు రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం తీర్మానించింది. ప్రైవేట్ రంగంలో మేనేజ్‌మెంట్ స్థాయి ఉద్యోగాల్లో 50 శాతం, నాన్ మేనేజ్‌మెంట్‌లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే రిజర్వు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రూపొందించిన ఉద్యోగ బిల్లు–2024కు కేబినెట్ సోమవారం ఆమోదముద్ర వేసింది. నిబంధనలను ఉల్లంఘిస్తే రూ 25 వేల దాకా జరిమానా కూడా విధిస్తారు. అంతేగాక గ్రూప్ సి, డి తరహా చిరుద్యోగాల్లో ప్రైవేట్ కంపెనీలు విధిగా నూటికి నూరు శాతం స్థానికులనే తీసుకోవాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కుండబద్దలు కొట్టారు. ఈ మేరకు చట్టం చేసేందుకు



వీలుగా ఒకట్రెండు రోజుల్లో బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమైంది. కానీ ఐటీ తదితర పరిశ్రమలు, ప్రైవేటు రంగ సంస్థల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వెల్లువెత్తుతుండటంతో ప్రస్తుతానికి దీనిపై వెనకడుగు వేసింది. బిల్లును పక్కన పెడుతున్నామని, మరింత అధ్యయనం చేస్తామని సీఎం కార్యాలయం బుధవారం ప్రకటించింది.

ఇదీ నేపథ్యం...

కర్ణాటకవ్యాప్తంగా ప్రైవేటు ఉద్యోగాల్లో ఉత్తరాది వారికే ఎక్కువ అవకాశాలు దక్కుతున్నాయంటూ కొన్నాళ్లుగా కర్ణాటకలో ఆందోళనలు జరుగుతున్నాయి. స్థానిక వనరులు, మౌలిక వసతులు ఉపయోగించుకుంటున్న ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు అందుకు తగ్గట్టుగా స్థానికులకే ఉద్యోగాలివ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఉద్యోగాల బిల్లుకు రూపకల్పన చేసింది.

100 % స్థానికులకేనంటూ సిద్దు పోస్టు

బిల్లుకు మంత్రివర్గ ఆమోదం అనంతరం మంగళవారం సీఎం సిద్ధరామయ్య ఎక్స్‌లో పెట్టిన పోస్టు వివాదానికి దారితీసింది. ''మాది కన్నడ ప్రభుత్వం. కన్నడిగుల భద్రత, సంక్షేమానికి పాటుపడటమే మా బాధ్యత. కానీ కన్నడిగులు కన్నడనాడులోనే ఉద్యోగాలు పొందడంలో వెనకబడుతున్నారు. దీన్ని నివారించేందుకు ఈ బిల్లు ద్వారా అవకాశం కల్పిస్తున్నాం. ఇకపై రాష్ట్రంలో అన్ని ప్రైవేటు రంగ పరిశ్రమలు, కర్మాగారాల్లో గ్రూప్ సి, డి ఉద్యోగాలు వంద శాతం కన్నడిగులకే ఇవ్వాల్సిందే'' అని పోస్టులో సిద్ధు పేర్కొన్నారు. తీవ్ర విమర్శలు రావడంతో దాన్ని తొలగించారు.

> కర్ణాటకలో కన్నడిగుల స్వాభిమానాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. కన్నడ నేమ్‌ప్లేట్లు, కన్నడ ధ్వజం, భాష, సంస్కృతి, పరంపర విషయంలో వెనుకంజ ఉండదు. రాష్ట్రంలో ప్రైవేటు ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు తేవడం అందులో భాగమే
>
> – బిల్లును తాత్కాలికంగా పక్కన పెట్టిన అనంతరం కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యలు

తీవ్ర వ్యతిరేకత

సిద్దు సర్కారు నిర్ణయాన్ని కర్ణాటకలోని ప్రైవేటు రంగ సంస్థలు, పరిశ్రమలు ముఖ్యంగా ఐటీ తదితర కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పారిశ్రామిక దిగ్గజం, బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా దీనిపై తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. టెక్ కంపెనీలకు స్థానికత కంటే ప్రతిభే ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో కంపెనీలు కర్ణాటకకు రావాలంటే భయపడే పరిస్థితి తలెత్తుతుందని సాఫ్ట్‌వేర్ పరిశ్రమల జాతీయ సంఘం నాస్కామ్ విమర్శించింది. దీన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఇది వివక్షా పూరితమైన బిల్లంటూ ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్ దాస్ పాయ్ విమర్శించారు. ''ఇది రాజ్యాంగవిరుద్ధం. టెక్ రంగానికి గొడ్డలి పెట్టు వంటి ఈ ఫాసిస్టు బిల్లును వెంటనే వెనక్కు తీసుకోవాలి'' అని డిమాండ్ చేశారు. అసోచామ్ కర్ణాటక సహాధ్యక్షుడు ఆర్‌కే మిశ్రా తదితరులు కూడా ఇది దూరదృష్టి లేని బిల్లంటూ తీవ్రంగా తప్పుబట్టారు. విపక్ష బీజేపీ కూడా బిల్లును తీవ్రంగా తప్పుబట్టింది.

అస్సాంలో ఎన్‌కౌంటర్

ముగ్గురు ఉగ్రవాదులు హతం, ముగ్గురు పోలీసులకు గాయాలు

అస్సాం: రాష్ట్రంలోని కాచర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ముగ్గురు పోలీసులకు గాయాలయ్యాయి. ఎస్పీ నుమాల్ మహట్టా తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాపూర్ రోడ్డు ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలపై పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం కాచర్‌లోని ధలై గంగా నగర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు ఏకే రైఫిళ్లను, ఒక సాధారణ రైఫిల్, ఒక పిస్టల్‌ను, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం పట్టుబడిన ముగ్గురూ హ్మార్ తీవ్రవాద సంస్థలో శిక్షణ పొందిన క్యాడర్‌గా ప్రాథమిక విచారణలో తేలింది. భుబన్ హిల్స్‌లోని సమీపంలోని అడవిలో మరికొందరున్నట్టు, అసోం–మణిపూర్ సరిహద్దుల్లో విధ్వంసాలకు సిద్ధమవుతున్నట్లు పట్టుబడిన ముగ్గురు వెల్లడించారు. దీంతో బుధవారం తెల్లవారుజామున అదనపు ఎస్పీ నేతృత్వంలోని బృందం అరెస్టయిన ఉగ్రవాదులతో పాటు భుబన్ హిల్స్‌లో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ సమయంలో భుబన్‌హిల్స్‌లో ఉన్న కొందరు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. గంటపాటు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వారిలో ఇద్దరు కాచర్‌కు చెందినవారు కాగా ఒకరు మణిపూర్‌కు చెందినవారు. మరో ఆరు నుంచి ఏడుగురు ఉగ్రవాదులు తప్పించుకున్నారు. వారికోసం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు.

ఒమన్ సమీపంలో సరుకు రవాణా నౌక మునక

- ఐదుగురు భారతీయులు గల్లంతు
- 8 మందిని కాపాడిన సిబ్బంది

దుబాయ్: ఒమన్ సమీప సముద్రజలాల్లో సరకు మూడు రోజుల క్రితం రవాణా నౌక మునిగిపోయిన ఘటనలో ఐదుగురు భారత, ముగ్గురు శ్రీలంక సిబ్బంది గల్లంతయ్యారు. మూడ్రోజుల అన్వేషణ తర్వాత 8 మంది భారతీయులను, ఒక శ్రీలంక వ్యక్తిని కాపాడగలిగారు. మిగతా వారికోసం అన్వేషణ సాగుతోంది. దుబాయ్ నుంచి బయలుదేరిన నౌక దుక్మ్ పట్టణం సమీప సముద్రజలాల్లో మునిగిపోయింది. కొమొరోస్ దేశ జెండాతో వెళ్తున్న ఈ నౌకలో 13 మంది భారత సిబ్బంది, ముగ్గురు శ్రీలంక వాసులు ఉన్నట్టు ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలు మాత్రం వెల్లడించలేదు. ఒమన్‌లోని ప్రధాన చమురు, గ్యాస్ మైనింగ్ ప్రాజెక్టులకు దుక్మ్ పోర్ట్ ప్రధాన కేంద్రంగా ఉంది. 117 మీటర్ల పొడవైన ఫాల్కన్ నౌకను 2007లో నిర్మించారు. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 16 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 13 మంది భారతీయులే.



చిరుద్యోగాల కోసం పోటెత్తిన యువత

- తొక్కిసలాట తరహా పరిస్థితి
- ముంబై ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఘటన

ముంబై: నిరుద్యోగ సమస్య తీవ్రతకు అద్దం పట్టే ఉదంతమిది. ముంబై ఎయిర్‌పోర్ట్ సమీపంలో 2,000 'లోడర్' ఉద్యోగాల కోసం ఎయిరిండియా ఇంటర్వ్యూలకు పిలిచింది. ప్రయాణికుల లగేజీ, సరకు తదితరాలను విమానాల్లో లోడ్, అన్ లోడ్ చేయడం, బ్యాగేజీ బెల్టులను సరిచూడటం వీరి పని. మరో 200 మంది గ్రౌండ్ హ్యాండ్లింగ్ టెక్నీషియన్స్, 400 మంది డ్రైవర్ పోస్టులకూ ఒకేసారి ఇంటర్వ్యూ నిర్వహించారు. వీటికి ఏకంగా పాతిక వేల మంది నిరుద్యోగులు పోటెత్తారు. వారిని నిలువరించడం సిబ్బందికి తలకు మించిన భారమైంది. తొక్కిసలాట పరిస్థితులు తలెత్తాయి. సంబంధిత వీడియో వైరలైంది. దాంతో వారి నుంచి సర్టిఫికెట్లు తీసుకుని, తర్వాత ఇంటర్వ్యూలు చేస్తామంటూ పంపించేశారు. కొందరు పొరుగు రాష్ట్రాల నుంచీ వచ్చారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానం కుంభకోణం కేసులో సీబీఐ అరెస్టును సవాల్ చేస్తూ, మధ్యంతర బెయిల్ కోరుతూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు బుధవారం రిజర్వ్ చేసింది. సాధారణ బెయిల్ కోరుతూ దాఖలు చేసిన మరో పిటిషన్‌ను జూలై 29న విచారిస్తామని తెలిపింది. ఈడీ కేసులో బెయిల్ వచ్చినా కేజ్రీవాల్‌ను జైలుకే పరిమితం చేసేందుకే సీబీఐ అరెస్ట్ చేసిందని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. ''ఇది సిగ్గుచేటు. కేజ్రీవాల్‌కు అనుకూలంగా మూడుసార్లు ఉత్తర్వులు వచ్చాయి. అయినా సీబీఐ చేసిన 'ఇన్సూరెన్స్' అరెస్ట్ వల్ల జైల్లోనే గడపాల్సిన పరిస్థితి! సీబీఐ వద్ద సాక్ష్యాలు, ఆధారాలు లేకున్నా ఇలా ముందస్తు అరెస్ట్ ప్రణాళిక అమలు చేసింది'' అని ఆయన ఆరోపించారు.

కాలువలో సిక్కిం మాజీ మంత్రి మృతదేహం



గాంగ్‌టక్: సిక్కిం మాజీ మంత్రి ఆర్సీ పౌడ్యాల్ (80) మృతదేహం పశ్చిమ బెంగాల్‌లో దొరికింది. సిలిగురి సమీపంలోని తీస్తా కాలువలో మంగళవారం మృతదేహం లభించినట్లు పోలీసులు వెల్లడించారు. చేతి వాచ్, ధరించిన దుస్తుల ఆధారంగా ఆయన్ను గుర్తించారు. మృతదేహం తీస్తా నదిలో కొట్టుకొచ్చి ఉంటుందని భావిస్తున్నారు. పౌడ్యాల్ జూలై 7న తన స్వస్థలమైన పాక్యోంగ్ జిల్లా ఛోటాసింగ్‌టామ్‌లో ఇంటి నుంచి సోదరి వద్దకు బయల్దేరి తిరిగి రాలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి గాలించారు. 9 రోజుల తరువాత ఆయన మృతదేహం లభించింది. పౌడ్యాల్ మృతి పట్ల సీఎం తమాంగ్ సంతాపం వ్యక్తం చేశారు.

నిరుద్యోగంలో రికార్డ్ బ్రేక్

ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురక



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల ఉద్యోగాలు సృష్టించామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. బుధవారం 'ఎక్స్' వేదికగా తూర్పారబట్టారు. మంగళవారం ఉదయం ముంబై విమానాశ్రయంలో సరకుల లోడింగ్ కేంద్రం వద్ద చిరు ఉద్యోగాల కోసం వేలాది మంది నిరుద్యోగ యువత క్యూ వరసల్లో నిల్చుని తొక్కిసలాట వంటి పరిస్థితి తలెత్తిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ప్రియాంక గుర్తుచేశారు. '' కొద్దిరోజుల క్రితం ముంబైలో మోదీ మాట్లాడు తూ మేం కోట్లాది మందికి ఉపాధి కల్పించి రికార్డులు బ్రేక్ చేశామని ఢంకా బజాయించారు. కానీ అదే ముంబైలో చిన్నపాటి ఉద్యోగాల కోసం వేలాదిగా యువత ఆశతో ఎగబడటం మనందరం చూశాం. ఇదే ఏడాది గుజరాత్‌లో 25 ఉద్యోగాల కోసం ఏకంగా లక్షలాది మంది నిరుద్యోగులు తండోపతండాలుగా తరలిరావడమూ మనందరికీ తెల్సిందే. ఇవన్నీ చూస్తుంటే రికార్డులు బ్రేక్ అయినట్లు తెలుస్తూనే ఉంది. కానీ ఆ రికార్డులు నమోదైంది ఉద్యోగాల్లో కాదు నిరుద్యోగంలో. దేశాన్ని తీవ్ర నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోంది. ఇప్పటికైనా మోదీ ఉత్తమాటలు చెప్పడం మానేసి ఉపాధి అవకాశాలపై దృష్టిపెట్టాలి'' అని ప్రియాంక నిలదీశారు.

ఇన్‌స్టాలో దుబాయ్ యువరాణి ఇన్‌స్టంట్ విడాకులు



దుబాయ్: దుబాయ్ యువరాణి షైఖా మహ్రా మహమ్మద్ రషీద్ అలీ మక్తూమ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సంచలన ప్రకటన చేశారు. తన భర్త షేక్ మనాబిన్ మహ్మద్ బిన్ రషీద్ బిన్ మనా అల్ మక్తూమ్‌కు విడాకులిచ్చారు. ''ప్రియమైన భర్తకు.. మీరు ఇతరుల సహచర్యంలో ఉన్నందున మీకు విడాకులు ఇవ్వాలనుకుంటున్నాను. ఐ డివోర్స్ యూ.. ఐ డివోర్స్ యూ.. ఐ డివోర్స్ యూ. జాగ్రత్తగా ఉండండి. ... మీ మాజీ భార్య'' అంటూ జూలై 16న ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. యువరాణి పోస్ట్ చేసిన వెంటనే ఆమె శ్రేయోభిలాషుల నుంచి సందేశాలు వెల్లువలా వచ్చాయి. మరోవైపు ఇన్‌స్టాగ్రామ్‌లో భార్యాభర్తలిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలను కూడా తొలగించారు. షైఖా మహ్రా ప్రస్తుత దుబాయ్ రాజు షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె. 2023 మేలో పారిశ్రామికవేత్త షేక్ మనా బిన్ మొహమ్మద్ బిన్ రషీద్ బిన్ మనా అల్ మక్తూమ్‌ను వివాహం చేసుకున్నారు. ఒక సంవత్సరం తర్వాత వారికి కుమార్తె జన్మించింది. ఆ భర్త, కూతురుతో ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో 'మేం ముగ్గురం' అని జత చేసి పోస్ట్ చేశారు. జూన్ 4న 'మేమిద్దమే' కూతురుతో ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు. ఇప్పుడు విడాకుల ప్రకటన సంచలనమైంది.


భారత్ మాకు వ్యూహాత్మక భాగస్వామి

మోదీ రష్యాలో పర్యటించిన నేపథ్యంలో అమెరికా వ్యాఖ్యలు



వాషింగ్టన్: రష్యాతో భారత్ మైత్రి బంధం మరింత బలపడుతున్నా సరే తమకు మాత్రం వ్యూహాత్మక భాగస్వామిగానే కొనసాగుతుందని అమెరికా పునరుద్ఘాటించింది. మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక ఇటీవలే రష్యాలో పర్యటించిన నేపథ్యంలో అమెరికా తాజాగా ఇలా స్పందించింది. వాషింగ్టన్‌లో మంగళవారం అమెరికా రక్షణ శాఖ ప్రెస్ సెక్రటరీ ప్యాట్ రైడర్ మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. '' భారత్ ఎప్పటికీ అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామే. దీన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఎదురుచూస్తుంటాం. ఇరుదేశాల సైనిక ఒప్పందాలు, సత్సంబంధాలు కొనసాగుతాయి' అని స్పష్టంచేశారు. యుద్ధరంగంలో బాంబులు, బుల్లెట్ల నడుమ శాంతి స్థాపన సాధ్యంకాదని ఉక్రెయిన్ దురాక్రమణను ఉద్దేశించి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ వ్యాఖ్యానించడం తెల్సిందే. ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై రైడర్ స్పందించారు. ''రష్యా దురాక్రమణను సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్న ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేస్తోంది'' అని ఆయన అన్నారు.

ముస్లింల జనాభా పెరుగుదల జీవన్మరణ సమస్యగా మారింది: హిమంత



రాంచీ: జనాభా సమీకరణాల్లో మార్పు అస్సాంలో అతిపెద్ద సమస్యగా మారిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. 'అస్సాంలో 1951లో ముస్లింల జనాభా 12 శాతం మాత్రమే. కానీ ఇప్పుడది 40 శాతానికి చేరుకుంది. నాకిది రాజకీయ సమస్య కాదు. జీవన్మరణ సమస్య. మనం ఎన్నో జిల్లాలను కోల్పోయాం' అని హిమంత వ్యాఖ్యానించారు. 2021 జూన్‌లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక హిమంత మాట్లాడుతూ.. 'జనాభా విస్ఫోటం అస్సాం ముస్లింలలో పేదరికానికి, ఆర్థిక అసమానతలకు మూలకారణం' అని అన్నారు. రాంచీలో బుధవారం బీజేపీ సమావేశంలో మాట్లాడుతూ జార్ఖండ్ గిరిజన ప్రాంతాల్లో బంగ్లా చొరబాటుదారుల సంఖ్య పెరుగుతోందన్నారు. జార్ఖండ్‌ను సీఎం హేమంత్ మినీ బంగ్లాదేశ్‌గా మార్చేశారన్నారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం: అఖిలేశ్



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే 10 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో సమాజ్‌వాదీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ఆ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ బుధవారం విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికార బీజేపీలో అంతర్గత పోరు ఉందని, అధికారం కోసం వారి కుమ్ములాటలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఇంతకుముందు ఇతర పార్టీల్లో చీలిక రాజకీయాలు చేసిన బీజేపీ ఇప్పుడు సొంత పార్టీలోనూ చీలికలకు పాల్పడుతోందన్నారు.

పుట్టినవాడు గిట్టక తప్పదు

హత్రాస్ తొక్కిసలాటపై భోలే బాబా 'వేదాంతం'



లక్నో: హత్రాస్ తొక్కిసలాట తనను తీవ్రంగా కలచివేసిందని, అయితే విధిరాతను ఎవరూ తప్పించలేరని భోలే బాబా అన్నారు. అందరూ ఏదో ఒకరోజు మరణించక తప్పదని వేదాంతం వల్లెవేశారు. భోలే బాబా సత్సంగ్‌లో తొక్కిసలాటలో ఇటీవల 121 మంది మరణించడం తెలిసిందే. బుధవారం ఆయన పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. 'పుట్టినవాడు ఏదో ఒకరోజు గిట్టక తప్పదు. కాస్త ముందూ వెనకా అంతే' అన్నారు. తొక్కిసలాట వెనుక కుట్ర ఉందని పునరుద్ఘాటించారు. 'జూలై 2 దుర్ఘటన తర్వాత నేను తీవ్ర నిరాశకు లోనయ్యా, కలత చెందా. కానీ జరిగేదాన్ని ఎవరూ తప్పించలేరు. విషపూరిత రసాయనాలను స్ప్రే చేశారని నా న్యాయవాది, ప్రత్యక్షసాక్షులు చెప్పింది ముమ్మాటికీ నిజం. దీనివెనుక కచ్చితంగా కుట్ర ఉంది' అని బాబా పేర్కొన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 18 । జూలై । 2024



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి చెన్నైకు చెందిన ఎ.ఎం. వైద్యనాథన్ దంపతులు బుధవారం రూ.1.08 లక్షల విరాళం సమర్పించారు.



కృష్ణా కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీని ఎస్పీ ఆర్.గంగాధర్ రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు.



గ్రామోత్సవం.. సారె సంబరం

నాగాయలంక: ఆషాఢం, తొలి ఏకాదశిని పురస్కరించుకుని నాగాయలంక శ్రీరామపాద క్షేత్రంలోని కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు బుధవారం పూజలు చేసి సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

జ్వరాల కట్టడికి పటిష్ట చర్యలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలో ప్రబలిన జ్వరాలను కట్టడి చేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్న ఎ.కొండూరు పీహెచ్‌సీ పరిధిలోని ఎ.కొండూరు, పాత కొండూరు, గోపాలపురం, మాధవరం తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. జ్వరాల నియంత్రణకు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ బృందాలతో సమావేశమై జ్వరాలు నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, డ్రైడే ఫ్రైడే కార్యక్రమం బలోపేతం, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎ.కొండూరులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, ఏపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ దివ్య, డాక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు వరలక్ష్మి ఎంపిక



మైలవరం: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు మైలవరం ఫిట్‌జోన్ జిమ్ క్రీడాకారిణి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని కంపా వరలక్ష్మి ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి (మాస్టర్స్–1) కేటగిరీ 76 కిలోల విభాగంలో వరలక్ష్మి ఎంపికయ్యారు. వరలక్ష్మి మైలవరం మండలంలోని వెల్వాడం గ్రామం ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్నారు. క్రీడలపై ఆసక్తితో మంగళగిరిలో జూన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 165 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మైలవరం నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన వరలక్ష్మి, కోచ్ బుడిపుటి వెంకట్రావును మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, గ్రామ ప్రముఖులు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు గంటా వెంకటేశ్వర్లు, వత్రి మల్లేశ్వరరావు అభినందించారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



విజయవాడస్పోర్ట్స్: చిత్తశుద్ధి, అంకితభావంతో విధులు నిర్వర్తించి పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన ఎస్‌ఐలకు సూచించారు. ఏలూరు రేంజి పరిధిలోని 18 మంది ఏఎస్‌ఐలు ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించిన ఎ.శ్రీనివాసరావు, బి.పైడేశ్వరరావు, కె.సత్యనారాయణ, ఎ.సూర్యనారాయణ, వై.కృపానందం, బి.ఆనందబాబు, జి.జాషువారాజు బుధవారం విధుల్లో చేరిన అనంతరం సీపీ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని వారికి సీపీ సూచించారు.

కోలుకున్న ఏడుగురు కార్మికులు



జగ్గయ్యపేట: అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికుల్లో ఏడుగురు కోలుకున్నారు. వారిని ఆస్పత్రులను నుంచి డిశ్చార్జి చేశారు. మండలంలోని బూదవాడ గ్రామంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో ఈ నెల ఏడో తేదీన బాయిలర్ పేలిన ఘటనలో 16 మంది కార్మికులు గాయపడ్డారు. వారిలో చికిత్స పొందుతూ నలుగురు మృతి చెందిన విషయం విదితమే. మరో 12 మంది విజయవాడ మణిపాల్, ఆంధ్రా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్ యాదవ్, శుభం సోమి, గుడ్డు కుమార్, దినేష్ కుమార్, నాగేంద్ర చౌరాస, బిహార్‌కు చెందిన బైబిక్ సింగ్, బూదవాడ గ్రామానికి చెందిన బాణావత్ సైదాను ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి చేశారని తహసీల్దార్ శేషగిరి బుధవారం తెలిపారు. మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు.

కంకర.. కరకర

- నిబంధనల్ని తుంగలో తొక్కి.. కొండల్ని పిండి చేస్తున్న మైనింగ్ కాంట్రాక్టర్లు
- క్వారీ నిర్వాహకుల ధన దాహానికి కార్మికుల బలి
- అక్రమ తవ్వకాలతో రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి
- భారీ బ్లాస్టింగ్‌లతో పర్యావరణానికి పెనుముప్పు
- కన్నెత్తి చూడని అధికారులు



కంచికచర్ల మండలం దొనబండ రాతి క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపిన కొండ

సాక్షి ప్రతినిధి, విజయవాడ/కంచికచర్ల: క్వారీ లీజుల పేరిట ప్రభుత్వ భూముల్ని హస్తగతం చేసుకుని.. నిబంధనలకు విరుద్ధంగా ఆ భూముల్లోని కొండల్ని పిండి చేసేస్తున్నారు. కంకరను కరకరలాడిస్తూ సొమ్ములు మూటగట్టుకుంటున్నారు. క్వారీ కాంట్రాక్టర్ల ధన దాహానికి కార్మికులే సమిధలవుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. భారీ బ్లాస్టింగ్‌లతో పర్యావరణానికి పెనుముప్పు కలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

72 రాతి క్వారీలు.. 30 క్రషర్లు

కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ అంచున దాదాపు 72 రాతి క్వారీలు, 30 వరకు క్రషర్లు ఉన్నాయి. దశాబ్దాలుగా బడాబాబులు ప్రభుత్వం నుంచి క్వారీలను లీజుకు తీసుకుని పెద్దపెద్ద రాళ్లను పగులకొట్టి క్రషర్స్ ద్వారా అవసరమైన మేర కంకర తయారు చేసి విక్రయిస్తున్నారు. 1990 సంవత్సరానికి పూర్వం క్వారీ, క్రషర్ యజమానులు శ్రీకాకుళం, తమిళనాడు, ఒడిశా ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి కొండలపై సుత్తి, శానంతో కంకర కొట్టించేవారు. అప్పట్లో క్వారీల్లో పనిచేసే ఐదువేల మందికి పైగా కార్మికులతో ఒక గ్రామమే ఏర్పడింది. 2004లో ఈ ప్రాంతంలో కార్మికుల పక్షాన మానవ హక్కుల సంఘాల నేతలు సుప్రీంకోర్టులో కార్మికుల హక్కుల కోసం దావాలు వేశారు. అనంతరం ఆధునిక టెక్నాలజీ రావడంతో క్వారీల నిర్వాహకులు కొండలో 300 మీటర్ల వరకు ఘాతాలు తవ్వి వాటిలో మందు కూర్చి పేల్చేవారు. దీంతో కొండలు దద్దరిల్లేవి. చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్లు సైతం నెర్రెలిచ్చి, తలుపులు, కిటికీలు సైతం పగిలిపోయాయి. సుప్రీంకోర్టు స్పందనతో అప్పట్లో కృష్ణా జిల్లా కలెక్టర్, మైనింగ్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో క్వారీలలో క్లస్టర్లతో తనిఖీలు చేయటంతో కొందరు అక్రమ తవ్వకాలు నిలిపివేశారు. ఈ ప్రాంత క్వారీ యజమానులు టీడీపీ అధికారంలోకి వస్తే.. నాయకులకు నెలవారీ నజరానాలు సమర్పించుకుని ప్రభుత్వం నుంచి అభ్యంతరాలను లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం సుప్రీంకోర్టు 30 అడుగుల మించి కొండల్లో రాయి పేల్చేందుకు గోతులు తవ్వరాదని నిబంధన విధించినప్పటికీ కొందరు క్వారీ యజమానులు పట్టించుకోవడం లేదు. 200 నుంచి 300 అడుగుల లోతు గోతులు తవ్వి పేలుడు పదార్థాలతో కొండలను పేల్చుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కిన క్వారీ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్ చేస్తున్నారు. పెద్దపెద్ద రాళ్లను బ్లాస్టింగ్ చేయడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయపడుతున్నారు. బ్లాస్టింగ్‌ల వల్ల పరిటాల, దొనబండ గ్రామాల్లో ఇళ్లు బీటలు వారుతున్నాయి. బ్లాస్టింగ్ చేసే సమయంలో కార్మికులకు చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు, కొండ పైకి ఎక్కేందుకు బెంచీలు ఏర్పాటు చేయలేదు. కేవలం తాళ్ల సాయంతో కొండపైకి ఎక్కి కార్మికులు కొండకు పెద్దపెద్ద గాతాలు పెట్టి బ్లాస్టింగ్ చేస్తున్నారు. నిపుణులతో కాకుండా కార్మికులతో బ్లాస్టింగ్ చేయటం వల్ల కార్మికులకు అనుభవం, నైపుణ్యం లేకపోవటంతో కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్నారు.

దొనబండ క్వారీలో కూలీల బలి

కంచికచర్ల మండలం దొనబండ పరిధిలోని క్వారీలో సోమవారం జరిగిన ప్రమాదం టీడీపీ నేత అయిన క్వారీ యజమాని ధనదాహానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. నిబంధనల్ని తుంగలో తొక్కి అక్రమంగా మైనింగ్ చేయటంతోనే ముగ్గురు కార్మికులు మృతిచెందారు. క్వారీ ప్రదేశాన్ని పరిశీలిస్తే అక్కడ కార్మికుల భద్రతకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని స్పష్టమవుతోంది. కొద్దిరోజుల క్రితం కొండపైన బ్లాస్టింగ్ చేశారు. ఆ బండ రాళ్లను తొలగించకుండానే పనులు చేశారు. బెంచ్ ఫార్మేషన్ చేసుకోలేదు. క్రషింగ్ చేయటానికి వీలుపడని బండలను బ్రేకర్స్‌తో పగులగొట్టాలి. అలాకాకుండా వాటిని డ్రిల్లింగ్ చేశారు. ఈ కారణంగానే ప్రమాదం జరిగిందని మైనింగ్ అధికారులు నిర్ధారణకు వచ్చి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. మృతుల కుటుంబాలకు పరిహారం కోసం కార్మిక శాఖకు నివేదించారు. క్వారీ మూసివేతకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే క్వారీ యజమానికి అధికార పార్టీ అండదండలు ఉండటంతో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. అక్కడ క్వారీల్లో దాదాపు అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో క్వారీల యజమానులంతా సిండికేట్‌గా మారి కేసు నుంచి యజమానిని తప్పించే ప్రయత్నాల్లో ఉన్నారు.

అధికారులపై ఒత్తిడి

రాతి క్వారీల్లో అనుమతులకు మించి తవ్వకాలు జరుపుతున్నారని.. నిబంధనల్ని గాలికి వదలేసిన క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎవరైనా ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో క్వారీ సమీప గ్రామాలైన కేతనకొండ, గొట్టుముక్కల, పరిటాల వరకు పక్కా గృహాలు సైతం పేలుళ్ల వలన నెర్రెలు ఇస్తున్నాయి. క్రషర్స్ నుంచి వచ్చే దుమ్ము, ధూళిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఫిర్యాదులను ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవటంతో క్వారీ, క్రషర్ నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. క్వారీల్లో 200 అడుగులకు పైగా లోతున తవ్వకాలు సాగిస్తూ రాయి సేకరిస్తున్నారు. నిబంధనల ప్రకారం భూమి లోపల 200 అడుగుల పైగా లోతు తవ్వితే వచ్చే భారీ గోతులను క్రషర్స్ నుంచి వచ్చే డస్టుతో పూడ్చాలి. కానీ.. క్వారీ డస్ట్‌ను సైతం అమ్ముకోవడానికి అలవాటుపడ్డ క్రషర్ యజమానులు చెరువులను తలపిస్తున్న క్వారీ గుంతల్ని పట్టించుకోవడం లేదు. దీంతో వాటిలో పడి ఎందరో కార్మికులు, వారి పిల్లలు మృతి చెందారు.



బాధ్యతలు చేపట్టిన కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు



కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన ఎస్పీ రెడ్డి గంగాధర్‌రావు అన్నారు. గంజాయి వ్యాపారంతో పాటు ఇతర అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బుధవారం ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి విక్రేతలు, తాగేవారిపై కేసులు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేస్తానని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను దిగుమతి చేసుకుని విక్రయాలకు పాల్పడే వారి వివరాలు సేకరించిన మరుక్షణం వారిపై పోలీసు చర్యలకు ఉపక్రమిస్తానని స్పష్టంచేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తాన న్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలోనూ చొరవ చూపుతామన్నారు. నేరాల నియంత్రణ, మహిళల రక్షణ, అభాగ్యుల సంరక్షణ కోసం తీసుకొచ్చిన కొత్త చట్టాలన్నింటినీ కచ్చితంగా అమలు చేసి సిబ్బంది సహకారంతో జిల్లాను నేరరహితంగా తీర్చిదిద్దుతానన్నారు. సైబర్ నేరాల నియంత్రణ లోనూ పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాసంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు విధులు నిర్వహిస్తానని తెలిపారు. జిల్లాలో పోలీసుల పనితీరు మరింత మెరుగుపడేలా చర్యలు చేపడ్తానని ఎస్పీ గంగాధర్‌రావు చెప్పారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం కచ్చితంగా అమలయ్యేలా చూస్తామన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులపై దాడులకు పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలు సైతం చట్టపరమైన విషయాల్లో ఎలాంటి సమస్య ఎదురైనా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

దుర్గమ్మ సన్నిధిలో తొలి ఏకాదశి రద్దీ



మహామండపం ఆరో అంతస్తులో పూజలందుకున్న ఉత్సవ మూర్తి



దుర్గమ్మకు సారె సమర్పించేందుకు వస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): తొలి ఏకాదశి పర్వదినం, బుధవారం సెలవు రోజు కావడంతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధికి భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో బారులు తీరారు. మరో వైపున దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఆషాడ మాసోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు భక్తులు, భక్త బృందాలు, ఆధ్యాత్మిక సంఘాల సభ్యులు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ఉదయం ఘాట్‌రోడ్డు వైపుగా రాకపోకలను నిలిపివేయడంతో ఆ ప్రభావం మహామండపం లిఫ్టు, మెట్ల మార్గంపై పడింది. లిఫ్టుపై కొండపైకి చేరుకునేందుకు భక్తులు తరలిరావడంతో అరగంటకు పైగా అక్కడే వేచి ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరో వైపు అమ్మవారికి మహానివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలను నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. ఈ పరిస్థితులను గమనించిన ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు ఘాట్‌రోడ్డును తెరవాలని ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఘాట్‌రోడ్డు వైపు రాకపోకలు ప్రారంభం కావడంతో మహా మండపం వైపు రద్దీ నియంత్రణలోకి వచ్చింది. సాధారణ భక్తులు, సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలు ఒకే సారి కొండపైకి చేరుకోవడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

కర్బలా అమరులకు రక్త తర్పణం

మచిలీపట్నంటౌన్: మొహర్రం నెల పదో రోజును పురస్కరించుకుని నగరంలోని ముస్లింలు బుధవారం స్థానిక కోనేరు సెంటర్‌లో రక్తం చిందించారు. కర్బలా మైదానంలో జరిగిన పవిత్ర యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్ హుస్సేన్, అతని అనుచరులు వీర మరణాన్ని గుర్తు చేసుకుంటూ, వారిని స్మరిస్తూ బ్లేడులు, చాకులతో రక్త తర్పణం చేశారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ అమరులను స్మరిస్తూ వేళ్ల మధ్య బ్లేడులను ఉంచి ఛాతీపై గట్టిగా కొట్టుకుని, చెయిన్‌లకు చాకులను కట్టుకుని వాటితో వీపుపై బాదుకుని రక్తం చిందించారు. తొలుత వీరంతా అమరులను స్మరిస్తూ పీర్లను ఊరేగిస్తూ, కర్బలా మైదానంలో జరిగిన యుద్ధ వాతావరణం కన్పించేలా గుర్రాలతో కోనేరు సెంటర్‌కు చేరుకున్నారు. మొహర్రం నెలంతా ముస్లింలు ఆడంబరాలకు దూరంగా ఉంటారు. నిరసనకు ప్రతీక అయిన నల్లని దుస్తులను ధరిస్తారు. నగరంలోని పలు పంజాల వద్ద మొహర్రం నెల సందర్భంగా పీర్లను చేబూని భక్తి శ్రద్ధలతో నిప్పుల గుండాల్లో నడుస్తారు. చెస్ట్‌బీటింగ్ కార్యక్రమాన్ని గిరోహె మీరన్‌షా (పెద్ద పార్టీ) అధ్యక్షులు మీర్ ఇనాయత్ హుస్సేన్, మీర్ హసన్ అబ్బాస్ పర్యవేక్షించారు. గిరోహె హుసైన్(ఏ.ఎస్) సంస్థ ఆధ్వర్యంలో చింతచెట్టు సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి కోనేరుసెంటర్‌కు చేరుకుని యా హుసైన్.. యా హుసైన్.. అంటూ నినాదాలు చేస్తూ చిన్నారులు, పెద్దలు చెస్ట్ బీటింగ్ చేసి రక్తాన్ని చిందించి, అలంకు దట్టీ సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ ప్రధాన కార్యదర్శి అలందార్ హుసైన్, అధ్యక్షుడు ఎం.గులామ్ హైదర్, కోశాధికారి ఎం.అబ్బాస్, ఇబ్రహీంబేగ్, అన్వర్, డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు పర్యవేక్షించారు.



కోనేరుసెంటర్‌లో రక్త తర్పణం చేస్తున్న ముస్లింలు



పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

అలలపై సిరుల సాగు

- తీరంలో సముద్ర నాచు (సీ వీడ్) సాగుకు అధ్యయనం
- ఆసక్తి రేకెత్తిస్తున్న సముద్రపు కలుపు మొక్కల సాగు
- ఇటీవల అధ్యయనం చేసిన గుజరాత్ నిపుణుల బృందం



ఇండోనేషియా సాగరతీరంలో సాగవుతున్న సముద్రపు నాచు

నాగాయలంక: అపార వనరుల నిధి కడలి అనేది తెలిసిన సత్యమే. చేపలు, రొయ్యలు వంటి మత్స్య సంపదేకాదు ఎన్నో వనరులు సముద్రంలో ఉన్నాయి. సముద్రంలో సహజ సిద్ధంగా పెరిగే నాచు (సీ వీడ్)ను పలు ప్రాంతాల్లో ఔత్సాహిక రైతులు సాగుచేస్తూ లాభాలు పొందుతున్నారు. దివిసీమ ప్రాంతంలోనూ నాచు సాగుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది. తీర ప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు, ఆక్వా రైతులు సముద్రపు నాచు సాగు చేపట్టేలా శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు వస్తాన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో 2019లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎండీ, సీఈఓ అర్జా శ్రీకాంత్ పర్యవేక్షణలో ఈడీ బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో నాగాయలంక ఎదురుమొండి దీవుల్లో పర్యటించిన నిపుణుల బృందం సముద్రపు నాచు సాగు ప్రతిపాదన తీసుకొచ్చింది.

గుజరాత్ నిపుణుల అధ్యయనం

గుజరాత్ రాష్ట్రంలో సీవీడ్ కల్చర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న టీఎస్‌సీ పర్ఫుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, గుజరాత్ ఆయిల్ పవర్ కార్పొరేషన్ నిపుణులు రామర్ విభూషణ్, హరిశంకర్ తివాకర్ కూడిన బృందం ఇటీవల నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలోని సముద్ర తీరంలో పర్యటించింది. ఇక్కడి తీర ప్రాంతంలో సముద్రపు నాచు సాగుకు ఉన్న అనుకూల, ప్రతికూల భౌగోళిక పరిస్థితులు, సాంకేతిక అంశాలను ఈ బృందం అధ్యయనం చేసిందని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. తీర ప్రాంతంలో ఇప్పటి వరకు సముద్రపు చేపలు, రొయ్యలు, పీతల సాగు, కేజ్ కల్చర్‌లో పంజరపు సాగుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు, ఆక్వా రైతులు, ఔత్సాహికులు సముద్ర తీరంవెంట సముద్రపు నాచు సాగు చేపడితే లాభాలు వస్తాయని భావిస్తున్నారు. 2008, 2017లో స్థానిక ఔత్సాహిక ఆక్వాకల్చరిస్ట్ తలశిల రఘుశేఖర్ నాగాయలంక కృష్ణానదిలో పంజరం (కేజ్)లో సీవీడ్ కల్చర్ చేపట్టారు. ప్రభుత్వ ప్రోత్సాహం, సహకారం దొరక్క ఇబ్బందుల పాలయ్యారు. 2008లో పెంచిన నాచు కృష్ణానది వరదకు కొట్టుకుపోవడంతో నష్టాల పాలయ్యారు.

సముద్రపు కలుపుతో లాభాలు

సీ వీడ్‌లో ముఖ్యమైనది 'కప్ ఆఫ్ ఫైకస్' అనే జాతి కలుపును కొన్నిచోట్ల కేజ్ (పంజరం)లో సాగు చేస్తున్నారు. ఈ కలుపు మొక్కలను ఎండబెట్టి పొడి చేసి ఫెర్టిలైజర్లు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీములు, టూత్‌ఫేస్టలతో పాటు కాస్మొటిక్స్‌లో వినియోగిస్తారని నిపుణులు చెప్తున్నారు. ఎండిన నాచు కిలో ధర రూ.50 నుంచి రూ.80 వరకు పలుకుతుంది.



దివిసీమ నాగాయలంక సముద్ర ప్రాంతంలో ఇటీవల పర్యటించిన గుజరాత్ నిపుణల బృందం



సముద్రపు నాచు (సీ వీడ్)

దీనిలో తక్కువ సాంద్రత కలిగిన ఉప్పు లభ్యమవుతున్నందున దీనిని బయోసాల్ట్‌గా వినియోగిస్తారు. కప్ ఆఫ్ ఫైకస్ కలుపు మొక్కను తమిళనాడులోని రామేశ్వరం నుంచి దిగుమతి చేసుకుంటారు. ఈ మొక్కలను 45 రోజులు పెంచి ఎండబెట్టి మార్కెట్‌కు తరలిస్తారు. సీవీడ్ విత్తనం కిలో ధర రూ.10 వరకు ఉంటుంది. 200 కిలోల పచ్చి సీవీడ్ నుంచి 20 కిలోల ఎండు నాచు లభిస్తుంది. జపాన్, తైవాన్, ఇండోనేషియా వంటి దేశాల్లో సీవీడ్‌కు మంచి గిరాకీ ఉంది. మనదేశంలో తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల తీర ప్రాంతాల్లో సీవీడ్‌కు మార్కెటింగ్ ఉంది. గుజరాత్ మత్స్యకారులు 'గ్రేసీలేరి యాదురా' రకం సముద్రపు నాచును సాగు చేస్తున్నారు. ఏడాదికి రెండు పంటలు సాగుచేస్తూ రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు.

సముద్రపు నాచుతో బహుళ ప్రయోజనాలు



సీవీడ్‌లో ముఖ్యమైన 'కప్ ఆఫ్ ఫైకస్' జాతి సముద్రపు నాచుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు అధికంగా ఉండటంతో దీనిని టూత్‌పేస్ట్, డెయిరీ ప్రొడక్ట్స్, జెల్లీలో వినియోగిస్తారు. ఈ నాచు కారణంగా నీటిలో ఆక్సిజన్‌కు కొరత ఉండదు. తీరగ్రామాల్లోని మత్స్యకారులు తమ జీవన విధానంలో ఎదుర్కొంటున్న ఒడిదుడుకులు, ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే ఇటీవల గుజరాత్ నిపుణుల టీమ్ పర్యటించి అధ్యయనం చేసింది. కోస్తా తీరప్రాంతంలో మత్స్యకారులు ఆదాయ వనరులను పెంపొందించడానికి సీవీడ్ కల్చర్ అనువుగా ఉంటుందన డంలో సందేహం లేదు.

– రాంపురపు ప్రతిభ, ఫిషరీస్ ఏడీ, అవనిగడ్డ

అడ్మిషన్లు జరుగుచున్నవి
త్రివేణి కాలేజెస్
Top in Academics... Best in Placements...
DEGREE: B.Sc (Comp.Science), B.Sc., (Data Science) B.Com., (Computers), INTER: MPC, MEC, CEC
బాలికల క్యాంపస్: NSM స్కూల్ రోడ్డు, పటమట. 8897313456, 8790466755
బాలికల క్యాంపస్: సీతారామపురం సిగ్నల్ దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ సెల్: 9393955566, 9393975566.
బాలుర క్యాంపస్: దుర్గామహల్ దగ్గర, పటమట. 8897813456, 8790466766
THINK OF PLACEMENTS - JOIN IN TRIVENI

క్లుప్తంగా

శాకంబరీదేవి ఉత్సవాలకు విధుల కేటాయింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ప్రారంభమయ్యే శాకంబరీదేవి ఉత్సవాలకు వివిధ హోదాలలో అధికారులు, సిబ్బందికి విధులను కేటాయిస్తూ ఈవో కేఎస్ రామరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను ఏఈవో ఎన్. రమేష్‌బాబు పర్యవేక్షణలో జరగనున్నాయి. రమేష్‌బాబుకు పి. సునీత, కె.శ్రీనివాసరెడ్డి సహాయకులుగా వ్యవహరిస్తారు. ఇక ప్రధాన ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సూపరింటెంటెంట్ బీఎస్ జగదీష్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ పి. రత్నారెడ్డి విధులు నిర్వర్తించనుండగా.. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూపరింటెండెంట్ సీహెచ్ నరసింహరాజు, జూనియర్ అసిస్టెంట్ టి. సుబ్రహ్మణ్యం విధుల్లో ఉంటారు. ఇక ఉత్సవాలలో భక్తులకు పంపిణీ చేసే కదంబం ప్రసాదాన్ని ఏఈవో వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ అమృతరావు పర్యవేక్షిస్తారు. ప్రసాదం వితరణను జూనియర్ అసిస్టెంట్స్ ఎ.జ్యోతిశ్రీ, వి. ఉమాశంకర్ పర్యవేక్షిస్తారు. ఉత్సవాలలో మూడు రోజుల పాటు అమ్మవారి ఆలయ అలంకరణ బాధ్యతను సూపరింటెండెంట్ కురెళ్ల శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ కె. బలరామకృష్ణ, క్లీనర్ బార్లాల వెంకట్రావు చూస్తారు. వీరితో పాటు మహా మండపం, రాజగోపురం, ధర్మదర్శనం క్యూలైన్ల పర్యవేక్షణకు దేవస్థాన ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 20 మందికి రెండు షిఫ్టులలో విధులు కేటాయించాల్సిందిగా ఆలయ ఈఈలను ఆదేశించారు.

ఐజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన కృష్ణా ఎస్పీ




కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆర్. గంగాధర రావు ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్ కుమార్‌ని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఐజీపీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

కీళ్లు అరుగుతున్నాయ్..!

ఏలూరుకు చెందిన 37 ఏళ్ల కృష్ణ కారు డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి తుంటిలో నొప్పి ప్రారంభమైంది. వైద్యులను సంప్రదించగా, అరుగుదల ప్రారంభమైందని, ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తుంటికీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ప్రస్తుతం కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

విజయవాడ పటమటకు చెందిన 45 ఏళ్ల వెంకట్ కోవిడ్ సోకిన ఆరు నెలలకు తుంటిలో నొప్పి ప్రారంభమైంది. క్రమేణా నొప్పి ఎక్కువై నడవలేని స్థితికి చేరుకున్నాడు. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్‌ను చేయించుకున్నాడు. ప్రస్తుతం మామూలుగా నడవ గలుగుతున్నాడు. ఇలా వీరద్దరే కాదు కోవిడ్ సోకిన రెండుశాతం మందిలో తుంటికీలు సమస్యలు తలెత్తాయి. ఇంకా కొందరు మంచానికే పరిమితమైన వారూ ఉన్నారు.

- రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో తుంటి, మోకీళ్ల అరుగుదల
- నడవలేని స్థితిలో మంచానికే పరిమితవుతున్న వైనం
- యువకుల్లోనూ తీవ్ర అనారోగ్య సమస్యలు
- అందుబాటులో తుంటికీళ్ల మార్పిడి సర్జరీలు



తుంటి కీళ్ల అరుగుదలను సూచించే చిత్రం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి ఇన్‌ఫ్లమేటరీ డిసీజ్ కారణాలతో యువకుల్లోనూ తుంటి, మోకీళ్లు అరిగిపోతున్నాయి. పోస్టు కోవిడ్ రోగుల చిన్న రక్తనాళాల్లో బ్లాక్స్ కారణంగా తుంటి కీలుకు రక్త ప్రసరణ అందక అరుగుదల ప్రారంభమవుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. మధ్య వయసు వారితోపాటు 30–35 ఏళ్ల వారు సైతం తుంటికీళ్లు అరిగి నడవలేని స్థితికి చేరుకుంటున్నారు. ఇలాంటి వారికి వైద్యులు టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. మోకీలు అరిగిన వారికి అత్యాధునిక రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి వచ్చాయి. కీళ్ల మార్పిడి తర్వాత వారి పనులను యథావిధిగా చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ రకం కేసులు ఇటీవల కాలంలో ఎక్కువగా వస్తున్నట్లు కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా ఎందుకంటే?

రుమటాయిడ్, సోరియాసిస్ ఆర్థరైటిస్ వంటి ఇన్‌ఫ్లమేటరీ డిసీస్ కారణంగా కీళ్లపై విపరీతమైన ప్రభావం చూపుతుంది. తుంటి, కీళ్ల అరుగుదల ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా ఒబెసిటీతో కూడా చిన్న వయస్సులోనే కీళ్ల అరుగుదలకు గురవుతున్నారు. కొందరికి వృద్ధాప్యంలో కీళ్లు అరుగుతుంటే, ఆర్థరైటిస్, ఒబెసిటీ, పోస్టు కోవిడ్ వంటి కారణాలతో మధ్య వయస్సులోనే అరుగుదల ఎక్కువై నడవలేని స్థితికి చేరుకుంటున్నారు. మోకీలు అరుగుదల ఉన్న వారు నడవలేని స్థితికి చేరుకుంటారు. అలాంటి వారికి ప్రస్తుతం రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి వచ్చాయి. వైద్యులు వందశాతం సక్సెస్ రేటుతో విజయవంతంగా ఆపరేషన్లు చేస్తున్నారు.

ఏ దశలో సర్జరీ అవసరం అంటే..?

- కారణం లేకుండా తుంటినొప్పి వస్తుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. తొలుత ఎక్స్‌రే తీసి, ఎంఆర్‌ఐ స్కాన్ చేస్తారు. తొలి దశలో గుర్తించేందుకు ఎంఆర్‌ఐ స్కాన్ దోహద పడుతుంది.
- మొదటి దశలో నొప్పి నివారణ మాత్రలతో పాటు, ఎముకను బలపరిచే ఇంజెక్షన్లు, రక్తప్రసరణ పెంచే మందులను ఇస్తారు.
- రెండో దశలో ఉన్న వారికి చిన్న ఆపరేషన్ అవసరమవుతుంది. తుంటిలో ఒత్తిడి తగ్గించి రక్తప్రసరణ పెంచడానికి కోర్ డీ కంప్రెషన్ సర్జరీచేసి, ఎముకలోకి ఇంజెక్షన్ ఇస్తారు.
- భరించలేని నొప్పి ఉన్నా, కీలుపూర్తిగా దెబ్బతిన్నా తుంటి మార్పిడి ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది.
- పెద్ద వయస్సు వారికి టైటానియమ్, చిన్న వయస్సు వారికి సిరామిక్, ఆక్సినియమ్ కృత్రిమ కీళ్లను అమర్చడం వల్ల 30 ఏళ్లు మనుగడ సాధించవచ్చు.
- ఆపరేషన్ తర్వాత అన్ని పనులు చేసుకోవచ్చు. నొప్పిలేని నడకతో జీవితం సాగించవచ్చు.

తుంటి అరుగుదల లక్షణాలు ఇవీ..

- కారణం లేకుండా తుంటిలో నొప్పి వస్తుంది.
- విశ్రాంతిలో ఉన్నా నొప్పి తగ్గదు.
- రాత్రి నిద్రలో నొప్పి వస్తుంది.
- నడవలేక కుంటాల్సి వస్తుంది.
- చివరి స్టేజ్‌లో భరించరాని నొప్పి వేధిస్తుంది.
- క్రమేణా దినచర్యలు చేసుకోవడం కూడా కష్టంగా మారుతుంది.

వందశాతం సక్సెస్ రేటు



తుంటి, మోకీళ్లు అరిగిన వారు మా వద్దకు ఎక్కువగా వస్తున్నారు. వారిలో 20 నుంచి 80 ఏళ్ల వారు ఉంటున్నారు. వయసు రీత్యా, రుమటాయిడ్ ఆర్థరైటిస్, గతంలో గాయాలై కీళ్లు అరుగుదల ఉన్న వారు వస్తున్నారు. మోకీలుకు రోబోటిక్ సర్జరీలు చేస్తున్నాం. ఎలాంటి దుష్ఫలితాలకు తావులేకుండా ఆపరేషన్లు చేస్తున్నాం. టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీలను ఇటీవల కాలంలో ఎక్కువగా చేస్తున్నాం. వంద శాతం సక్సెస్ రేటు సాధిస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, కీళ్లమార్పిడి శస్త్ర చికిత్స నిపుణుడు

విరివిగా రుణాలివ్వాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఖాతాదారుల ఆధారాభిమానాలు పొందడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు బ్రాంచ్‌ను కలెక్టర్ సృజన జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మన జిల్లాలో 73 బ్రాంచ్‌లున్నాయని, వాటిల్లో ఒక్క విజయవాడ నగరంలో 40 బ్రాంచ్ శాఖల ద్వారా ఖాతాదారులకు సేవలు అందిస్తోందన్నారు. ఖాతాదారులకు నమ్మకం కలిగిస్తూ స్నేహపూర్వకమైన వాతావరణంలో సేవలందించినప్పుడే బ్యాంకింగ్ రంగంలో పోటీతత్వాన్ని ఎదుర్కోగలుగుతామన్నారు. పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, రైతులకు అవసరమైన పంట రుణాలను సకాలంలో అందించేందుకు కృషి చేయాలన్నారు.

ప్రజలకు చేరువ కావాలి..

జేసీ డాక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, డిపాజిట్ల కోసం ఖాతాలను మరింతగా పెంచుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ భాస్కరరావు మాట్లాడుతూ సమాజంలోని బడుగు వర్గాల ఆర్థిక అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం విద్యాధరపురానికి చెందిన నాగ సునీతకు రూ. 7 లక్షల కార్ లోన్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ సీవీయన్ భాస్కరరావు, రీజనల్ హెడ్ ముప్వల శ్రీధర్, డెప్యూటీ రీజనల్ హెడ్స్ హరీష్ బేతా, ఐఎస్ఎస్. మూర్తి పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

అడ్డొచ్చిన పోలీసులపైనా దాడి



యువకుడి వీరంగంతో పగిలిన పూలకుండీని యథాస్థానంలో ఉంచిన పోలీసులు

గుడివాడరూరల్: మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. పోలీసులపైనా దాడికి తెగబడ్డాడు. పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిళ్లపాడు గ్రామానికి మరీదు శ్రీనివాసరావు కుటుంబానికి, కోతిబొమ్మ సెంటర్‌లో నివాసముండే వేమూరి జాన్‌హెన్రీ(21)కు గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మరీదు శ్రీనివాసరావు కుటుంబం గీతాభవన్‌రోడ్డులోని ఓ దేవాలయానికి బుధవారం పూజ నిమిత్తం వచ్చింది. ఈ విషయాన్ని స్నేహితుల ద్వారా తెలుసుకున్న వేమూరి జాన్ హెన్రీ శ్రీనివాసరావుకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. వీరున్న ప్రాంతానికి వచ్చి దాడికి యత్నించాడు. ఈక్రమంలో పోలీసులకు స్థానికులు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు దాడిని అడ్డుకుని, నిందితుడిని స్టేషన్‌కు తీసుకువచ్చారు.

పోలీస్ స్టేషన్లో విధ్వంసం..

మద్యం మత్తులో ఉన్న నిందితుడు పోలీసులపై దాడికి తిరగబడ్డాడు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పూలకుండీ, వాకీటాకీ ధ్వంసం చేసి, అడ్డు వచ్చిన ముగ్గురు కానిస్టేబుల్స్‌పై దాడికి ఉపక్రమించాడు. ఈ క్రమంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ భక్తప్రహల్లాద్‌కు గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు తేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి గురైన కానిస్టేబుల్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన గురించి జిల్లా ఎస్పీ గంగాధరరావు టూటౌన్ సీఐకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు.



బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



రఘునందం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): తమ సమీప బంధువు అయిన బాలుడు కనిపించడం లేదని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్కూల్ బ్యాగులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న మహతో లక్ష్మణ్ అనే వ్యక్తి కంసాలిపేట జెండా చెట్టు వెనుక నివసిస్తున్నారు. అతని భార్య వదిన కుమారుడు బీహార్‌లో ఉంటున్న రఘునందం (12) 5వ తరగతి వరకు చదివి స్కూల్ మానేశాడు. అక్కడ తల్లి మాట వినకపోవడంతో రెండు నెలల క్రితం విజయవాడలోని లక్ష్మణ్ ఇంటికి పంపించారు. ఈ క్రమంలో ఆ బాలుడు ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గంటలకు టిఫిన్ చేసిన తర్వాత కిందకి వెళ్లి వస్తానని లక్ష్మణ్‌తో చెప్పి వెళ్లాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లి గాలించినా బాలుడి ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

భారీగా ఎస్ఐల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని ఏడు జిల్లాల్లో పనిచేసేందుకు సుమారు 111 మంది ప్రమోటీ ఎస్‌ఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్‌కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు 27 మంది, కృష్ణా జిల్లాకు 23 మంది, ఏలూరు జిల్లాకు 12 మంది, పశ్చిమగోదావరి జిల్లాకు 14 మంది, తూర్పుగోదావరి జిల్లాకు 13 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 9 మంది, కాకినాడ జిల్లాకు ఏడుగురు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆరుగురు ప్రమోటీ ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఆగస్టు 4న సీనియర్ నేషనల్స్ స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే సీనియర్ నేషనల్స్ ఎన్టీఆర్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ స్త్రీ, పురుషుల జట్లకు ఆగస్టు నాల్గో తేదీన విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో ఎంపిక చేస్తున్నట్లు స్విమ్మింగ్ ఎన్టీఆర్ జిల్లా సంఘం కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. 17–25 సంవత్సరాల వయసు కలిగి, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ)లో గుర్తింపు ఉన్న క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపిక పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు ఈ నెల 30వ తేదీ లోపుగా గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్ వద్దనున్న జిల్లా సంఘం కార్యాలయంలో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 25వ తేదీన బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 79895 34719ను సంప్రదించాలని సూచించారు.

సమీపిస్తున్న తుది గడువు

గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో కొనసాగుతున్న ప్రవేశాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కంచికచర్ల గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో బీఏ(చరిత్ర), బీకాం(జనరల్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) కోర్సులలో ప్రవేశాలు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మహిళా విద్యార్థినుల కోసం ప్రభుత్వం స్థాపించిన ఈ కళాశాల ప్రస్తుతం విజయవాడ మాచవరంలోని ఎస్ఆర్ఆర్అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలోని తాత్కాలిక వసతిలో కొనసాగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థినులు అందరికీ ఉచిత వసతి, ఉచిత భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో స్వయంగా కానీ 9705293208లో సంప్రదించవచ్చని తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): మానసికస్థితి సరిగా లేని పాతపాడు గ్రామానికి చెందిన యువకుడు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై నున్న పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు పాతపాడు గ్రామానికి చెందిన నల్లమోతు సంపత్‌కుమార్(22) 2021లో పాలిటెక్నిక్ పూర్తి చేసి ఈ–సెట్‌లో మంచి ర్యాంక్ రాకపోవడంతో మానసిక స్థితి దెబ్బతింది. 2022లో ఎవరికీ చెప్పకుండా చెన్నై వెళ్లిపోగా పోలీసుల సాయంతో తిరిగి పట్టుకొచ్చారు. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఇనుపరాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి నల్లమోతు శివశంకర్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



కాలువలకు జలకళ

కాలువలకు జలకళ వచ్చింది. నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు, పట్టిసీమ నీరుచేరికతో అధికారులు బ్యారేజీ నుంచి ప్రధాన కాలువలకు నీటిని మళ్లించారు. దీంతో పెనమలూరు నియోజకవర్గంలో గుండా ప్రవహించే బందరు, రైవస్ కాలువలు నిండుకుండలా ప్రవహిస్తున్నాయి. చిత్రంలో రైవస్‌లో కాలువలో నీటి ప్రవాహాన్ని చూడొచ్చు.

– కంకిపాడు

మాస్టర్స్ చెస్ టోర్నీ విజేతలు శ్రీరామ్, ఆయుక్తస్కంద



మాస్టర్స్ చెస్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

విజయవాడస్పోర్ట్స్: ది విజయవాడ చెస్ అసోసియేషన్, జూనియర్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి అండర్–7 బాలబాలికల పోటీల్లో ఎం.శ్రీరామ్, జె.ఆయుక్తస్కంద విజేతలుగా నిలిచారు. విజయవాడ కార్మెల్‌నగర్‌లో బుధవారం జరిగిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 30 మంది చిన్నారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో శ్రీరామ్ 4/4 పాయింట్లతో ప్రథమ, వై.రేశ్వంత్ 3/4 పాయింట్లతో ద్వితీయ స్థానాన్ని సాధించారు. బాలికల విభాగంలో 3/4 పాయింట్లతో ఆయుక్తస్కంద ప్రథమ, 2.5/4 పాయింట్లతో కె.అలనా ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. టోర్నీలో మొదటి రెండు స్థానాలు సాధించిన చిన్నారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామని, ఈ జట్టు ఆగస్టు 3,4 తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–7 పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని ది విజయవాడ చెస్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్ తెలిపారు. విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు అందించామని, పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశామని చెప్పారు.

కృష్ణా జట్టు విజయకేతనం



వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో తలపడుతున్న కృష్ణా, కడప జట్లు



106 పరుగులు చేసిన కృష్ణా బ్యాటర్ వరుణ్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాల వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా, విశాఖ, సెంట్రల్ జోన్ జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. జట్టులోని వరుణ్ సాత్విక్ 106 పరుగులు, సాయి అఖిల్ 59 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 46.5 ఓవర్లలో 190 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్‌వర్మ 52 పరుగులు చేశాడు. కృష్ణాబౌలర్లు రాజేష్ 4 వికెట్లు, సాయి ప్రకాష్ 3 వికెట్లు తీశారు. దీంతో కృష్ణా జట్టు 57 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, రెస్టాఫ్ సౌత్ జోన్ జట్లు తలపడగా విశాఖ జట్టు.. అదే మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్టాఫ్ నార్త్ జోన్, రెస్టాఫ్ సెంట్రల్ జట్లు తలపడగా రెస్టాఫ్ సెంట్రల్ జట్టు విజయం సాధించింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

REAL ESTATE

■ AP రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్రదించగలరు. (నో మీడియేటర్స్) ✆ 81429 75999.

PLOT FOR SALE

■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ॥గ॥ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర. ✆ 63028 55524

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

www.sakshi.com

WANTED

■ కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయుటకు యువకులు కావలెను. సంప్రదించండి. ఇన్‌ఛార్జ్ : సురేష్. ✆ 95509 77553.

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, స్త్రీలు / పురుషులు కావలెను. సంప్ర॥ ✆ 62819 15677, 99895 35178.

■ ప్రముఖ లైఫ్‌ఇన్సూరెన్స్ కంపెనీలో పార్ట్ / ఫుల్‌టైమ్‌గా జాబ్ చేయుటకు M/F కావలెను. జీతం 20 K to 50K P.M. + ఇన్సెంటివ్స్ ✆ 96664 43787, 88862 49308

■ ఎనికేపాడు 24/7 K Hall బ్యాక్సైడ్ కంపెనీకి సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ సిబ్బంది కావలెను. 12 గం॥ గార్డుకి 12,000/-, హౌస్ కీపింగ్ సిబ్బందికి 10,000/- + వీక్లీ ఆఫ్‌లు. సంప్ర. ✆ 62812 00949

■ విజయవాడ హాస్పిటల్‌లో పని చేయుటకు ఆయాలు కావలెను. నైట్ డ్యూటీ, డే డ్యూటీ. సంప్రదించగలరు. ✆ 99664 32828

■ MG రోడ్డు కానూరు, ఆటోనగర్‌లో అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డ్స్ & హౌస్ కీపింగ్ స్టాఫ్ (లేడీస్) కావలెను జీ.10000-14000, డ్యూ: 12 గం. Q. 10th+ ✆ 96401 41999, 73860 12524

■ ఎంతో నమ్మకమైన MNC కంపెనీలో Freelancerగా జాయిన్ అవ్వండి. అపరిమిత ఆదాయం పొందండి. ప్రత్యేకంగా రిటైర్డ్ బ్యాంకర్స్, గృహిణులు, వ్యాపారస్తుల, & Ex-సర్వీస్ మెన్. ✆ 91210 11579, 95023 67429

■ 60 వేలకి 100 గజాల ఫామ్ ల్యాండ్ 10 చందనం మొక్కలతో విముదా ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ మార్కెటింగ్ మేనేజర్స్ SGM, GM/టెలికాలర్ కావలెను ✆ 93816 58776

■ ప్రముఖ BBG రియల్ ఎస్టేట్ కంపెనీలో లేడీస్ & జెంట్స్, LIC ఏజెంట్స్, టీచర్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ కావలెను. నెలకు 50000 పైన సంపాదన. ఏవిధమైన పెట్టుబడి లేదు. 99591 25329, 93477 97569.

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ/ పు కావలెను. వీక్లీ పేమెంట్స్ వీక్లీ 4000/- ఇవ్వబడును. వివరాలకు వాట్సాప్ చేయండి. ✆ 70328 56389

■ అనుభవం గల హాస్టల్ వార్డెన్స్ (లేడీస్) కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. హాస్టల్ నందు ప్రతి రోజు భోజనం సప్లై చేయుటకు (300 నుండి 500 మందికి) క్యాటరర్స్ కావలెను. విజయవాడ. ✆ 9550483720

■ విజయవాడలో గల మా ఆఫీస్ నందు వర్క్ చేయుటకు Female Back end స్టాఫ్ కావలెను. అ: 10th ఆపైన వ:32 yrs లోపు, శా:12000 ✆ 7095656039

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్/ వాట్సాప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217

■ ప్రముఖ మ్యారేజి సంస్థలో పని చేయుటకు కంప్యూటర్ నాలెడ్జి గల F ఇన్‌ఛార్జి కావలెను. జీ: 20,000/-, F రిసెప్షనిస్ట్ జీ: 15000/- కావలెను. Q: డిగ్రీ, ఆటోనగర్, VJA-7. ✆ 8790 599 799

■ రైల్వే స్టేషన్ దగ్గర కన్‌స్ట్రక్షన్ సైట్‌లో నైట్ డ్యూటీ (4) & రాఘవయ్య పార్క్ దగ్గర హాస్పిటల్‌లో పనిచేయుటకు సె॥గార్డ్స్ కావలెను. 12 గం॥ డ్యూటీ, జీతం : 14K సంప్ర : ✆ 93911 11702

■ కేర్‌టేకర్ కావలెను. గుంటూరులో ఇంట్లోనే ఉండి పెద్ద వయస్సు గల మగ వారిని చూసుకోవలెను. ఏ బాదరబందీ లేకుండా ఉన్న మగవారు మాత్రమే కావలెను. 10వ తరగతి చదివి ఉండవలెను. జీతం: నెలకు: 12000/- సంవత్సరమునకు బోనస్: 40000/- భోజనం, వసతి కల్పించబడును. వివరములకు: 90102 99252 ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారు చేసి మాకు ఇవ్వండి, గ్రూప్‌లకు ఉచిత శిక్షణ. ఫోన్: 9491995565

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000. ఫ్రీ రూమ్+భోజనం. HYD. ఫోన్: 7995984445

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి దినపత్రికలో ప్రకటనలకై మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

విజయవాడ వెస్ట్ భవానీపురం విజయవాడ టౌన్ 7995092112
విజయవాడ సెంట్రల్ గాంధీనగర్, ఎస్.ఎన్.పురం, బెసెంట్‌రోడ్, సూర్యారావుపేట 9010131135
విజయవాడ ఈస్ట్ 9505507329
ఉయ్యూరు, కంకిపాడు 9010577706
గన్నవరం 9010210382

ఎన్టీఆర్ జిల్లా + కృష్ణాజిల్లా
నాలుగు లైన్లు రూ.600/-
ప్రతి అదనపు లైను రూ.150/-
+ 5% GST

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు కింద పేర్కొన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో న్యూ పీఅండ్‌టీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, విద్యుత్ కాలనీ, సాయిబాబా గుడి, ఎస్‌బీహెచ్ కాలనీ, బెంజ్‌సర్కిల్ ఫీడర్ పరిధిలో పటమట ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర, భద్రయ్య నగర్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, కేపీ నగర్, సాయిబాబా గుడి ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

500 మందికి ఉచిత కంటి పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో అయాన్ ఐ ఆస్పత్రికి చెందిన వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని ఐదు వందల మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బషీర్ అహ్మద్ పలువురికి కంటిలో పొలను గుర్తించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మరికొందరికి ఐ డ్రాప్స్ ఇచ్చారు. కంటి సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మోహనరావు, ఆస్పత్రి గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని జేకే గోజురియో కరాటే అకాడమీ సత్యనారాయణపురం బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులకు సంస్థ ప్రధాన కార్యాలయంలో బెల్ట్ ప్రమోషన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎల్లో బెల్ట్ నుంచి దశలవారీగా బ్లాక్ బెల్ట్ వరకు ప్రమోట్ అయిన విద్యార్థులకు సత్యనారాయణపురం బ్రాంచ్ హెడ్ కోచ్ పీవీకెఎస్ హర్ష బుధవారం ఆయా బెల్ట్‌లతోపాటు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దారుఢ్యం, ఆత్మరక్షణకు కరాటే విద్య దోహద పడుతుందన్నారు. కరాటేలో వివిధ రకాల బెల్టులు పొందిన విద్యార్థులు మరింత శిక్షణ తీసుకుని వారి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. పలు రకాల బెల్టులను అందుకున్న విద్యార్థులను అకాడమీ వ్యవస్థాపకుడు జె.శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరినాథ్, ట్రెజరర్ సీహెచ్ మహేష్‌బాబు అభినందించారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భారత ఐక్య యువజన సమాఖ్య (యువైఎఫ్ఐ) రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు డిమాండ్ చేశారు. విజయవాడ వించిపేటలోని సంఘ కార్యాలయంలో సంస్థ నగర కన్వీనర్ అనకాపల్లి కనకరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతను నిర్లక్ష్యం చేయడం తగదని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వ్యవసాయ రంగ అనుబంధ పరిశ్రమలు, పశువుల పెంపకం, పౌల్ట్రీ, డెయిరీ, చెరకు, చేపలు, రొయ్యల చెరువులు, పండ్ల తోటలు, పేపర్ మిల్లులలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్థికపరమైన ఇబ్బందులను తట్టుకోలేక ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కనకదుర్గనగర్‌లో నివాసం ఉంటున్న గరిమెళ్ల సాయి గన్నవరం మండలం ముస్తాబాదలో ఒక ఫెర్టిలైజర్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా అప్పుల భారం ఎక్కువై ఒత్తిడి పెరగటంతో సాయి గన్నవరంలోని ఒక ఫెర్టిలైజర్ షాపులో పురుగుల మందు కొనుగోలు చేసి ముస్తాబాదలోని తన పొలంలోకి వెళ్లి తాగాడు. ఇది చూసిన స్థానికులు కొందరు అతన్ని హుటాహుటిన కరెన్సీ నగర్‌లోని ఆయుష్ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలిసిన పటమట పోలీసులు ఆస్పత్రికి వెళ్లి విచారించారు. సాయి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

ఆహ్లాదం.. ఉల్లాసం... ఉత్తేజం

- పిల్లలతో సందడిగా మారిన పార్కు
- ఉత్సాహంగా క్రికెట్ నెట్ ప్రాక్టీస్ చేస్తున్న యువత
- ఆటల్లో మునిగితేలుతున్న చిన్నారులు
- మరిన్ని ఆటపరికరాలు ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాది క్రితం డివిజన్ అభివృద్ధిలో భాగంగా ఈ పార్కు ఏర్పాటుచేశారు. వారధి వెంబడి ప్రభుత్వ స్థలంలో నిరుపయోగంగా ఉన్న రేకుల షెడ్లను తొలగించి సుమారు రూ.30 లక్షల వ్యయంతో నగర పాలక సంస్థ ఈ పార్కును ఏర్పాటు చేసింది. దీనిలో వాకింగ్ ట్రాక్‌తో పాటు యువత క్రికెట్ ఆడుకునేందుకు క్రికెట్ నెట్ ప్రాక్టీస్, చిన్నారులు ఆడుకునేందుకు వివిధ రకాల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు.



క్రికెట్ నెట్ ప్రాక్టీస్ చేస్తున్న యువత



ఉత్సాహంగా ఆడుకుంటున్న చిన్నారులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట 18వ డివిజన్‌లోని పార్కు చిన్నారులతో సందడి సందడిగా మారింది. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పార్కు ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు, యువత, పెద్దలతో నిండిపోయి కళకళలాడుతోంది. పిల్లలు ఆటలు ఆడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో యువత క్రికెట్ నెట్ ప్రాక్టీస్‌తో, చిన్నారులు ఆట పరికరాలతో ఆటల్లో మునిగిపోతూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతున్నారు. పార్కు ఏర్పాటు చేసినప్పటి నుంచి నిత్యం ఈ పార్కు చిన్నారులు, పెద్దలతో సందడిగా ఉంటోంది. ఈ పార్కు ఎంతో ఉపయోగంగా ఉందని, పిల్లలు చెడుదారులు పట్టకుండా ఉత్సాహంగా ఆటలు ఆడుకుంటున్నారని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్కులో ఇంకా మరిన్ని ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కోచ్‌ను ఏర్పాటు చేయాలి

రాణిగారితోటలో వారధి వెంబడి లక్షలాది రూపాయలు వెచ్చించి క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ఏర్పాటు చేసినా కోచ్ లేకపోవడంతో పిల్లలకు సరైన శిక్షణ లభించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ప్రారంభమైనప్పటి నుంచి కోచ్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్న అధికారులు ఆ దిశగా మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి కోచ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యాన్నదానంకు రూ. లక్ష విరాళం



డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న దాత మల్లాది బలరామ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానంకు బుధవారం దాత మల్లాది బలరామ్ రూ. లక్ష విరాళంను మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో బాబా మందిరంను ఆంధ్రాషిర్డీగా తీర్చిదిద్దామన్నారు. ఇక్కడ షిర్డీలో మాదిరి అన్ని పూజలు నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేవీనగర్‌కు చెందిన దాత మల్లాది బలరామ్ మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానంలో తాను కూడా భాగస్వామి కావాలని విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు దాతకు బాబావారి శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్ నేత రవికుమార్‌కు సన్మానం



రవికుమార్‌ను సత్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బ్యాంక్ ఆఫీసర్ల సమస్యలను బ్యాంక్ యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫడరేషన్ (ఏఐబీవోసీ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.రవికుమార్ చెప్పారు. విజయవాడ గాయత్రీ నగర్‌లోని కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీబీవోఏ) కార్యాలయం ఆవరణలో కె.రవికుమార్‌ను సీబీవోఏ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మొదటి వారంలో గౌహతిలో జరిగిన ఏఐబీవోసీ సమావేశంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. తనకు వస్తున్న ఈ గుర్తింపు కేవలం కెనరా బ్యాంక్ మద్దతు వలనేనని రవికుమార్ చెప్పారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ జీఎం పి.రవివర్మ ఏజీఎం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం గుల్బర్గాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కెనరా బ్యాంక్‌లో ప్రయాణం మొదలు పెట్టిన రవికుమార్ కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నిక కావడమే కాకుండా ఏఐబీవోసీలో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. బ్యాంకింగ్ రంగంలో రవికుమార్ వేగంగా ఎదగడం ఆయన అంకితభావానికి, నాయకత్వ నైపుణ్యానికి నిదర్శనమని కొనియాడారు. కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు పి.రామ్‌ప్రసాద్, జీవన్ సత్యప్రకాష్‌తో పాటుగా అధిక సంఖ్యలో బ్యాంక్ సిబ్బంది హాజరై రవికుమార్‌ను సత్కరించారు. తనను సత్కరించిన బ్యాంక్ ఉద్యోగులకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు





లబ్బీపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి విచ్చేసి దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యం రావాలి

మండలి బుద్ధప్రసాద్



బాల త్రిపురసుందరి రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్ తదితరులు

విజయవాడ కల్చరల్: సమాజాన్ని, యువతను చైతన్య పరిచే సాహిత్యం రావాలని ఆ దిశగా రచయితలు కృషి చేయాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. రచయిత్రి భమిడిపాటి బాల త్రిపురసుందరి రచించిన ఐదు పుస్తకాలను కవులు, రచయితల సమక్షంలో బుధవారం హోటల్ ఐలాపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని సమస్యలు ప్రతిబింబించేలా రచనలు సాగాలని కోరారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ రచయిత్రి భమిడిపాటి గతంలో 25 పుస్తకాలకు పైగా ప్రచురించారంటూ ఆమె కృషిని అభినందించారు. అనంతరం బాల త్రిపురసుందరి రచించిన గోపాలబాల శతకం గ్రంథాన్ని మండలి బుద్ధప్రసాద్, నాయనమ్మ కథలు కథా సంపుటిని డాక్టర్ జీవీ పూర్ణచందు, వజ్రాయుధాలే గ్రంథాన్ని నలాన్ చక్రవర్తుల చక్రవర్తి, గుడి కథలు గ్రంథాన్ని ఆచార్య అద్దంకి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సాహితీ ప్రముఖులు డాక్టర్ రావి శారద, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, టి.శోభనాద్రి, గోళ్ల నారాయణరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత్రిని, అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

● త్యాగానికి ప్రతీక మొహర్రం







మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని పంజా సెంటర్ బుధవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు భారీగా తరలివచ్చి పంజా సెంటర్‌లోని పీరుల చావిడిని దర్శించుకున్నారు. లంకఫిర్ పంజా ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి పంజా సెంటర్‌లో అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సంప్రదాయబద్ధంగా ప్రార్థనలను నిర్వహించి వాటిని వెలిగించారు.

–వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

20న శారదా కళాసమితి వార్షికోత్సవం

విజయవాడ కల్చరల్: శారదా కళాసమితి 40వ వార్షికోత్సవ వేడుకలను 20వ తేదీ శనివారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు డోగిపర్తి శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు సుమన్, శాసన సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి, మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వివిధ రంగాలకు చెందిన వారికి సత్కార కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

నారాయణ తీర్థుల జయంతి ఉత్సవాలు ప్రారంభం



విజయవాడ కల్చరల్: కంచిపీఠ పాలిత శ్రీ శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానం, సామగాన లహరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సద్గురు నారాయణతీర్థులు 349వ జయంతి ఉత్సవాలు లబ్బీపేటలోని శ్రీ శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ప్రారంభమయ్యాయి. నారాయణ తీర్థులు రచించిన తరంగాలను నగరానికి చెందిన భమిడిపాటి లక్ష్మీజయతి, శ్రీ హంసిని, ధూళిపాళ సాయి దీక్షిత్, మల్లాది సంగీత సేవా సంస్థ బృంద సభ్యులు, మోదుమూడి సుధాకర్ బృందం, పోపూరి గౌరీనాథ్, మోదుమూడి సుధాకర్, మల్లాది సోదర ద్వయం శ్రీ రాంప్రసాద్, డాక్టర్ రవికుమార్ మధురంగా గానం చేశారు. ముందుగా నారాయణ తీర్థుల చిత్రపటానికి నిర్వాహకులు పూజాదికాలు నిర్వహించారు.

రేపటి నుంచి శాకంబరీ దేవిగా అలంకరణ

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): స్థానిక పెజ్జోనిపేటలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 19నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా ఉదయం దత్త హోమం, అభిషేకం, అన్న సంతర్పణ, రాత్రి పల్లకి సేవ, పవళింపు సేవ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సినీ వినీలాకాశంలో రంగనాథ్ స్థానం ఎనలేనిది

మధురానగర్(విజయవాడసెంట్రల్): సినీ వినీలాకాశంలో ప్రముఖ నటుడు, దర్శకుడు, రచయిత రంగనాథ్ స్థానం ఎనలేనిదని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎన్‌డీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక దుర్గాపురం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో బుధవారం సినీ నటుడు రంగనాథ్ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. శ్రీ రంగనాథ్ పేరిట డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ వారు కళాకారులకు స్మారక అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు తిరువాయిపాటి నరసింహారావును రంగనాథ్ స్మారక అవార్డుతో సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ రంగనాథ్‌తో ఉన్న పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. సన్మానకర్త నరసింహారావు మాట్లాడుతూ రంగనాథ్ పేరున స్మారక అవార్డ్ అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కేఎస్ఆర్ ఆంజనేయులు, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, నాగమల్లిక, ఎస్కే షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో విరాజి చిత్ర బృందం సందడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరుణ్ సందేశ్

పటమట(విజయవాడతూర్పు): సినీ హీరో వరుణ్ సందేశ్ నటించిన విరాజి చిత్రబృందం బుధవారం నగరంలో సందడి చేసింది. తన 17 ఏళ్ల సినీ కెరియర్‌లో ఇప్పటివరకు చేయని ఒక వినూత్నమైన సినిమా విరాజి చిత్రమని ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని హీరో వరుణ్ సందేశ్ కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా నగరంలోని ఓ హోటల్లో చిత్ర యూనిట్ విలేకరులతో మాట్లాడింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ ఒక డిఫరెంట్ కథతో డిఫరెంట్ లుక్‌తో ఆగస్టు రెండున విరాజి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చెప్పారు. విజయవాడ నగరం నుంచి చిత్ర ప్రమోషన్ ప్రారంభించామని, ఇప్పటివరకు ఏ హీరో చేయని మాదిరిగా విరాజీ చిత్రంలో తాను నటించిన క్యారెక్టర్‌ను ప్రేక్షకులకు తెలియజేసేందుకు అదే గెటప్పుతో ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ చిత్రంలో అన్ని రకాల అంశాలు ఉంటాయని, కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని వీక్షించ వచ్చని తెలిపారు. దర్శకుడు హర్షకు ఈ చిత్రం మొదటి చిత్రం అయినా కూడా ఒక సీనియర్ దర్శకుడి మాదిరిగా చిత్రాన్ని అద్భుతంగా తీశారని వివరించారు. ఈ చిత్రంలో హీరోయిన్ ఉండదని కేవలం నటీనటులు మాత్రమే ఉంటారని చెప్పారు. ఆగస్టు రెండున తమ చిత్రం విడుదల కానుందని, తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నటీమణులు అపర్ణాదేవి, కుషాలిని మాట్లాడుతూ విరాజీ చిత్రంలో తమ క్యారెక్టర్లు మహిళా ప్రేక్షకులకు నచ్చుతాయని తెలిపారు. చిన్న చిత్రాన్ని ఆదరించాలని వారు కోరారు. తదనంతరం చిత్ర నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల మాట్లాడారు.

21న వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): తెలుగు రాష్ట్రాలలో సమాజాన్ని పురోగమనం వైపు నడిపించేందుకు కృషిచేసిన వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో జరుగుతుందని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ తెలిపారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ తెలుగునాట 1650, 1700 సంవత్సరాల నాటి నుంచే అభ్యుదయ భావాలు పూరించిన పోతులూరి వీరబ్రహ్మం, ప్రజాకవి వేమన, కందుకూరి, గురజాడ, గిడుగు రామ్మూర్తి, గుడిపాటి వెంకటాచలం, కుసుమ ధర్మన్న, మగ్దూం మోహిద్దీన్, శ్రీశ్రీ, బండారు అచ్చమాంబ, దాశరథి కృష్ణమాచార్య లాంటి 32 మంది మహోన్నతుల చిత్రపటాలు ఆవిష్కరిస్తారన్నారు. సాహితీవేత్తలు రచయితలు, కవులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రేమికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రముఖ రచయిత్రి మందరపు హైమావతి, ప్రముఖ చిత్రకారులు అరసవిల్లి గిరిధర్, క్రాంతి కిరణ్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ, జేఎంఎస్ వ్యవస్థాపకుడు జె.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

● మెడబారు కొంగ...వింతగుంది చూడంగ...



గుణదల శివారు ప్రాంతంలో పంట పొలాల్లో ఓ బారు మెడతో రంగురంగుల కొంగ చూపరులను ఆకర్షించింది. సహజంగా మనకు స్థానికంగా కనపడే తెల్లటి కొంగలకు భిన్నంగా ఉన్న ఈ కొంగను ప్రజలు వింతగా చూశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

19 నుంచి గురు పౌర్ణమి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీభగవాన్ శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు గురుపౌర్ణమి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షులు పిల్లి లక్ష్మీతులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ శుక్రవారం విష్ణు, లలిత సహస్రనామ పారాయణం, గురుచరిత్ర, లీలామృతం, సచరిత్రలు జరుగుతాయన్నారు. 20వ తేదీ శనివారం కోలాటం, బాబావారి బిక్షాటన ఉంటుందని చెప్పారు. 21వ తేదీ ఆదివారం గురు పౌర్ణమి పురస్కరించుకుని సుప్రభాత సేవ, కాకడ హారతి, గణపతి పూజ, పంచామృత అభిషేకం, పూజలు జరుగుతాయన్నారు. భక్తులు గురుపౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆమె కోరారు.

చుట్టుగుంటలో...

చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని శ్రీ కల్యాణ షిర్డీ సాయిబాబా మందిరంలో 21వ తేదీ ఆదివారం గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పగడాల మధుసూధన రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ ఈస్ట్ : 99122 20539, 90101 31135
Office mail : sakshiads@gmail.com

క్లుప్తంగా...

కీసర ఇసుక స్టాక్ పాయింట్‌లో జేసీ తనిఖీ

'సాక్షి' కథనంపై స్పందించిన ఎన్టీఆర్ జిల్లా అధికారులు



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జేసీ

కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర ఇసుక స్టాక్ పాయింట్‌ను బుధవారం విజయవాడ జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తనిఖీ చేశారు. ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నేతల కనుసన్నల్లో జరుగుతున్న దోపిడీని వివరిస్తూ ఈ నెల 17వ తేదీ 'సాక్షి' మెయిన్ సంచికలో 'తమ్ముళ్లే ఇసుకాసురులై' పేరిట కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించారు. కీసర ఇసుక స్టాక్ పాయింట్‌ను జేసీ సంపత్‌కుమార్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్టాక్ పాయింట్ వద్ద ప్రభుత్వం ప్రకటించిన ధరకే లబ్ధిదారులకు ఇసుక ఇవ్వాలని ఆదేశించారు. ఒకసారి లోడింగ్ చేసిన వాహనం బయటకు వెళ్లే సమయంలో బిల్లుపై ఔటింగ్ టైమ్, స్టాంపు వేయాలన్నారు.

నా మాటలను తప్పుదారి పట్టించొద్దు

- మీడియా ప్రతినిధులను ఎన్నడూ దూషించలేదు
- ఎంపీ విజయసాయిరెడ్డి ఫైర్



సాక్షి, అమరావతి: మీడియా ప్రతినిధులను తాను ఎన్నడూ దూషించలేదని, అగౌరవ పరచలేదని, అది తన తత్త్వం కాదని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా ముసుగులో ఉన్న కుల అరాచక శక్తుల గురించే మాట్లాడానని, తన మాటలను తప్పుదారి పట్టించొద్దని అన్నారు. పెద్దల సభ సభ్యుడితో మాట్లాడే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 40 రోజులుగా జరుగుతున్న ఘోరాలపైనా కూటమి పెద్దలు ఓ శ్వేతపత్రం విడుదల చెయ్యాలన్నారు. సుగాలి ప్రీతి, మైనర్ బాలిక హత్య కేసులో ఏం చేశారని నిలదీశారు. ముందుగా విద్యా రంగంపై దృష్టి పెట్టండంటూ నారా లోకేశ్‌కు చురకలంటించారు.

అసెంబ్లీ మార్షల్ మృతి



లూథియారావు (ఫైల్)

పిట్టలవానిపాలెం: రాష్ట్ర అసెంబ్లీలో మార్షల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.లూథియారావు(39) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఉదయం 9గంటలకు అసెంబ్లీలో విధులకు హాజరయ్యారు. కొద్దిసేపటి తర్వాత ఆయనకు గుండెపోటు రాగా, వెంటనే సహచరులు మంగళగిరిలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తీసుకువెళుతుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందారు. బాపట్ల జిల్లా అల్లూరు గ్రామానికి చెందిన లూథియారావు లూథియారావుకు భార్య మెస్సీ గ్రేస్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వలస నేతలను తరిమేయాలి

బీఎస్పీ సమన్వయకర్త పూర్ణచంద్రరావు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ఉత్తరాంధ్రలో వేళ్లూనుకుపోతున్న వలస రాజకీయ నేతలను ఇంటికి పంపించేయాల్సిందేనని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త జె.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో బీఎస్పీ ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇక్కడి వారు పనికిరారంటూ ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీలు ఇతర జిల్లాల నాయకులకే టికెట్లు ఇస్తున్నాయని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర నేతలు కడపలో పోటీకి కనీసం టికెట్ సంపాదించగలరా.. అని ప్రశ్నించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యేలకే రాజారావు పాల్గొన్నారు.

4న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర నిర్మాణ సదస్సు

కడప సెవెన్‌రోడ్స్: అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర స్థాయి నిర్మాణ సదస్సు ఆగస్టు 4న కడపలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ సుందరరామరాజు తెలిపారు. ఆయన బుధవారం కడపలో విలేకరులతో మాట్లాడుతూ సదస్సుకు ముఖ్య అతిథులుగా జాతీయ నేతలు దేవరాజన్, గోవిందరాయ్, జ్యోతిరంజన్ మహాపాత్ర హాజరవుతారన్నారు.

సిలికా ఇసుక కొరత తీర్చండి: మెయ్యప్పన్

సాక్షి, అమరావతి: సిలికా ఇసుక కొరతను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శి సి.డి.మెయ్యప్పన్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ లేఖ రాశారు. ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల్లో వేలాది కుటుంబాల జీవనోపాధిని సిలికా ఇసుక సమస్య ప్రభావితం చేస్తోందని, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల కారణంగా ఫౌండ్రీ పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు (సిలికా ఇసుక) సరఫరా జూన్ మొదటి వారం నుంచి పూర్తిగా నిలిచిపోయిందని లేఖలో ఆయన ప్రస్తావించారు.

పసుపు పులిమేస్తున్నారు!



కృష్ణా జిల్లా కంకిపాడులో శిలాఫలకాలకు పసుపు రంగు వేసిన టీడీపీ కార్యకర్తలు



ఏలూరు జిల్లా వేగివాడలో బస్ షెల్టర్, బెంచీలకు పసుపు రంగు



తోచలక రాయుడుపాలెం గ్రామపంచాయతీ కార్యాలయానికి వేసిన పసుపు రంగు

ప్రభుత్వ కార్యాలయాలకే కాదు.. కనిపించిన రాళ్లకూ టీడీపీ శ్రేణులు పచ్చ రంగు పులిమేస్తున్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల వివరాలతో ఏర్పాటు చేయబోయే రాళ్లకు టీడీపీ కార్యకర్తలు పసుపు రంగు వేశారు. అలాగే, ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలోని వేగివాడ బస్ షెల్టర్‌కు, ప్రయాణికులు కూర్చునే బెంచీలకూ పసుపు రంగు వేశారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం తోచలకరాయుడుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయానికీ టీడీపీ కార్యకర్తలు పసుపు రంగు వేసి కార్యాలయం పైన పార్టీ జెండాలను కట్టారు.

– కంకిపాడు/లింగపాలెం/సాక్షి, టాస్క్‌ఫోర్స్

ముద్రగడ మాకు ఎప్పుడూ పెద్దకాపే..

అన్నమాట మేరకు పేరు మార్చుకున్న ఏకైక నాయకుడు ముద్రగడ: అంబటి రాంబాబు



ముద్రగడ పద్మనాభంను కలిసిన అంబటి రాంబాబు

కిర్లంపూడి: కాపు ఉద్యమనేత, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తమకు ఎప్పుడు పెద్ద కాపే అని మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఆయన బుధవారం కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్న తరువాత చాలా రోజుల నుంచి ఆయన్ని కలిసి అభినందనలు తెలపాలనుకున్నట్లు చెప్పారు. వంగవీటి రంగా హత్యకు ముందు విజయవాడలో చారిత్రాత్మకమైన కాపునాడు సభ జరుగుతున్న సమయంలో ముద్రగడ పద్మనాభం టీడీపీలో ఉన్నారని తెలిపారు. అప్పట్లో ఆ పార్టీకి రాజీనామా చేసి కాపునాడులో పాల్గొని, వక్తగా ముందుండి నడిపించిన నాయకుడు ముద్రగడ అని గుర్తుచేశారు. 2014 ఎన్నికల సమయంలో కాపులకు బీసీ రిజర్వేషన్లు ఇస్తానని హామీ ఇచ్చి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత కాపులకు ఇస్తానన్న రిజర్వేషన్ మాట ఎత్తకపోవడంతో ముద్రగడ తలపెట్టిన కాపు ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిందన్నారు. ముద్రగడ అహంకారి, కులతత్వవాది కాదని, పుట్టిన కులానికి అన్యాయం జరుగుతోందని సహించలేక ఉద్యమం తలపెట్టి రాజకీయంగా నష్టపోయారని చెప్పారు. ముద్రగడ కులం కోసం పోరాడారే తప్ప ఏనాడూ కులాన్ని ఉపయోగించుకోలేదని, ఆవగింజంత కూడా అవినీతి లేని నాయకుడని పేర్కొన్నారు. 'నాకు ఊహ తెలిసినప్పటి నుంచి చూస్తున్నాను. చాలామంది తామన్నది జరగకపోతే పేరు మార్చుకుంటానని సాధారణంగా అంటారు. కానీ పేరు మార్చుకున్న ఘటనలు ఎప్పుడూ జరగలేదు. అన్న మాట ప్రకారం ముద్రగడ పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్న నాయకుడిని ఇప్పుడే చూస్తున్నాను. కాబట్టే ఆయనను అభినందించాలని వచ్చాను..' అని చెప్పారు. దశాబ్దాల చరిత్రను చూస్తే సత్యహరిశ్చంద్రుడు ఇచ్చిన మాట తప్పలేక, కాలం కలిసిరాక, ఆ మాట కోసం కాటికాపరి అయ్యాడని, అలాగే ఎప్పటికీ ముద్రగడ పద్మనాభం ముద్రగడ పద్మనాభమే అని చెప్పడానికి వచ్చానని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సంగీత వెంకటరెడ్డిని గతంలో ఇక్కడ పెద్ద కాపు అని పిలిచేవారని, ముద్రగడ పద్మనాభం కూడా తమకు ఎప్పుడూ పెద్దకాపేనని, ఇటువంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని అంబటి చెప్పారు.

ఇప్పటికీ అదే అరాచకం

ఆగని శిలాఫలకాల ధ్వంసం



పల్నాడు జిల్లా చేజర్లలో సచివాలయం శిలాఫలకం ధ్వంసం చేసిన భాగం

సాక్షి, నెట్‌వర్క్: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజర్లలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల శిలాఫలకాలను మంగళవారం రాత్రి టీడీపీ శ్రేణులు ధ్వంసం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంపై పసుపు రంగు పూశారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం గోడలపై జై కన్నా, జేఎస్‌పీ, టీడీపీ, ఎన్టీఆర్ అని పసుపు రంగులతో రాశారు. గుంటూరులో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి కూలగొట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో గుంటూరు నగర అభివృద్ధిలో భాగంగా 54వ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్‌లోని మట్టి రోడ్ల స్థానంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా చర్యలు చేపట్టారు. దానికి సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దానిని పరిశీలించిన స్థానిక కార్పొరేటర్ మల్లవరపు రమ్య మాట్లాడుతూ.. డివిజన్‌లో జరిగిన అభివృద్ధిని చూడలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. శిలాఫలకం పడగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో రమ్య ఫిర్యాదు చేశారు.

వైఎస్ విగ్రహం ధ్వంసానికి యత్నం

బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం ఎస్సీ కాలనీలోని వైఎస్సార్ విగ్రహాన్ని టీడీపీ సానుభూతిపరులు మంగళవారం అర్ధరాత్రి ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఆ శబ్దాలకు స్థానికులు నిద్రలేచి కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. అప్పటికే విగ్రహం ముక్కు భాగాన్ని ధ్వంసం చేశారు.



పల్నాడు జిల్లా చేజర్లలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం గోడలపై పచ్చరాతలు



గుంటూరులో కూల్చివేసిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రమ్య

అచ్చెన్నాయుడి మనుషులనే అడ్డుకుంటారా?

మీ అంతు చూస్తాం.. • విశాఖ ట్రాఫిక్ పోలీసులకు టీడీపీ నాయకుల బెదిరింపులు

- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిపోయిన శ్రీకాకుళం టీడీపీ నేతలు
- డ్యూటీలో ఉన్న ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లపై దుర్భాషలు



వాహనం ఆపారని పోలీసులతో గొడవపడుతున్న టీడీపీ నాయకులు



డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ చేస్తున్న పోలీసులను వీడియో తీస్తున్న వ్యక్తి

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): పచ్చబిళ్ల చూపిస్తే పనైపోవాలి.. అంటూ గతంలో టీడీపీ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను పుణికిపుచ్చుకున్న ఆయన మనుషులు విశాఖలో బరితెగించారు. శ్రీకాకుళం నుంచి వచ్చి విశాఖలో పూటుగా మద్యం తాగి ట్రాఫిక్ పోలీసులపై రెచ్చిపోయారు. మంగళవారం అర్ధరాత్రి విశాఖలోని మద్దిలపాలెంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ పోలీసులపై ప్రతాపం చూపించారు. తనిఖీ కోసం కారు ఆపిన పోలీసులను తప్పించుకుని వేగంగా దూసుకెళ్లారు. దీంతో వారి వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు.. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసేందుకు సహకరించాలని కోరగా వారిపై రెచ్చిపోయారు. 'ఒరేయ్ అధికార పార్టీ నాయకుల కారునే ఆపుతారా.. మీ అంతు తేలుస్తాం రా.. అచ్చెన్నాయుడి మనుషులనే అడ్డుకోవడానికి మీకు ఎంత ధైర్యం?..' అంటూ శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం తామరాపల్లికి చెందిన టీడీపీ నాయకుడు పోలాకి ఢిల్లీశ్వరరావు తదితరులు రెచ్చిపోయారు. రోడ్డుపై వాహనాల రాకపోకలకు విఘాతం కలిగిస్తూ వీరంగం సృష్టించారు. దీంతో కొందరు పోలీసులు వారి చేష్టలను వీడియో తీసే ప్రయత్నం చేయగా వారిపైనా బెదిరింపులకు తెగబడ్డారు. 'తీయండ్రా తీయండి.. ఎన్ని వీడియోలు కావాలంటే అన్ని వీడియోలు తీసుకోండి.. మిమ్మల్ని సస్పెండ్ చేయించి, వీఆర్‌కు పంపించకపోతే మా పేర్లు మార్చుకుంటాం' అంటూ హెచ్చరించారు.

అసలు వారిని వదిలేసి డ్రైవర్‌పై కేసు

ఎస్‌ఐ, ఏఎస్‌ఐ స్థాయి అధికారులపై పచ్చ మూక బహిరంగంగా బెదిరింపులకు దిగినా.. వారిపై చర్యలకు ఆదేశించడంలో విశాఖ పోలీసు ఉన్నతాధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం విశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇంత జరిగినా డ్రంక్ అండ్ డ్రైవ్ చలానా నమోదు మినహా విశాఖ పోలీసులు పచ్చమూకపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇటీవలే త్రీటౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్‌పై దాడి జరిగిన ఘటన విశాఖ ప్రజలు మరువకముందే.. ట్రాఫిక్ పోలీసులపై తెలుగు తమ్ముళ్లు పూటుగా తాగి మద్దిలపాలెంలో బరితెగించిన ఘటన చోటుచేసుకోవడం విశాఖ వాసులతో పాటు పోలీసు వర్గాల్లోనూ ఆందోళన రేకెత్తించింది. ఈ ఘటన జరిగిన వెంటనే సమాచారాన్ని వీడియోలతో సహా ట్రాఫిక్ పోలీసులు ఉన్నతాధికారులకు పంపినట్టు తెలుస్తోంది. అయినా ఉన్నతాధికారులు ఈ ఘటనపై చర్యలకు ఆదేశించకపోవడం చర్చకు దారితీసింది. తెలుగు తమ్ముళ్ల బరితెగింపు వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎట్టకేలకు విశాఖ పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. బుధవారం రాత్రి కారు డ్రైవింగ్ చేస్తున్న టెక్కలికి చెందిన బొమ్మిలి మురళీపై కేసు నమోదు చేసి మమా.. అనిపించారు. ఈ గొడవకు కారకులైన ఢిల్లీశ్వరరావు తదితరులను పక్కన పెట్టి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం చర్చనీయాంశమైంది.

'పసుపు బిళ్ల'తో వస్తే పనిచేయొద్దు

విజయనగరం జిల్లా నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కూటమి అధికారంలోకి వచ్చిందనే ఆనందం టీడీపీ నాయకులకు నెల తిరగకముందే ఆవిరైపోయింది. 'మీకెందుకు పసుపు బిళ్లతో వెళ్లండి.. ప్రభుత్వ కార్యాలయాల్లో మీకు కుర్చీలు వేసి కూర్చోపెట్టి అధికారులు పనులు చేస్తారు..' అని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చినా పనులు జరగడం లేదు. పసుపు బిళ్లతోకాదు పసుపు చొక్కాలేసుకుని వచ్చినా పనులు కావడం లేదని తెలుస్తోంది. ఇప్పుడు ఈ అంశం.. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. తాను చెప్పిన పనులే.. తాను చెప్పినవారికే చేయాలని ప్రభుత్వాధికారులకు జనసేన ఎమ్మెల్యే లోకం నాగమాధవి హుకుం జారీ చేయడం టీడీపీ శ్రేణులకు తలనొప్పిగా మారింది. అంతేకాకుండా జనసేన నేతలకు తెలియకుండా ఏ పనులు చేయొద్దని, ఏ పని అయినా వారికి తెలియజేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు వారినే పిలవాలని ఆదేశించారు. ఈ మేరకు ఏకంగా ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరేసి చొప్పున జనసేన కార్యకర్తల పేర్లతో అధికారులకు మాధవి జాబితాలను పంపారని తెలుస్తోంది. దీంతో ఆమె వ్యవహరిస్తున్న తీరు పట్ల టీడీపీ నియోజకవర్గస్థాయి నాయకుల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు గుర్రుగా ఉన్నారని సమాచారం. ఎమ్మెల్యే వ్యవహార శైలితో తమకు అడుగడుగునా అవమానం జరుగుతోందని మండిపడుతున్నారు. అంతేకాకుండా ఇటీవల పూసపాటిరేగ మండలం చల్లవానితోటలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎదుట తమ ఆవేదనను వెళ్లగక్కారు. అయితే ఎంపీ కూడా సర్దుకుపోవాలని సూచించడంతో టీడీపీ శ్రేణులు మరింత కోపంతో రగిలిపోతున్నాయి. 90 శాతం టీడీపీ ఓట్లతో గెలిచిన జనసేన ఎమ్మెల్యే మాధవి ఇప్పుడు తమను పక్కనపెట్టడంపై టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఎంపీ కూడా తమ బాధను పట్టించుకోకపోవడంతో మరింత అసహనంతో ఉన్నారు.

జనసేన నేతలు చెప్పిన వారికే పనులు..

ఇటీవల నెల్లిమర్ల నియోజకవర్గంలో నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని వివిధ శాఖల అధికారులకు ఎమ్మెల్యే మాధవి.. జనసేన నాయకులు, కార్యకర్తల పేర్లతో కూడిన జాబితాలను ప్రత్యేకంగా పంపించారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు జాబితాలో పేర్లు ఉన్నవారిని మాత్రమే ఆహ్వానించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వారు చెప్పిన పనులకే ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యే చెప్పిన విధంగానే అధికారులు ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమాలకు జనసేన వారిని మాత్రమే ఆహ్వానించారు. అధికారులకు ఎమ్మెల్యే పంపిన జనసేన నేతల జాబితాలు సోషల్ మీడియాలో వైరల్ కావడం, స్టూడెంట్ కిట్స్ పంపిణీకి సైతం తమకు ఆహ్వానం దక్కకపోవడంతో టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మరోవైపు ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాలను అలుసుగా తీసుకున్న జనసేన కార్యకర్తలు తరచూ అధికారులకు ఫోన్లు చేస్తున్నారు. మాట వినకపోతే నేరుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లిపోతున్నారు.

ప్రొటోకాల్‌ను పట్టించుకోని అధికారులు..

గ్రామాల్లో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానాలు అందట్లేదు. ఊరు, పేరు తెలియని వాళ్లను ఆహ్వానిస్తూ తమను తీవ్రంగా అవమానిస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రొటోకాల్ వ్యవహారంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల వైఎస్సార్‌సీపీ వారితో పాటు టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. తమకూ ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానం అందించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. దీంతో అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది.

టీడీపీ, జనసేన వర్గాల పరస్పర దాడులు

- టీడీపీ నేతలపై కేసు నమోదు చేయాలని పట్టుబట్టిన జనసేన
- నాయకుల రంగప్రవేశంతో పోలీసుల తర్జనభర్జన



కర్రలతో దాడులు చేసుకుంటున్న టీడీపీ, జనసేన వర్గాలు

గోపవరం: వైఎస్సార్ జిల్లా గోపవరంలో జనసేన, టీడీపీ నాయకులు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. గోపవరం రెవెన్యూ పొలం 1,624 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో గ్రేటర్ రాయలసీమ ఫోరం కమిటీ ఆధ్వర్యంలో బద్వేలులోని మిద్దెలవారిపాలెం, కోటవీధి, లక్ష్మీపాలెం ప్రాంతాలకు చెందిన పేదలతోపాటు కొంతమంది బలిజ వర్గం వారు కూడా గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం రాత్రి ఆ గుడిసెలను కాల్చివేశారు. దీంతో సమాచారం అందుకున్న జనసేన నాయకులు భారీగా గుడిసెల వద్దకు చేరుకున్నారు. స్థానిక టీడీపీ నాయకులు కూడా అక్కడికి రావడంతో రెండు వర్గాల వారు పరస్పరం దాడులకు దిగారు. కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ, రూరల్ ఎస్‌ఐ రవికుమార్, సిబ్బంది వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ దాడుల్లో పలువురు గాయపడ్డారు. దాడులకు దిగిన ఇరు వర్గాల వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని జనసేన నాయకులు పట్టుబట్టారు. రెండు వర్గాల వారు బుధవారం రాత్రి వరకు పోలీసుస్టేషన్‌లో బలప్రదర్శనకు దిగారు. దీంతో నాయకులు రంగప్రవేశం చేసి రెండు వర్గాలను శాంతింపజేయడంతో పాటు కేసులు లేకుండా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎంపీడీవో అదృశ్యం ఘటనకు రాజకీయ రంగు!

- ఇంకా లభించని ఎంపీడీవో ఆచూకీ
- 15న వాట్సాప్‌లో కుటుంబ సభ్యులకు సూసైడ్ నోట్
- మాజీ చీఫ్ విప్ ప్రసాదరాజుపై బురద జల్లేందుకు కూటమి యత్నం

సాక్షి, అమరావతి/నరసాపురం/పెనమలూరు: కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ప్రతి దుశ్చర్యకు రాజకీయ రంగు పులిమి.. దానిని వైఎస్సార్‌సీపీకి అంటగట్టే ప్రయత్నాలు రోజురోజుకు పరాకాష్టకు చేరుకుంటున్నాయనేందుకు తాజాగా నరసాపురం ఎంపీడీవో అదృశ్య ఘటన నిదర్శనంగా నిలుస్తున్నది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకటరమణారావు ఈ నెల 15 నుంచి కనిపించడం లేదు. దీంతో తన భర్త అదృశ్యమయ్యాడని ఎంపీడీవో భార్య కృష్ణాజిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బహిర్గతమైంది. కృష్ణాజిల్లా కానూరులో నివసిస్తున్న వెంకటరమణారావు గతంలో కృష్ణాజిల్లాలో పనిచేసి



ఎంపీడీవో వెంకటరమణారావు

ఎన్నికల సందర్భంగా 5 నెలల క్రితం నరసాపురం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. అక్కడ ఫెర్రీ లీజు రూ.55 లక్షల విషయంలో ఆయనపై పలు ఒత్తిళ్లు వచ్చిన కారణంగా జూలై 10వ తేదీన సెలవు పెట్టారు. 15వ తేదీన మచిలీపట్నానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకొచ్చి.. మళ్లీ ఇంటికి చేరుకోలేదు.

విధి విధానాలు అనుసరించిన ఎంపీడీఓ..

రేవు నిర్వహణ విషయంలో ఎంపీడీవో పూర్తిగా విధివిధానాలను అనుసరించారు. పాటదారుడు బాకీ పడడంతో విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. పాటదారుడికి బాకీ చెల్లించాల్సిందిగా 9 నోటీసులు ఇచ్చారు. ఇక రేవు ఆదాయం ఇటు నరసాపురానికి, అటు తూర్పుగోదావరి జిల్లా మలికిపురం మండలపరిషత్‌కు సమానంగా వెళుతుంది. దీంతో రెండు మండల పరిషత్‌ల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీ కూడా వేశారు. పాటదారుడి బాకీపై జాయింట్ యాక్షన్ కమిటీ చర్చించి, రేవు స్వాధీనం చేసుకుంది. మళ్లీ పాట పెట్టే వరకు రేవును మండల పరిషత్ నిర్వహించేలా నిర్ణయించి అమలు చేస్తున్నారు. ఇలా చట్టపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్న ఎంపీడీవోపై తమకు అనుకూలంగా రేవు కాంట్రాక్టును ఇవ్వాలని కూటమి నేతల ఒత్తిళ్లు అధికమయ్యాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన అదృశ్యం కావడం తీవ్ర చర్చనీయాంశమయ్యింది.

ఎమ్మెల్యే నాయకర్.. ఇదేం పద్ధతి?

ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఎంపీడీవో అదృశ్యం కావడానికి ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, రేవు కాంట్రాక్టర్ ధవేజీ కారణమని, వారిపై కేసులు పెడతామని హెచ్చరించడంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభ్యంతరం చెబుతున్నాయి. ఈ వ్యవహారంలో ముదునూరి ప్రసాదరాజు, రేవు కాంట్రాక్టర్ సీహెచ్ రెడ్డప్ప ధవేజీలపై బురదజల్లి ఇరుకున పెట్టడానికి, కేసుల్లో ఇరికించడానికి కూటమి నేతలు విఫల ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోందనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే రేవు కాంట్రాక్టర్ సీహెచ్ చినరెడ్డప్ప ఈ విషయమై స్పందిస్తూ.. తాను రేవు నిర్వహణలో బాకీ ఉన్నమాట వాస్తవమేనని, ఈ విషయంలో ఎంపీడీవోపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎవరూ ఒత్తిళ్లు చేయలేదని తెలిపారు.

ఇంకా దొరకని ఆచూకీ..

పోలీసులు వెంకటరమణారావు ఫోన్‌ను ట్రాక్ చేయగా విజయవాడ మధురానగర్ ఏలూరు కాలువ ప్రాంతానికి ఆయన 15వ తేదీ అర్ధరాత్రి వచ్చినట్లు ట్రాక్ అయింది. వెంకటరమణారావు వాట్సాప్ మెసేజ్‌లో సూసైడ్ నోట్ కుటుంబ సభ్యులకు పెట్టి ఇదే తన చివరి రోజని తెలిపాడు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను తన కుటుంబానికి న్యాయం చేయాలని, కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. దీంతో పోలీసులు ఏలూరు కాలువలో దూకి ఉంటాడనే అనుమానంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు.

విచారణ చేపట్టండి: డిప్యూటీ సీఎం


నరసాపురం ఎంపీడీవో వెంకటరమణారావు అదృశ్యం, అందుకు దారి తీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

మంత్రి సంధ్యారాణి దుష్ప్రచారాన్ని మానుకోవాలి

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్



మాచర్ల: వైఎస్సార్‌సీపీ పాలనలో 18 గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి దుష్ప్రచారం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరా జ్యోత్ హనుమంత్ నాయక్ హితవు పలికారు. పల్నాడు జిల్లా మాచర్లలో బుధవారం వైఎస్సార్‌సీపీ గిరిజన నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజనులకు సంబంధించిన ఏ ఒక్క సంక్షేమ పథకాలు రద్దు చేయలేదని స్పష్టం చేశారు. మంత్రికి గిరిజనులపై చిత్తశుద్ధి ఉంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రద్దు చేసిన 18 గిరిజన సంక్షేమ పథకాలను బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు.



స్కూల్ డేస్ నుంచి కూడా నేనెప్పుడూ ఫస్ట్ ర్యాంక్ స్టూడెంట్‌ని కాదు. కానీ స్పోర్ట్స్, డాన్స్, సింగింగ్... ఇలా అన్నింటిలోనూ ఉండేదాన్ని. కాబట్టి టెన్త్‌లో బెస్ట్ ఆల్ రౌండర్ అవార్డు అందుకున్నాను.

హిమాలయాల్లోని కాంగ్ యాత్సే పర్వతంపై భారత జాతీయ పతాకంతో శ్రద్ధాంజలి సాహు

పర్వత పుత్రి సాహు



శ్రద్ధాంజలి సాహు... ఒడిశాలో పుట్టి, హైదరాబాద్‌లో పెరిగిన పంతొమ్మిదేళ్ల అమ్మాయి. బీటెక్ ఫైనలియర్. చదివేది సాఫ్ట్‌వేర్ కోర్సే అయినా తన పరిజ్ఞానాన్ని దేశ రక్షణరంగం కోసం అంకితం చేయాలనుకుంటోంది. 'ఆ కల కోసమే ఎన్‌సీసీలో చేరాను, ఆ కల నెరవేర్చుకునే క్రమంలో నన్ను నేను నిరూపించుకోవడం కోసమే పర్వతాన్ని అధిరోహించాను' అంటోంది. గత జూన్ నెల 21వ తేదీన కాంగ్ యాత్సే 2 పర్వతాన్ని అధిరోహించి, శిఖరం మీద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించింది. 'నా కల చాలా పెద్దదని నాకు తెలుసు. ఆ కలను సాకారం చేసుకోవడానికి శ్రద్ధగా ఒక్కో అడుగు వేస్తున్నాను' అంటూ 'సాక్షి ఫ్యామిలీ'తో తన పర్వతారోహణ అనుభవాల్ని పంచుకుంది శ్రద్ధాంజలి సాహు.

కాంగ్ యాత్సే పర్వతశ్రేణి హిమాలయాల్లో లధాక్ రీజియన్‌లో ఉంది. కాంగ్ యాత్సే పర్వత శిఖరం ఎత్తు 6,250 మీటర్లు. నా మౌంటెనీరింగ్ జర్నీ చాలా తమాషాగా జరిగిపోయింది. ఎయిత్ లోనో, నైన్త్ క్లాస్‌లోనో గుర్తులేదు. హిందీలో 'ఎవరెస్ట్ మేరీ శిఖర్' అనే పాఠం ఉండేది. మా హిందీ టీచర్ ఆ పాఠాన్ని ఎంత అద్భుతంగా చెప్పారంటే... బచేంద్రిపాల్‌లాగ నేను కూడా పర్వతారోహణ చేయాలనుకున్నాను. పర్వతాల గురించి తెలుసుకోవడం కూడా అప్పటి నుంచే మొదలైంది.

గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్‌సీసీ, హైదరాబాద్ కమాండర్ కల్నల్ అనిల్ ఆధ్వర్యంలో మౌంటెనీరింగ్ అవకాశం రాగానే మరేమీ ఆలోచించకుండా ట్రెనింగ్‌కి వెళ్లాను. హెచ్ఎమ్ఐ (హిమాలయన్ మౌంటెనీరింగ్ ఇన్‌స్టిట్యూట్) ఆధ్వర్యంలో డార్జిలింగ్‌లో నెల రోజులు బేసిక్ ట్రైనింగ్, ఆ తర్వాత ఈ ఏడాది మార్చిలో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్, సెర్చ్ అండ్ రెస్క్యూ మెథడ్స్ ట్రైనింగ్ ఉత్తరాఖండ్‌లో పూర్తి చేసుకుని ఎక్స్‌పెడిషన్‌కు సిద్ధమయ్యాను.

అమ్మకు దూరంగా యాభై రోజులు

ఢిల్లీలో మే 28న ఫ్లాగ్ ఆఫ్, జూన్ 29న ఫ్లాగ్ ఆన్ జరిగింది. ముందు, వెనుక ప్రయాణాలన్నీ కలిపి యాభై రోజులు ఇంటికి దూరంగా ఉండడం అదే మొదటిసారి. అమ్మానాన్నల దగ్గర ఉన్నప్పుడు వాళ్ల ప్రేమను ఆస్వాదిస్తూ ఉంటాం. వాళ్లకు దూరంగా ఉండడం ఎంత కష్టమో దూరంగా ఉన్నప్పుడే తెలుస్తుంది. అమ్మానాన్నల ప్రేమ ఎంత అమూల్యమైనదో తెలిసి వచ్చిన క్షణాలవి. ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగానికి వెళ్లాలనుకున్నప్పుడు అమ్మ ఒప్పుకోలేదు. మౌంటెనీరింగ్‌కీ ఒప్పుకోలేదు. అమ్మను ఒప్పిస్తే నాన్న ఆటోమేటిగ్గా ఒప్పుకుంటాడని, అమ్మను బాగా కన్విన్స్ చేశాను. ఈ టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేశాను. ఇక రక్షణరంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవడం గురించి ఒప్పించి, నాకున్న డిఫెన్స్ యూనిఫామ్ కల నెరవేర్చుకోవాలి. ఇప్పుడు ఒప్పుకుంటారనే నమ్మకం ఉంది.

ఆరోహణలో అవరోధాలు

కాంగ్ యాత్సే 2 పర్వతారోహణ మర్ఖా వ్యాలీ దగ్గర మొదలవుతుంది. మౌంటెనీరింగ్ బూట్స్, క్రాంపన్స్‌లలో ఐదు కేజీల బరువులుంటాయి. అవసరమైన వస్తువులతో ఇరవై కేజీల బ్యాగ్ మోస్తూ నడక మొదలవుతుంది. ఐదువేల మీటర్లు దాటిన తర్వాత బేస్ క్యాంప్ ఉంటుంది. అక్కడి వరకు మన అన్నం, పప్పు ఉంటాయి. ఆ తర్వాత పైకి వెళ్లే కొద్దీ అన్నం ఉడకదు, చపాతీలు కాల్చడం కుదరదు. డ్రై రేషన్... అంటే డ్రై ఫ్రూట్స్, నట్స్, చాక్లెట్‌లు, న్యూట్రిషన్ బిస్కట్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లతో ప్రయాణం కొనసాగుతుంది. నడక... నడక... ధ్యానంలాగ తదేక దీక్షతో సాగుతుంది. అడుగు పడిన చోట గట్టిగా ఉందా జారుతోందా అని మన ముందు వాళ్ల అడుగులను గమనిస్తూ వెళ్లాలి. ఈ నడక సమయంలో అనేక ఆలోచనలు వస్తాయి. ముందుకెళ్లి ఏం సాధిస్తాం, వెనక్కి వెళ్తే నష్టపోయేదేముంది... అని కూడా అనిపిస్తుంది. ఆరోహణ పూర్తయ్యేటప్పటికి ఒక పరిపూర్ణమైన వ్యక్తిగా మారుతాం. పరస్పరం సహకరించుకోవడంతోపాటు ఉద్వేగాలకు లోనుకాకుండా ప్రశాంతంగా ఉండడం, ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వినే లక్షణం కూడా అలవడుతుంది. శిఖరాన్ని చేరినప్పుడు సమయం ఉదయం ఏడున్నర. సూర్యోదయం అయింది. చుట్టూ తెల్లని వలయం ఆవరించినట్లు ఉంది. వైట్ అవుట్ అంటారు. మేఘాలు ఆవరించి ఉంటాయి. పది మీటర్ల దూరాన ఉన్న మనిషి కూడా కనిపించడు. శిఖరాన్ని అధిరోహించినప్పుడు కలిగే అనుభూతిని మాటల్లో వర్ణించగలిగినంత సాహిత్యాన్ని చదవలేదు'' అని నవ్వుతూ ముగించింది శ్రద్ధాంజలి సాహు. మౌంటెనీరింగ్‌లో వచ్చే ఏడాది జరిగే మౌంట్ ఎవరెస్ట్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పెడిషన్‌కు ఆమెకు ఆహ్వానం వచ్చింది. ఎంపిక ప్రక్రియ మొదలు కావాల్సి ఉంది.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: నోముల రాజేశ్ రెడ్డి

సంప్రదాయం

ఆకాంక్షలే ఆలంబనగా రొట్టెల పండగ

అక్కడకు తరలి వచ్చేవారివి చిన్న చిన్న కోరికలే. చదువు రావాలి, ఉద్యోగం రావాలి, వివాహం జరగాలి, సంతానం కలగాలి అనే...
జీవితంలో ఆకాంక్షలు ఉండాలి. ఆ ఆకాంక్షలు నెరవేరతాయనే ఆశ ఉండాలి. అలాంటి వారికి అభయమిచ్చే ఆధ్యాత్మిక వేడుకలు ఎన్నో. అలాంటి వాటిలో ఒకటి 'రొట్టెల పండగ' నెల్లూరులో జరిగే ఈ పండగలో స్త్రీలు విశేషంగా పాల్గొంటారు.



రొట్టెలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు

ప్రతి సంవత్సరం మొహరం పండగ వేళలో నెల్లూరు వీధులు పోటెత్తుతాయి. దేశ విదేశాల నుంచి జనం నెల్లూరులోని బారా షహీద్ దర్గా దగ్గరకు చేరుకుంటారు. కులం, మతం, భాష, ప్రాంతం... తేడా లేకుండా అక్కడి స్వర్ణాల చెరువులో మొక్కు మొక్కుకుంటారు. లేదా తీర్చుకుంటారు. మొక్కు తీరిన వారు రొట్టె పంచుతారు. మొక్కుకునే వారు ఆ రొట్టెను స్వీకరిస్తారు. తరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం చెక్కు చెదరడం లేదు. ప్రతి సంవత్సరం ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుక నిన్నటి నుంచి ఘనంగా జరుగుతోంది. ఇది ప్రధానంగా స్త్రీల పండగ.

ఎవరు ఈ బారా షహీద్?

మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని ప్రపంచ వ్యాప్తం చేయడంలో భాగంగా టర్కీ నుంచి సుమారు 300 ఏళ్ల క్రితం 12 మంది మతబోధకులు భారతదేశానికి వచ్చారు. ఆ సమయంలో కొడవలూరు మండలంలోని గండవరంలో తమిళనాడు వాల్లాజాలకు, బీజాపూర్ సుల్తాన్‌లకు మధ్య యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఈ 12 మంది వీరమరణం పొందారు. వీరి తలలు గండవరంలో తెగిపడగా మొండాలను గుర్రాలు నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్దకు తీసుకు వచ్చాయి. ఈ 12 మంది నెల్లూరు ఖ్వాజీకి కలలో కనపడి తమను అక్కడే సమాధి చేయాలని కోరడంతో అక్కడే సమాధులు నిర్మించారు. 12ను ఉర్దూలో బారా, వీర మరణం పొందిన అమరులను షహీద్‌లుగా పిలుస్తారు. అందుకే ఈ దర్గాకు బారా షహీద్ అనే పేరొచ్చింది.

వివాహం రొట్టె.. సంతాన రొట్టె

నెల్లూరు బారా షహీద్ దర్గాలో మొక్కు రొట్టెతో ముడిపడి ఉంటుంది. ఇక్కడకు వచ్చే భక్తులు ఉద్యోగం, ప్రమోషన్, సౌభాగ్యం, సంతానం, విద్య, స్వగృహం, వ్యాపారం... ఈ కోరికలు నెరవేరాలని మొక్కుకునేందుకు వస్తారు. గతంలో మొక్కిన మొక్కులు తీరిన వారు రొట్టెలతో వస్తారు. వారి నుంచి రొట్టె తీసుకోవాలి. అంటే గతంలో వివాహ మొక్కు మొక్కుకుని వివాహం జరిగిన వారు రొట్టెలతో వస్తారు. వివాహం కావలసిన వారు వారి దగ్గర నుంచి రొట్టె స్వీకరించి తినాలి. మొక్కు తీరాక వాళ్లు ఇలాగే రొట్టెను తెచ్చి ఇవ్వాలి. బారా షహీద్ దర్గా పక్కనే ఉన్న స్వర్ణాల చెరువులో మోకాళ్ల లోతుకు దిగి స్త్రీలు ఈ రొట్టెల బదలాయింపు చేసుకుంటారు. బాకీ తీరాలనే రొట్టె, స్థలం కొనాలనే రొట్టె, ర్యాంకుల రొట్టె... ఇవన్నీ అదృష్టాన్ని బట్టి దొరుకుతాయి. అన్నింటి కంటే ఎక్కువగా ఆరోగ్య రొట్టె కోసం వస్తారు.

రొట్టెల ఆనవాయితీ

తమిళనాడు నుంచి నెల్లూరు వరకు ఆర్కాట్ నవాబుల ఏలుబడిలో ఉన్నప్పుడు నవాబు భార్య జబ్బు పడితే ఆమెకు నయం అయ్యే మార్గం కోసం నవాబు ఎదురు చూస్తున్నాడు. అదే సమయంలో బారా షహీద్ దర్గా దగ్గర బట్టలు ఉతుకుతున్న రజకునికి ఆ రాత్రి బారా షహీద్‌లు కనబడి మా సమాధుల దగ్గరి మట్టి తీసుకుని నవాబు భార్య నుదుటికి రాస్తే నయం అవుతుందని చెప్పారు. ఆ సంగతి రజకుడు ఊరి వారికి తెలుపగా వారు నవాబుకు తెలియచేశారు. మట్టి తెప్పించిన నవాబు దానిని తన భార్య నుదుటికి రాయగా 24 గంటల్లో ఆమెకు నయం అయ్యింది. దాంతో అతడు అంత దూరం నుంచి బారా షహీద్ దర్గాను చూడటానికి వచ్చాడు. దర్శనం అయ్యాక అక్కడ ఉన్న పేదలకు రొట్టెలు పంచాడు. మొక్కు తీరాక ఇలా రొట్టెలు పంచడం ఆనవాయితీ అయ్యింది. ఈ నెల 21 వరకు రొట్టెల పండగ జరుగుతుంది.



- కొండా సుబ్రహ్మణ్యం,
సాక్షి, నెల్లూరు

హెల్దీ డైట్ | మఖానా దోసె



- డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

కావలసినవి: మఖానా – కప్పు; దోసె పిండి – రెండు కప్పులు; ఉప్పు – పావు టీ స్పూన్; చక్కెర – పావు టీ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; మిరియాల పొడి – పావు టీ స్పూన్; నెయ్యి– 2 టీ స్పూన్‌లు

తయారీ: ● మఖానాను నీటిలో 4–5 గంటల సేపు నానబెట్టాలి. నానిన తర్వాత నీటిని వంపేసి మిక్సీలో మెత్తగా పేస్ట్ చేయాలి ● ఒక పాత్రలో దోసెపిండి తీసుకుని అందులో ఉప్పు, చక్కెర, జీలకర్ర, మిరియాల పొడి, మఖానా పేస్ట్ వేసి బాగా కలిపి గరిటె జారుడుగా చేసుకోవాలి ● స్టవ్ మీద పెనం పెట్టి వేడి చేసి దోసె పోయాలి. మీడియం మంట మీద దోరగా కాల్చి తిరగేయాలి. రెండు వైపులా కాలిన తర్వాత ప్లేట్‌లోకి తీసుకుని పిల్లలకు ఇష్టమైన వెన్న, చట్నీ, సాంబార్, పొడులతో సర్వ్ చేయాలి ● ఇష్టమైతే దోసె మీద ఉల్లిపాయ , వెల్లుల్లి, అల్లం ముక్కలు చల్లుకోవచ్చు.

* * *



మఖానా అంటే తామర గింజలు. ఫూల్ మఖానా అని కూడా అంటారు. ఈ మఖానాలో క్యాల్షియం, మెగ్నీషియం, విటమిన్ ఏ, బీ6, యాంటీ ఆక్సిడెంట్‌లు, ఫైబర్, ఐరన్ ఉంటాయి. ఇంకా మినరల్స్, కాపర్, పాస్ఫరస్, మాంగనీస్ వంటి సూక్ష్మ పోషకాలుంటాయి. ఉండే మెగ్నీషియం, విటమిన్ ఏ కంటి చూపుకు, బీ6లు జ్ఞాపకశక్తిని పెంచడానికి దోహదం చేస్తాయి. క్యాల్షియం ఎముకలు, దంతాల గట్టిదనానికి సహకరిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌లు ఇతర సూక్ష్మపోషకాలు వ్యాధినిరోధక శక్తిని వృద్ధి చేస్తాయి. ఫైబర్ మలబద్ధకాన్ని నివారించి, జీర్ణవ్యవస్థ పని తీరును మెరుగుపరుస్తుంది. నీరసం, తలతిరగడం వంటి సమస్యలను ఐరన్ పరిష్కరిస్తుంది. ఇందులో గ్లూటెన్ ఉండదు. కాబట్టి గ్లూటెన్ అలర్జీ ఉన్న పిల్లలకు ఇది మంచి ప్రత్యామ్నాయం.

ఈ దోసెలో ఏమేమి ఉంటాయి... ఎంతెంత ఉంటాయి!

● శక్తి	700 కేలరీలు
● ప్రొటీన్	20 గ్రాములు
● ఫ్యాట్	0.2 గ్రాములు
● కార్బోహైడ్రేట్‌లు	153 గ్రాములు
● ఫైబర్	29 గ్రాములు
● క్యాల్షియం	120 మిల్లీ గ్రాములు
● ఐరన్	2.8 మిల్లీ గ్రాములు
● మెగ్నీషియం	196 మిల్లీగ్రాములు
● పాస్ఫరస్	772 మిల్లీగ్రాములు
● పొటాషియం	948 మిల్లీగ్రాములు
● జింక్	204 మిల్లీగ్రాములు

ఔరా..!

స్లిప్పర్స్‌కు లక్ష!



మీరు విన్నది నిజమే! మన రెగ్యులర్‌గా ఉపయోగించే స్లిప్పర్స్ సౌదీలో అక్షరాలా లక్షకు పైమాటే! కువైట్, చుట్టుపక్కల న్యూస్ పంచుకునే ఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాదారు ఒక స్టోర్‌లో రికార్డ్ చేసిన వీడియోను షేర్ చేసింది. 'అత్యాధునికమైనవి'గా 'చెప్పు' కుంటున్న ఈ స్లిప్పర్స్ ధర 4,590 సౌదీ రియాల్స్ పలుకుతోంది. ఇది మన రూపాయలలో లక్షా రెండువేలకు పైగానే! ఎరుపు, పసుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో సహా వివిధ రంగులలో ఉన్న స్లిప్పర్స్ జతలను ఓ ఉద్యోగి గ్లాస్ కేస్‌లోంచి తీసి వీడియో రికార్డ్ చేస్తున్న వ్యక్తికి చూపించాడు. ఈ వీడియో చూసిన నెటిజనులు... 'ఇవి మా కుటుంబం వాడే బాత్రూమ్ చెప్పులు' అని, 'ఇండియాలో వీటిని టాయిలెట్ పాదరక్షలుగా ఉపయోగిస్తారనీ కామెంట్ చేస్తున్నారు.

యోగం

ఒత్తిడిని తగ్గించే బాలాసనం

బాలాసనంలో శరీరం మొత్తం ముందుకు సాగి, చంటి పిల్లలు బోర్లా పడుకున్నప్పుడు కనిపించే భంగిమలో ఉంటారు. దీనిని శశాంకాసనం అనికూడా ఉంటారు. ఈ ఆసనంలో వెన్నెముక సాగి, మోకాళ్లు బలపడతాయి. పొత్తికడుపులోని అవయవాలకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. నడుం నొప్పిసమస్యలు తగ్గుతాయి. ఒత్తిడి తగ్గి, శరీరం మొత్తం విశ్రాంతి పొందుతుంది.



ముందుగా మ్యాట్‌పైన కాలి మడమల మీద హిప్ భాగం ఉండేలా వజ్రాసనంలో కూర్చోవాలి. తర్వాత నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ రెండు చేతులు పైకి ఎత్తాలి. శ్వాస వదులుతూ తల, పొట్ట భాగాన్ని ముందుకు మోకాళ్ల మీదుగా పూర్తిగా వంచాలి. చేతులను నేలపై తలకిరువైపులా వెడల్పుగా 'వి' ఆకారంలో ఉంచాలి. ఈ పొజిషన్‌లో 30 సెకన్ల పాటు ఆగి, విశ్రాంతి పొందాలి. తర్వాత తిరిగి వజ్రాసనంలోకి రావాలి. ఇలా సుమారు 10 సార్లు చేయాలి.

ఫలితాలు: రోజువారీ పనుల ద్వారా కలిగే ఒత్తిడి, చిరాకు లాంటి సమస్యలు దూరం అవుతాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. పేగులు, కాలేయం, మూత్రపిండాలకు బలం చేకూరుతుంది. మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నవారికి మంచి ఉపశమనం లభిస్తుంది. ఎముకల సమస్యతో బాధపడేవారు, హైబీపి ఉన్నవారు నిపుణుల సూచనలు తీసుకోవాలి.



- జి. అనూషా రాకేష్, యోగా ట్రైనర్

మానవత

పెద్ద జబ్బుతో ఆసుపత్రి పాలైన నిరుపేదల దగ్గర లక్షల్లో ఖర్చుచేసేటంత డబ్బు ఉండదు. ప్రాణాలు నిలబడాలంటే ఏం చేయాలి మరి? ఇందుకు సమాధానమే క్రౌడ్ ఫండింగ్. ఆరోగ్యం, విద్య, జంతువుల సంక్షేమం, ప్రకృతి వైపరీత్యాలు, మహిళా సాధికారత కోసం విరాళాలను క్రౌడ్ ఫండింగ్ ద్వారా సమకూర్చుతున్నాయి కొన్ని ఆన్‌లైన్ వేదికలు.



సాయం కాపాడుతున్న ప్రాణం క్రౌడ్ ఫండింగ్

కర్నూలు జిల్లాకు చెందిన తొమ్మిదేళ్ల సానియా వెంట్రిక్యులర్ సెప్టల్ డిఫెక్ట్ వ్యాధితో బాధపడుతోంది. ఈ వ్యాధి చికిత్సకు రూ.12 లక్షలు కావాలి. తండ్రి రాళ్లు కొట్టే పని చేస్తుంటాడు. తల్లి గృహిణి. కుమార్తెకు చికిత్స చేయించే స్తోమత లేకపోవడంతో వీరికి 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' అండగా నిలిచింది. ఈ ఫౌండేషన్ విభిన్న వేదికల్లో క్రౌడ్ ఫండింగ్ చేపట్టింది. రూ.12 లక్షలు క్రౌడ్ ఫండింగ్ ద్వారా జమ అయ్యి, చిన్నారికి చికిత్స జరిగింది. ప్రాణాలు నిలబడ్డాయి.

● ● ●

రహ్మద్ బాషా విజయవాడలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతనికి నెలల నిండకుండానే 704 గ్రాముల బరువుతో కూతురు పుట్టింది. ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఐసీయులో చికిత్స పొందుతోంది. 'పాప చికిత్సకు రూ.14 లక్షలు అవసరం. దయచేసి, సహాయం చేసి, మా పాపను బతికించండి' అని క్రౌడ్‌ఫండింగ్ నిధుల సమీకరణ లింక్‌లో విన్నవించుకున్నాడు. చికిత్సకు అవసరమయ్యే డబ్బు వారికి అందుతోంది.

● ● ●

కేరళలోని ఎర్నాకుళానికి చెందిన సారంగ్ మీనన్, అదితి నాయర్‌ల ఏడాదిన్నర కుమారుడు నిర్వాణ్ వెన్నెముక కండరాల క్షీణత అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ చికిత్సకు దాదాపు రూ.17.5 కోట్లు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఈ వ్యాధి నివారణకు ఉపయోగించే వన్‌టైమ్ డ్రగ్ జోల్జెన్స్మా ఇండియాలో అందుబాటులో లేదు. దీనిని అమెరికా నుంచి తెప్పించాలి. ఇదే విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా తెలియజేయడంతో క్రౌడ్ ఫండింగ్ ద్వారా 72 వేల మంది విరాళాలు అందించారు.

● ● ●

ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా, మా వల్ల ఏమవుతుంది... అంటూ కుదేలవ్వాల్సిన పని లేదని చెప్పే ఇలాంటి కథనాలు ఎంతో ధైర్యాన్నిస్తున్నాయి. ఆరోగ్యపరంగా ఎంత అవసరం వచ్చినా, దాతల నుంచి విరాళాలు తెచ్చి పెట్టేందుకు నేడు ఎన్నో వేదికలు పనిచేస్తున్నాయి. వేలాది మంది బాధితుల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయి. అదే సమయంలో ఇలాంటి బాధితులకు సాయం చేశామనే సంతృప్తి దాతలకు లభిస్తోంది. కాకపోతే విరాళం ఇచ్చే ముందు విచారించి, నిజమైనదేనని నిర్ధారించుకోవడం ద్వారా తమ దానం నిష్ఫలం కాకుండా చూసుకోవచ్చు. మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు ఎలా పనిచేస్తాయో తెలుసుకుంటే.. సాయం పొందచ్చు. తోచినంత సాయమూ చేయచ్చు.

విశ్వసనీయమైన ఎంపిక

క్రౌడ్ ఫండింగ్‌లో ప్రతి ప్రయత్నం సవాల్‌తో కూడుకున్నదే. ప్రచారం చేసినప్పటికీ మొత్తం నిధుల సేకరణ లక్ష్యాన్ని చేరుకోలేకపోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో క్రౌడ్‌ఫండింగ్ విశ్వసనీయమైన ఆర్థిక ఎంపికగా మారినందున మోసం, దుర్వినియోగం వంటివీ జరగచ్చు. తప్పుదారి పట్టించే లేదా మోసపూరితమైన నిధుల సమీకరణను చూసినట్లయితే, దానిని వెంటనే మా దృష్టికి తీసుకురావాలి.



- సాయంతి రాయ్,
హెడ్ కమ్యూనికేషన్స్, మిలాప్

నిధుల సేకరణ ఇలా..!

దాతల సాయం అవసరమైన ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లను (ఇంపాక్ట్ గురూ, మిలాప్, కెట్టో, గో ఫండ్ మి, కిక్‌స్టార్టర్... మొదలైనవి) సంప్రదించవచ్చు ● పాన్, ఆధార్, మెడికల్ డాక్యుమెంట్లు సమర్పించాలి. ఎంక్వైరీ అనంతరం వారి తరఫున నిధుల సమీకరణ పేజీని అవి సిద్ధం చేస్తాయి ●సాయం అవసరమైన వారు ఈ పేజీ లింక్‌ను తమ నెట్‌వర్క్‌లో షేర్ చేసుకోవాలి ● విరాళంలో కొంత మొత్తాన్ని కమీషన్ రూపంలో మినహాయించుకునేందుకు సమ్మతి తెలియజేస్తే, వారి తరఫున క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు విస్తృత ప్రచారాన్ని చేపడతాయి ● విరాళం ఇచ్చేందుకు పేమెంట్ లింక్‌లు కనిపిస్తాయి. ఇలా చేసే చెల్లింపులన్నీ పన్ను రాయితీ కల్పిస్తాయి ● కావాల్సిన మొత్తం వచ్చినా, గడువు ముగిసినా లేదంటే బాధితులు అకాలంగా మరణించినా నిధుల సమీకరణ ఆగిపోతుంది. అనంతరం ఈ మొత్తం నుంచి కమీషన్ మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని బాధితులకు క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌లు చెల్లిస్తాయి. ఇలా చేసే ముందు హాస్పిటల్ బిల్లులను చెక్ చేస్తాయి.

ఇన్‌స్పిరేషన్

చిన్నారి సేవాగుణం

ఎంతోమంది విదేశాలకు వెళ్లిన తర్వాత పుట్టి పెరిగిన ప్రాంతాన్ని మర్చిపోతుంటారు. కాని కరీంనగర్ నుంచి అమెరికా వెళ్లి అక్కడ నివాసం ఉంటున్న ఓ ప్రవాస భారతీయుడి కుమార్తె సొంత ఊరిపై మమకారంతో అనాథ విద్యార్థుల కోసం విరాళాలు సేకరించి అందించింది. ఈ రకంగా తన తల్లితండ్రులు పెరిగిన ఊరిపై ప్రేమను చాటుకుంది.



కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రవాస భారతీయులు లక్కాకుల వినయ్ అమెరికాలోని మిచిగాన్‌లో నివసిస్తుండగా వారి కూతురు లక్కాకుల హరిణి అమెరికాలోని నోవి హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. హరిణి పాఠశాల సామాజిక సేవాకార్యక్రమంలో భాగంగా రూ.1.65 లక్షల మేరకు విరాళాలు సేకరించింది. ఈ మొత్తాన్ని హరిణి కరీంనగర్ పట్టణంలోని వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలగోకులంలో 40 మంది అనాథ విద్యార్థులకు విద్యాబుద్ధులను గరపడంతోపాటు సకల సౌకర్యాలను కలుగజేస్తున్నారని తెలుసుకొని వారి అవసరాల కోసం విరాళంగా ఇచ్చారు. వయసులో చిన్న అయినా, పెద్ద మనసుతో విరాళాలు సేకరించి ఇచ్చిన హరిణికి బాలగోకులం విద్యార్థులు, వెంకట్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



నేటి నుంచి ఇంగ్లండ్, విండీస్ రెండో టెస్టు... వుడ్‌కు చోటు

వెస్టిండీస్ జట్టుతో నేడు నాటింగ్‌హామ్‌లో మొదలయ్యే రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు ఒక మార్పుతో బరిలోకి దిగనుంది. లార్డ్స్‌లో జరిగిన తొలి టెస్టు తర్వాత ఇంగ్లండ్ పేసర్ అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ నేపథ్యంలో అండర్సన్ స్థానంలో రెండో టెస్టు కోసం మరో పేస్ బౌలర్ మార్క్ వుడ్‌కు ఇంగ్లండ్ తుది జట్టులో చోటు లభించింది. 34 ఏళ్ల మార్క్ వుడ్ ఇప్పటి వరకు 34 టెస్టులు ఆడి 108 వికెట్లు పడగొట్టాడు. మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లండ్ తొలి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో గెలిచింది.



ఆరో స్థానంలో యశస్వి జైస్వాల్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ పురుషుల టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. తాజా ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ సూర్యకుమార్ యాదవ్ తన రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకోగా... ఓపెనర్ యశస్వి జైస్వాల్ నాలుగు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. జింబాబ్వేతో జరిగిన టి20 సిరీస్‌లో యశస్వి 141 పరుగులు సాధించడంతో అతని ర్యాంక్ మెరుగైంది. రుతురాజ్ గైక్వాడ్ ఒక స్థానం పడిపోయి ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచాడు. జింబాబ్వే సిరీస్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన గిల్ 36 స్థానాలు పురోగతి సాధించి 37వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

బుల్లెట్ దిగాలి...

- భారత షూటర్లపై భారీ అంచనాలు
- అత్యధికంగా ఈసారి 21 మంది బరిలోకి
- ప్రతి విభాగంలో మనోళ్ల ప్రాతినిధ్యం
- గత రెండు ఒలింపిక్స్ క్రీడల్లో నిరాశపరిచిన షూటర్లు

PARIS 2024
మరో 8 రోజుల్లో...

ఇంతింతై వటుడింతై అన్న నానుడి భారత షూటింగ్ క్రీడాంశానికి వర్తిస్తుంది. 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో తొలిసారి భారత్ తరఫున ఇద్దరు షూటర్లు బరిలోకి దిగారు. నాటి నుంచి ప్రతి ఒలింపిక్స్‌లో భారత షూటర్ల ప్రాతినిధ్యం కనిపిస్తోంది. 2016 రియో ఒలింపిక్స్‌లో తొలిసారి రెండంకెల్లో భారత షూటర్లు పోటీపడగా... 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ అది కొనసాగింది... ఇప్పుడు పారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత్ నుంచి మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 21 మంది షూటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మెడల్ ఈవెంట్స్‌గా ఉన్న 12 విభాగాల్లోనూ భారత షూటర్లు ఉండటంతో ఈసారి రిక్తహస్తాలతో కాకుండా ఒకట్రెండు పతకాలతో తిరిగి వస్తారని భారీ అంచనాలున్నాయి. మన షూటర్లు లక్ష్యంలో బుల్లెట్‌లు దించి పతకాలను కొల్లగొడుతారా లేక గురితప్పి నిరాశపరుస్తారో వేచి చూడాలి.

-సాక్షి క్రీడా విభాగం



ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్

రెండు దశాబ్దాల క్రితం ఏథెన్స్ ఒలింపిక్స్‌లో భారత సైనికాధికారి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ 'డబుల్ ట్రాప్' షూటింగ్ ఈవెంట్‌లో దేశానికి తొలిసారి రజతం రూపంలో పతకాన్ని అందించాడు. నాలుగేళ్ల తర్వాత 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ బింద్రా ఎవ్వరూ ఊహించని విధంగా భారత్ ఖాతాలో స్వర్ణ పతకాన్ని జమ చేశాడు. 2000 సిడ్నీ, 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో విఫలమైన అభినవ్ బింద్రా 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో అద్భుత ప్రదర్శనతో అందరి అంచనాలను తారుమారు చేశాడు. స్వతంత్ర భారత్‌కు వ్యక్తిగత క్రీడాంశంలో తొలి బంగారు పతకాన్ని అందించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో విజయ్ కుమార్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం... గగన్ నారంగ్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్యం సాధించడంతో భారత్‌కు వరుసగా మూడు ఒలింపిక్స్‌లో షూటింగ్ క్రీడాంశంలో పతకాలు దక్కాయి. 2016 రియో ఒలింపిక్స్‌లో భారత్ నుంచి తొలిసారి అత్యధికంగా 12 మంది షూటర్లు పోటీపడటంతో వరుసగా నాలుగోసారీ పతకాలు గ్యారంటీ అని అభిమానులు అనుకున్నారు. కానీ 12 మందిలో ఇద్దరు (అభినవ్ బింద్రా, జీతూ రాయ్) మాత్రమే ఫైనల్ చేరుకున్నారు. వరుసగా ఐదో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ **అభినవ్ బింద్రా నాలుగో** స్థానంలో నిలిచి **త్రుటిలో పతకాన్ని కోల్పోగా...** పిస్టల్ షూటర్ జీతూ **రాయ్ ఎనిమిదో స్థానంతో సరి**పెట్టుకున్నాడు. 2020 **టోక్యో ఒలింపిక్స్‌లో భారత్** నుంచి ఏకంగా 15 **మంది షూటర్లు పాల్గొనగా...** ఒత్తిడికి తట్టుకోలేక **స్టార్ షూటర్లు కూడా తడబడ్డా**రు. కేవలం సౌరభ్ **చౌదరీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్** ఈవెంట్ ఫైనల్లోకి ప్రవేశించి ఏడో స్థానంలో నిలిచాడు.



అంజుమ్



మనూ భాకర్

అనుభవం పతకం తెస్తుందా...

టోక్యో ఒలింపిక్స్ వైఫల్యాన్ని పక్కనబెడితే ఈసారి పారిస్ ఒలింపిక్స్‌కు ఏకంగా 21 మంది భారత షూటర్లు అర్హత సాధించారు. 21 మందిలో నలుగురు మాత్రమే టోక్యో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ వాళ్లున్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో ఆడిన మనూ భాకర్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల ఎయిర్ పిస్టల్), ఇలవేనిల్ వలారివన్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్), అంజుమ్ మౌద్గిల్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్) పారిస్ ఒలింపిక్స్‌లోనూ బరిలోకి దిగనున్నారు. మనూ భాకర్ మాత్రం ఈసారి రెండు ఈవెంట్స్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. ఈ నలుగురు కాకుండా మిగతా 17 మంది షూటర్లు తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నారు. ఒలింపిక్స్‌లాంటి అత్యున్నత వేదికపై మిల్లీమీటర్ల వ్యత్యాసంలో పతకాలు, ఫలితాలు తారుమారవుతాయి. షూటర్లకు చెక్కు చెదరని ఏకాగ్రత, మానసిక దృఢత్వం అత్యవసరం. గత ఒలింపిక్స్ వైఫల్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఒలింపిక్ బెర్త్‌లు సాధించిన షూటర్లకు నేరుగా పారిస్ ఒలింపిక్స్‌కు పంపించకూడదని నిర్ణయించింది. నాలుగు దశల్లో సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించి ట్రయల్స్‌లో నిలకడగా రాణించిన షూటర్లనే పారిస్‌కు పంపిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రయల్స్‌లోనూ రాణించి ఫామ్‌లో ఉన్న మనూ, అంజుమ్, ఇలవేనిల్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ అసలైన వేదికపై కూడా మెరిపించి పతకాలతో తిరిగి రావాలని ఆశిద్దాం.

అరంగేట్రంలోనే మెరిపిస్తారా!

తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్న 17 మంది షూటర్లు ఒత్తిడికి లోనుకాకుండా సంయమనంతో వ్యవహరిస్తేనే పతకాల రేసులో నిలుస్తారు. ముఖ్యంగా అందరి దృష్టి 23 ఏళ్ల పంజాబ్ షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రాపై ఉంది. 2022 ఆసియా క్రీడల్లో సిఫ్ట్ కౌర్ 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో ప్రపంచ రికార్డు సృష్టించడంతోపాటు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ షూటర్ ఇషా సింగ్ నుంచి భారీ అంచనాలే ఉన్నాయి. 19 ఏళ్ల ఇషా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, ఆసియా క్రీడల్లో పిస్టల్ టీమ్ ఈవెంట్స్‌లో స్వర్ణ పతకాలు సాధించింది. అదే జోరును ఆమె పారిస్‌లో కొనసాగించాలని ఆశిద్దాం. పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ పోటీలు జూలై 27 నుంచి ఆగస్టు 5 వరకు జరుగుతాయి.



ఇషా సింగ్

'పారిస్'లో భారత షూటర్లు

పురుషుల విభాగం: సందీప్ సింగ్, అర్జున్ బబూటా (10 మీటర్ల ఎయిర్ రైఫిల్), సరబ్‌జోత్ సింగ్, అర్జున్ సింగ్ చీమా (10 మీటర్ల ఎయిర్ పిస్టల్), స్వప్నిల్ కుసాలే, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), అనీశ్ భన్వాలా, విజయ్‌వీర్ సిద్ధూ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్), పృథ్వీరాజ్ (ట్రాప్), అనంత్‌జీత్ సింగ్ నరూకా (స్కీట్). మహిళల విభాగం: ఇలవేనిల్ వలారివన్, రమితా జిందాల్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్), రిథమ్ సాంగ్వాన్, మనూ భాకర్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్), ఇషా సింగ్, మనూ భాకర్ (25 మీటర్ల పిస్టల్), సిఫ్ట్ కౌర్ సమ్రా, అంజుమ్ మౌద్గిల్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), రాజేశ్వరి కుమారి, శ్రేయసి సింగ్ (ట్రాప్), రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (స్కీట్).



శౌర్యకు కాంస్యం

హ్యూస్టన్ (అమెరికా): ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు కాంస్య పతకం లభించింది. అండర్–19 బాలుర సింగిల్స్ విభాగంలో 18 ఏళ్ల శౌర్య బావా భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఢిల్లీకి చెందిన శౌర్య 5–11, 5–11, 9–11తో టాప్ సీడ్, గత ఏడాది రన్నరప్ మొహమ్మద్ జకారియా (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయాడు. 2014లో కుశ్ కుమార్ తర్వాత ఈ మెగా టోర్నీలో పతకం నెగ్గిన రెండో భారతీయ ప్లేయర్‌గా శౌర్య గుర్తింపు పొందాడు.

క్వార్టర్స్‌లో యూకీ ద్వయం



స్టాడ్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో మూడో సీడ్ యూకీ–ఒలివెట్టి ద్వయం 6–4, 6–4తో ఫెడెరికో జెబలాస్–బోరిస్ అరియాస్ (బొలీవియా) జంటను ఓడించింది. 59 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ జోడీ పది ఏస్‌లు సంధించడంతోపాటు తమ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

రిత్విక్ జోడీ ఓటమి



న్యూపోర్ట్ (అమెరికా): హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ రిత్విక్ చౌదరీ–నికీ కలియంద పునాచా (భారత్) ద్వయం 1–6, 4–6తో ల్యూక్ సవిల్లె–అలెగ్జాండర్ వుకిచ్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్ ద్వయం ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేయడంతోపాటు తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది.

సినిమా



వరలక్ష్మి, నికోలయ్ సచ్‌దేవ్

కొత్త ప్రయాణం ఆరంభమైంది

- వరలక్ష్మి

''హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్. తెలుగు ప్రేక్షకులు నా సినిమాలు చూసి నన్ను చాలా ప్రోత్సహించారు. మీ ప్రోత్సాహం ఎప్పుడూ ఇలాగే ఉండాలి'' అని నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌తో వరలక్ష్మి వివాహం ఈ నెల 12న థాయ్‌లాండ్‌లో జరిగింది. బుధవారం వరలక్ష్మి–నికోలయ్ హైదరాబాద్‌లో మీట్ అండ్ గ్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పాలనే ఉద్దేశంతో నా భర్తతో కలిసి హైదరాబాద్ వచ్చాను. నా కెరీర్ ముగిసిపోలేదు. నా సరికొత్త ప్రయాణం ఇప్పుడే మొదలైంది. నా భర్త ప్రోత్సాహంతో మరిన్ని సినిమాలు చేస్తాను'' అన్నారు. ''నా భార్య వరలక్ష్మి అద్భుతమైన నటి. తన వ్యక్తిత్వం కూడా ఉన్నతమైనది. సంస్కృతి, సంప్రదాయం, కుటుంబానికి గౌరవం ఇస్తుంది. ఆమెను పెళ్లి చేసుకోవడం నా లక్. మీరంతా తనని ఇలానే సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు నికోలయ్.

పండగ వచ్చిందే చాన్నాళ్లకి...



విక్రమ్, పార్వతీ తిరువోతు

గూడెంలోని ప్రజలందరూ ఆ రోజు శుభవార్త విన్నారు. ఆ ఆనందంలో 'మనకి మనకి మనలో మనకి పండగ వచ్చిందే చాన్నాళ్లకి... అలికీ అలికీ ఊరే అలికీ ముగ్గులు ఏసేద్దాం ముంగిళ్లకీ...' అంటూ పాడుకున్నారు. విక్రమ్ హీరోగా నటించిన 'తంగలాన్' చిత్రంలోని పాట ఇది. పా. రంజిత్ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది. బుధవారం ఈ చిత్రంలోని 'మనకి మనకి...' లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా సింధూరీ విశాల్ పాడారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది.

మా డార్లింగ్ కూడా గుర్తుండిపోతుంది

- ప్రియదర్శి



''తెలుగులో ఈ ఏడాది ఇప్పటి వరకూ ఓ వంద సినిమాలు వచ్చాయనుకుంటే అందులో ప్రేక్షకులు బాగా నవ్వుకుని, గుర్తుపెట్టుకున్న సినిమాలు ఓ నాలుగైదు ఉన్నాయి. మా 'డార్లింగ్' కూడా అలా గుర్తుపెట్టుకొని నవ్వుకునే సినిమా అవుతుంది. ఈ చిత్రం ఆడియన్స్‌కి మంచి థియేటర్ అనుభూతిని ఇస్తుంది'' అని హీరో ప్రియదర్శి అన్నారు. అశ్విన్ రామ్ దర్శకత్వంలో ప్రియదర్శి, నభా నటేశ్ జోడీగా నటించిన చిత్రం 'డార్లింగ్'. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రియదర్శి మాట్లాడుతూ– ''నేను నటించిన 'మల్లేశం, బలగం' చిత్రాలతో పాటు 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌కి వచ్చిన రెస్పాన్స్ ఫ్యామిలీ డ్రామాకి ఎప్పుడూ స్పేస్ ఉందని నిరూపించింది. ఆడియన్స్ రిలేట్ చేసుకునే కథలు చెప్పడంలో మజా వేరుగా ఉంటుంది. 'డార్లింగ్'లో నభా నటేశ్ పాత్రకి స్ప్లిట్ పర్సనాలిటీ అనే స్పెషల్ కండిషన్ ఉంటుంది. దీన్ని అశ్విన్ రామ్ తెరపై చూపించిన తీరు వైవిధ్యంగా ఉంటుంది. 'హాయ్ నాన్న' సినిమా షూటింగ్‌లో జగదీశ్ రాసిన కథని నానీ అన్నకి చెప్పాను. కథ విన్న వెంటనే ఆయన సినిమా చేద్దాం అన్నారు. నేను నటించిన '35 చిన్న కథ కాదు' ఆగస్టు 15న వస్తోంది. గీతా ఆర్ట్స్‌లో నటించిన మూవీ షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం ఇంద్రగంటి మోహనకృష్ణగారితో ఓ సినిమా చేస్తున్నాను. అలాగే వైజయంతీ మూవీస్‌లో ఓ సినిమా, నాని అన్న వాల్‌పోస్టర్ బ్యానర్‌లో ఒక చిత్రంతో పాటు 'సేవ్ ది టైగర్స్' సీజన్ 3 చేయాల్సి ఉంది'' అన్నారు.

అందుకే మాస్క్ వేసుకుని తిరుగుతున్నా!

- డైరెక్టర్ విస్కీ



భరత్, విస్కీ

''నేను చిత్ర పరిశ్రమలోకి వెళ్లడం నా కుటుంబ సభ్యులకు ఇష్టం లేదు. నేను అమెరికాలో ఉద్యోగం వదిలి ఇండియా వచ్చిన సంగతి కూడా వారికి తెలియదు. అందుకే నా పేరు మార్చుకుని, నా ముఖం కనిపించకుండా మాస్క్ వేసుకుని తిరుగుతున్నా. కోవిడ్‌లో నాకెంతో ఇష్టమైన కుక్క పిల్ల చనిపోయింది. దాని జ్ఞాపకార్థం నా పేరును విస్కీగా మార్చుకున్నాను'' అన్నారు డైరెక్టర్ విస్కీ. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల నటించిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. ఐ. భరత్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విస్కీ మాట్లాడుతూ– ''నా జీవితంలో జరిగిన వాస్తవ ఘటన స్ఫూర్తితో ఈ మూవీ కథ రాశా. బర్త్‌డే బంప్స్ వల్ల ఒక ఫ్రెండ్ ఎలా చనిపోయాడు? అనేది ఉత్కంఠభరితంగా ఉంటుంది'' అన్నారు. ఐ. భరత్ మాట్లాడుతూ–''నాకూ దర్శకత్వం చేయాలనే ఆసక్తి ఉండేది. అయితే విస్కీ చెప్పిన కథ నచ్చడంతో ప్రొడ్యూస్ చేయాలనిపించింది. బర్త్ డే పేరు మీద జరుగుతున్న కొన్ని వింత పోకడల్ని ఈ మూవీలో చూపించాం'' అన్నారు.




దీపికా పదుకోన్

డైట్ అంటే కడుపు మాడ్చుకోవడం కాదు

''డైట్' అనే పదం చుట్టూ చాలా అపోహలు ఉన్నాయని నాకనిపిస్తోంది. డైట్ అంటే కడుపు మాడ్చుకోవడం, తక్కువ తినడం, కష్టంగా నచ్చనవి తినడం అని మనందరం అనుకుంటాం. కానీ డైట్ అంటే మనం తీసుకునే ఆహారం, తీసుకునే పానీయాలు. నిజానికి డైట్ అనే పదం గ్రీకు పదం 'డైటా' నుంచి వచ్చింది. డైటా అంటే జీవన విధానం అని అర్థం'' అన్నారు దీపికా పదుకోన్. ప్రస్తుతం ఆమె గర్భవతి అని తెలిసిందే. ఈ నేపథ్యంలో దీపికా ఫలానా డైట్‌ని ఫాలో అవుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. అయితే ప్రచారంలో ఉన్నవి నమ్మవద్దంటూ దీపికా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ విధంగా పేర్కొన్నారు.

''నేను బాగా తింటాను. కాబట్టి సరిగ్గా తిననని వస్తున్న వార్తలను నమ్మొద్దు. డైట్ అంటే క్రమం తప్పకుండా తినడం, మన శరీరాన్ని అర్థం చేసుకోవడం.. ఫాడ్ డైట్ (త్వరగా బరువు తగ్గే ఆహార ప్రణాళిక)ని ఫాలో కాను. శుభ్రంగా తినడానికే ఇష్టపడతాను. నా డైట్‌లో ఇవి ఉన్నాయని ఆశ్చర్యపోతున్నారా?'' అంటూ కేక్స్, సమోసా వంటి వాటి ఫొటోలను కూడా షేర్ చేశారు దీపికా పదుకోన్. ఇక సెప్టెంబరులో బిడ్డకు జన్మనివ్వనున్నట్లు ఆ మధ్య దీపికా, ఆమె భర్త–హీరో రణ్‌వీర్ సింగ్ ప్రకటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

వారం తర్వాత బడ్డీ...



అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బడ్డీ'. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, అధనా జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ మూవీని ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు తొలుత చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే మరో వారం ఆలస్యంగా ఆగస్టు 2న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ''అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'బడ్డీ' తెరకెక్కింది. ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై కొత్త ప్రయోగంగా ఈ సినిమా ఉండబోతోంది. హిప్ హాప్ తమిళ అందించిన పాటలు ఇప్పటికే హిట్‌గా నిలిచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

ఇది నాకు క్లిష్ట సమయం!



నవీన్ పొలిశెట్టి

'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, జాతి రత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు హీరో నవీన్ పొలిశెట్టి. అమెరికాలో జరిగిన ఓ ప్రమాదంలో ఆయన గాయపడ్డట్లు గతంలో వార్తలొచ్చాయి. ఈ విషయంపై తొలిసారి ఓ నోట్‌ని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు నవీన్ పొలిశెట్టి. ఆ లేఖ సారాంశం ఏంటంటే.. ''ఈ రోజు మీతో (అభిమానులు, ప్రేక్షకులు) నేనొక వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. దురదృష్టవశాత్తూ ఓ ప్రమాదంలో నా కుడి చేయి, కుడి కాలు ఫ్రాక్చర్ అయ్యాయి. ఇది నాకు క్లిష్ట సమయం. గాయాల కారణంగా త్వరితగతిన నా సినిమాలను మీ ముందుకు తీసుకురాలేకపోతున్నా. నేను పూర్తిగా కోలుకుని, నా బెస్ట్ ఎనర్జిటిక్ వెర్షన్‌ని చూపించడానికి వైద్యుల సూచనలు పాటిస్తున్నాను. కోలుకోవడానికి మరికొన్ని నెలలు పట్టేటట్లు ఉంది. కోలుకున్న వెంటనే షూటింగ్ మొదలుపెడతాను'' అన్నారు.

భవనమ్‌లో థ్రిల్



'షకలక' శంకర్, ధనరాజ్, సప్తగిరి

సప్తగిరి, ధనరాజ్, 'షకలక' శంకర్, అజయ్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'భవనమ్'. బాలాచారి కూరెళ్ల దర్శకత్వంలో సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో ఆర్బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 9న విడుదల చేయనున్నట్లు బుధవారం యూనిట్ ప్రకటించింది. ''సస్పెన్స్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో రూపొందించిన ఈ చిత్రంలో మంచి వినోదం ఉంది. కీలక తారాగణం పండించే కామెడీ బాగుంటుంది. అన్ని వర్గాలవారూ ఎంజాయ్ చేసేలా ఆసక్తికరమైన కంటెంట్‌తో తెరకెక్కించిన 'భవనమ్' మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది.

అందుకే టిక్కెట్ ధర తగ్గించాం

- ధీరజ్ మొగిలినేని



రాకేశ్ వర్రే, ధీరజ్ మొగిలినేని

''పెద్ద సినిమాలకు టిక్కెట్ ధర ఎంత పెట్టినా ప్రేక్షకులు వస్తారు. కానీ, చిన్న సినిమాలకి తక్కువ రేట్లు ఉంటే కానీ రారు. అందుకే 'పేక మేడలు' టిక్కెట్ ధరని వంద రూపాయలు చేశాం'' అన్నారు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని. వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నీలగిరి మామిళ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'పేక మేడలు'. రాకేశ్ వర్రే నిర్మించిన ఈ మూవీ రేపు విడుదలవుతోంది. ఈ సినిమాని రిలీజ్ చేస్తున్న ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ– ''పేక మేడలు'లాంటి మంచి సినిమాని ప్రేక్షకులకు చేరువ చేయాలని విజయవాడ, వైజాగ్, హైదరాబాద్‌లలో యాభై రూపాయలకే ప్రీమియర్స్ వేశాం. చూసినవారు సినిమా బాగుందన్నారు'' అన్నారు. ''ప్రీమియర్స్‌కి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే ఇది ప్రీ సక్సెస్ మీట్‌లాగా ఫీల్ అవుతున్నాను'' అన్నారు నీలగిరి. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్న ధీరజ్, రానా, అడివి శేష్, విశ్వక్ సేన్ గార్లకి కృతజ్ఞతలు'' అన్నారు రాకేశ్ వర్రే.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 52	80,717
నిఫ్టీ ▲ 26	24,613

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	18,008	▽ 500
డోజోన్స్	41,139	▲ 184
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,187	▲ 23
డాక్స్	18,437	▽ 81
షాంఘై	2,963	▽ 13
నికాయ్	41,098	▽ 177

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై (మంగళవారం)

బంగారం (99.9 స్వచ్ఛత)	72,932	▲ 407
బంగారం (99.5 స్వచ్ఛత)	72,640	▲ 405
వెండి (కిలో)	91,835	▲ 107

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.14	84.16
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.22	109.81
€	యూరో	ఎస్‌బీఐ	89.94	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.38	53.53
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.72	57.67
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.66
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.46

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం ఫ్లాట్

క్యూ1లో రూ. 1,135 కోట్లు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ ఎల్‌టీఐమైండ్‌ట్రీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 1.5 శాతం క్షీణించి రూ. 1,135 కోట్లకు పరిమితమైంది. లాభాల మార్జిన్లు నీరసించడం ప్రధానంగా ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం 5 శాతానికిపైగా పుంజుకుని రూ. 9,143 కోట్లకు చేరింది. నిర్వహణ లాభ మార్జిన్లు 16.7 శాతం నుంచి 15 శాతానికి క్షీణించాయి. ఈ కాలంలో కొత్తగా 1.4 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. విలీన సమయంలో ప్రకటించిన 17–18 శాతం మార్జిన్లను సాధించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో దేవశిష్ చటర్జీ పేర్కొన్నారు. అయితే ఇందుకు మరింతకాలం పడుతుందని తెలియజేశారు. నిజానికి త్రైమాసిక వారీ(క్యూ4)గా చూస్తే మార్జిన్లు 0.3 శాతం బలపడ్డాయి. అయితే ఎప్పటిలోగా మార్జిన్ల లక్ష్యాన్ని చేరుకునేదీ అంచనా వేయజాలమని చటర్జీ స్పష్టం చేశారు. ఈ క్యూ1లో 1,400 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. జూన్ చివరికల్లా మొత్తం ఉద్యోగుల సంఖ్య 81,934కు చేరింది. గతేడాది జూన్‌లో ఈ సంఖ్య 82,738కాగా.. ఈ ఏడాది మార్చిలో 81,650గా నమోదైంది.

ఏషియన్ పెయింట్స్ లాభం డౌన్

రూ. 1,187 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 1,187 కోట్లకు పరిమితమైంది. వేసవి ఎండలు, సార్వత్రిక ఎన్నికల కారణంగా పెయింట్లకు డిమాండ్ మందగించడం ప్రభావం చూపినట్లు కంపెనీ ఎండీ, సీఈవో అమిత్ సింగ్లే పేర్కొన్నారు. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,575 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,182 కోట్ల నుంచి రూ. 8,970 కోట్లకు స్వల్పంగా నీరసించింది. మొత్తం వ్యయాలు మాత్రం రూ. 7,305 కోట్ల నుంచి రూ. 7,559 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో డెకొరేటివ్ విభాగం అమ్మకాల పరిమాణం 7% పుంజుకున్నప్పటికీ ప్రొడక్ట్ మిక్స్‌లో మార్పులు, ధరల తగ్గింపు వంటి అంశాలు లాభదాయకతను దెబ్బతీసినట్లు అమిత్ పేర్కొన్నారు. ముడిసరుకుల ధరలు, సప్లైచైన్ సవాళ్లు సైతం ఇందుకు జత కలసినట్లు వెల్లడించారు. అయితే ఇండస్ట్రియల్ బిజినెస్ 6% పుంజుకున్నట్లు తెలిపారు.

రేసు గుర్రాలు.. చిన్న షేర్లు

కొద్ది నెలలుగా సరికొత్త గరిష్టాల రికార్డులను నెలకొల్పుతూ సాగుతున్న దేశీ స్టాక్ మార్కెట్లలో ఇటీవల మధ్య, చిన్న తరహా కౌంటర్లు సైతం జోరు చూపుతున్నాయి. వెరసి సెన్సెక్స్‌ను మించి బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు లాభాల దౌడు తీస్తున్నాయి. వివరాలు చూద్దాం..

- ఈ ఏడాది మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సుల దూకుడు
- బీఎస్‌ఈ సెన్సెక్స్‌ను మించుతూ 30 శాతం హైజంప్
- సెన్సెక్స్‌తోపాటు రికార్డ్ గరిష్టాలకు మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు



ఈ క్యాలెండర్ ఏడాదిలో ఇప్పటివరకూ మధ్య, చిన్నతరహా కౌంటర్లకు భారీ డిమాండ్ కనిపిస్తోంది. చిన్న షేర్లు మార్కెట్ ఫేవరెట్లుగా నిలుస్తున్నాయి. దీంతో పలు చిన్న షేర్లు పెద్ద(భారీ) లాభాలను అందిస్తున్నాయి. ఇందుకు దేశీ ఆర్థిక వ్యవస్థ మూలాలు పటిష్టంగా ఉండటం, మెరుగుపడిన లిక్విడిటీ తదితర అంశాలు తోడ్పాటునిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వెరసి ఈ ఏడాది జూలై 16(మంగళవారం)వరకూ చూస్తే బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 10,985 పాయింట్లు(30 శాతం) దూసుకెళ్లింది. ఈ బాటలో స్మాల్‌క్యాప్ సైతం 11,628 పాయింట్లు(27 శాతంపైగా) జంప్‌చేసింది. ఇదే కాలంలో బీఎస్‌ఈ ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ కేవలం 8,476 పాయింట్లు(12 శాతం) ర్యాలీ చేసింది.

బుల్ మార్కెట్

దేశీయంగా లిక్విడిటీ పరిస్థితులు బలపడటం మిడ్, స్మాల్ క్యాప్ షేర్ల వృద్ధికి కారణమవుతున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతి పేర్కొన్నారు. మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసులు(పీఎంఎస్), ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా నిధులు చిన్న షేర్లలోకి ప్రవహిస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం దేశీయంగా దీర్ఘకాలిక(స్ట్రక్చరల్) బుల్ ట్రెండ్‌లో మార్కెట్ కొనసాగుతున్నట్లు అభిప్రాయపడ్డారు. దీంతో మిడ్, స్మాల్ క్యాప్స్ మార్కెట్లను మించి పరుగు తీస్తున్నట్లు తెలియజేశారు. అయితే లార్జ్‌క్యాప్ స్టాక్స్ సైతం ర్యాలీ చేస్తున్నప్పటికీ చిన్న షేర్లతో పోలిస్తే వెనకబడుతున్నట్లు వివరించారు. ఎఫ్ఐఐల అమ్మకాలు ఇందుకు కారణమన్నారు. ప్రస్తుతం యూఎస్ అధ్యక్షతన ప్రపంచవ్యాప్తంగా బుల్ మార్కెట్ల హవా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. షేర్ల విలువలరీత్యా చూస్తే లార్జ్ క్యాప్స్ మరింత బలపడేందుకు వీలున్నట్లు అంచనా వేశారు. గతేడాది చివర్లో అమ్మకాలకు ప్రాధాన్యత ఇచ్చిన ఎఫ్ఐఐలు ప్రస్తుతం పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు.


సరికొత్త రికార్డులు

బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఈ మంగళవారం (16న) 48,175 పాయింట్లను అధిగమించి చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది. అంతకుముందే అంటే ఈ నెల 8న స్మాల్‌క్యాప్ 54,618 పాయింట్లకు చేరడం ద్వారా సరికొత్త గరిష్టాన్ని లిఖించింది. ఇక మరోవైపు సెన్సెక్స్ ఈ నెల 16నే 80,898ను తాకి చరిత్రాత్మక రికార్డుకు తెరతీసింది. ఇందుకు టెక్నాలజీ, హెల్త్‌కేర్, కన్జూమర్ గూడ్స్ రంగాలు ప్రధానంగా దోహదపడినట్లు మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అర్విందర్ సింగ్ నందా పేర్కొన్నారు. అందుబాటులో షేర్ల విలువలు, అధిక వృద్ధికి వీలు, ఆర్థిక పురోగతి వంటి అంశాలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు తెలియజేశారు. కాగా.. మిడ్, స్మాల్ క్యాప్స్‌లో దిద్దుబాటుకు వీలున్నట్లు సునీల్ అభిప్రాయపడ్డారు. అయితే ప్రస్తుతం పటిష్ట లిక్విడిటీ పరిస్థితుల కారణంగా కరెక్షన్ సమయాన్ని అంచనా వేయలేమని తెలియజేశారు. విధానాల్లో మార్పులు, ఫలితాల్లో నిరాశ తదితర అంశాలు ఇందుకు దారిచూపవచ్చని అభిప్రాయపడ్డారు.



వచ్చే వారం వెలువడనున్న సార్వత్రిక బడ్జెట్ సానుకూలంగా ఉండవచ్చని, దీంతో మార్కెట్ల ర్యాలీ కొనసాగేందుకు వీలున్నదని పలువురు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే దేశీ స్టాక్స్‌లో మరిన్ని పెట్టుబడులకు వీలుంటుందని అభిప్రాయపడ్డారు. సాధారణంగా చిన్న షేర్లను దేశీ ఫండ్స్, రిటైలర్లు కొనుగోలు చేస్తే, లార్జ్ క్యాప్స్‌లో పెట్టుబడులకు విదేశీ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపే సంగతి తెలిసిందే. దేశ ఆర్థిక పరిస్థితులు, కార్పొరేట్ ఫలితాలు, ఇన్వెస్టర్ల సెంటిమెంటు, గ్లోబల్ మార్కెట్లు వంటి పలు అంశాలు మార్కెట్ల ట్రెండ్‌ను నిర్దేశిస్తుంటాయని మార్కెట్ నిపుణులు వివరించారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



పర్యాటకానికి పరిశ్రమ హోదా..

జీఎస్‌టీ రేటు క్రమబద్ధీకరించాలి ● ట్రావెల్ ఏజెంట్ల సమాఖ్య టీఏఏఐ డిమాండ్

పర్యాటకానికి ఊతమిచ్చే దిశగా బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని, టూరిజానికి పరిశ్రమ హోదా కల్పించాలని ట్రావెల్ ఏజెంట్ల సమాఖ్య టీఏఏఐ కేంద్రాన్ని కోరింది. అలాగే వీసా నిబంధనలను సరళతరం చేయడం, వీసా–ఫ్రీ ఎంట్రీని ప్రోత్సహించడం, జీఎస్‌టీ రేట్లను క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేసింది. దేశ జీడీపీలో సుమారు 5.8 శాతం వాటాతో, 2047 నాటికి 1 లక్ష కోట్ల డాలర్ల లక్ష్యం పెట్టుకున్న ట్రావెల్, టూరిజం రంగానికి బడ్జెట్‌పై సానుకూల అంచనాలు ఉన్నట్లు వివరించింది. వీటిని అమలు చేస్తే ఇటు వ్యాపారాలు, అటు ప్రయాణికులకు కూడా ప్రయోజనం చేకూరగలదని టీఏఏఐ పేర్కొంది. కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటు, రైల్వేలు.. రహదారులు .. జలమార్గాల విస్తరణ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లోనూ ప్రధానంగా దృష్టి పెట్టడాన్ని కొనసాగించగలదని ఆశిస్తున్నట్లు టీఏఏఐ వివరించింది. జీఎస్‌టీపై సానుకూలంగా వ్యవహరిస్తే టూరిస్టులకు బస ఏర్పాట్లు అందుబాటు స్థాయిలోకి రాగలవని, ఈ రంగంలో పెట్టుబడులకు ప్రోత్సాహం లభించగలదని పేర్కొంది.



మరోవైపు, హోటళ్లపై ప్రస్తుతం వివిధ రకాలుగా ఉన్న జీఎస్‌టీ రేటును 12 శాతానికి క్రమబద్ధీకరించాలని ఆన్‌లైన్ ట్రావెల్ సేవల సంస్థ మేక్‌మైట్రిప్ సహ వ్యవస్థాపకుడు రాజేష్ మగోవ్ తెలిపారు. ప్రస్తుతం గది అద్దె, సీజన్ తదితర అంశాలను బట్టి ఇది 12 శాతం, 18 శాతంగా ఉంటోందన్నారు. పర్యావరణ అనుకూల విధానాలు పాటించే హోటళ్లు, హోమ్‌స్టేలకు పన్నులపరమైన ప్రోత్సాహకాలు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని ఆయన చెప్పారు. 'విద్యుత్ ఆదా చేసే లైటింగ్, నీటిని ఆదా చేసే డివైజ్‌లు, వ్యర్థాలను తగ్గించే విధానాలను పాటించే వారికి పన్నులపరమైన మినహాయింపులు ఇస్తే పర్యావరణహిత లక్ష్యాల సాధనలో పరిశ్రమ కూడా భాగం కావడానికి తోడ్పడగలదు' అని రాజేష్ వివరించారు. పర్యాటకం, ఆతిథ్య రంగానికి మౌలిక పరిశ్రమ హోదా కల్పిస్తే మరిన్ని పెట్టుబడులు రావడానికి ఆస్కారం ఉంటుందని హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ (వెస్టర్న్ ఇండియా) ప్రెసిడెంట్ ప్రదీప్ శెట్టి పేర్కొన్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

సనోఫీ హెల్త్‌కేర్ భారీ పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న ఫ్రెంచ్ సంస్థ సనోఫీ భారత్‌లో సుమారు రూ.3,655 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లోని గ్లోబల్ కెపాసిటీ సెంటర్ (జీసీసీ) కోసం 2030 నాటికి ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్లు సనోఫీ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మ్యాడలిన్ రోచ్ వెల్లడించారు. ఇందులో రూ.914 కోట్లు వచ్చే ఏడాదికల్లా వ్యయం చేస్తామని చెప్పారు. తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి సనోఫీ జీసీసీ నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించిన సందర్భంగా రోచ్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ కేంద్రంలో ప్రస్తుతం 1,000 మంది సిబ్బంది ఉన్నారని చెప్పారు. కొత్త ఫెసిలిటీకి 2,600 మంది ఉద్యోగులు కూర్చునే సామర్థ్యం ఉందన్నారు.



జీసీసీ నూతన భవనం ప్రారంభోత్సవంలో శ్రీధర్‌బాబుతో సనోఫీ ప్రతినిధులు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-7-2024	
విశాఖ	575–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

బాబాజీ క్షేత్రంలో నితిన్ గడ్కరీ



బాబాజీ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

మదనపల్లె/రేణిగుంట/తిరుమల: అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని నక్కలదిన్నెలో ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ క్షేత్రంలో బుధవారం నిర్వహించిన బాబాజీ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హాజరయ్యారు. సత్సంగ్ ఫౌండేషన్ ఆవరణలో ఆధ్యాత్మిక గురువు శ్రీ ఎం (ముంతాజ్ అలీ) ఆధ్వర్యంలో దీనిని నిర్మించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుపతి విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు చిప్పిలి హెలిప్యాడ్‌కు చేరుకున్న నితిన్ గడ్కరీకి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం సత్సంగ్ ఫౌండేషన్‌కు చేరుకున్న కేంద్రమంత్రికి సత్సంగ్ ఫౌండేషన్ ఆశ్రమంలో కేరళ సంప్రదాయ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. మూడు గంటలకు పైగా ఆశ్రమంలో గడిపిన గడ్కరీ మహావతార్ బాబాజీ ఆలయ ప్రాణప్రతిష్టలో పాల్గొన్నారు. శ్రీ గురు బాబాజీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, చల్లపల్లె నరసింహారెడ్డి, బండిఆనంద్ పాల్గొన్నారు.

రేణిగుంటలో ఘన స్వాగతం

అంతకుముందు నితిన్ గడ్కరీకి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఆర్ అండ్ బీ, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, పలువురు ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేంద్రమంత్రి విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో ఏపీ జాతీయ రహదారులు, హైవే ప్రాజెక్టులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. బుధవారం రాత్రి తిరుమల చేరుకున్న నితిన్ గడ్కరీ గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు.

అమిత్ షాతో భేటీతో సరి..!

- ప్రధాని, ఇతర కేంద్ర మంత్రులను కలుస్తారంటూ ఎల్లో మీడియా ప్రచారం
- వారిని కలవకుండానే విజయవాడకు సీఎం చంద్రబాబు
- 10 రోజుల్లోనే రెండుసార్లు ఢిల్లీకి
- గత పర్యటనంతా ఆర్భాటంగా.. ఈ పర్యటన అందుకు భిన్నం
- ఈసారి పర్యటనపై సందేహాలు
- గంటపాటు ఎంపీలతో బాబు ఏకాంత చర్చలు



అమిత్‌షాతో సీఎం చంద్రబాబు(ఫైల్)

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన కేవలం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలవడంతోనే ముగిసింది. 10 రోజుల్లో రెండోసారి ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు రెండు రోజుల పర్యటనలో ఒకే ఒక్క మంత్రిని కలవడం పలు సందేహాలకు తావిస్తోంది. ఆయన గత పర్యటలో ప్రధాని మోదీని, 10 మంది కేంద్ర మంత్రులను కలిసి ఎంతో హడావుడి చేశారు. మంగళవారం రాత్రి మరోసారి ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు నేరుగా అశోకా రోడ్డులోని నివాసానికి వెళ్లారు. రాత్రి అమిత్‌షాను కలిశారు. బుధవారం ప్రధాన మంత్రి మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాను కలుస్తారంటూ ఎల్లో మీడియాలో హడావుడి చేశారు. అయితే, ఇక్కడ అటువంటిదేమీ జరగలేదు.

మొన్న హడావుడి.. నేడు చప్పుడు లేకుండా..

ఈ నెలలోనే చంద్రబాబు జరిపిన రెండు పర్యటనల్లో భారీ తేడా కనిపించింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఈ నెల 3న ఆయన తొలిసారి ఢిల్లీకి వచ్చారు. ఆ పర్యటన ఆద్యంతం హడావుడి, ఆర్భాటంగా జరిగింది. ఈసారి చడీ చప్పుడు లేకుండా సాగడం అందరిలోనూ పలు సందేహాలకు తావిచ్చింది. 3న ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి ఢిల్లీ వచ్చిన ఆయన ఆ రాత్రి అశోకా రోడ్డులోని అధికారిక నివాసంలో బస చేశారు. 4వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్, నితిన్ గడ్కరీ, హర్దీప్‌సింగ్ పూరి, మనోహర్‌లాల్ ఖట్టర్‌లను కలిశారు. ఆ తర్వాతి రోజు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్ సింగ్, నీతి ఆయోగ్ సీఈవోను కలిశారు. అదే రోజు సాయంత్రం ఎంచుకున్న మీడియాతో గంట పాటు మాట్లాడారు. తన గొప్పతనాన్ని మళ్లీ చెప్పుకున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ వస్తుంటానని చెప్పారు. వచ్చిన ప్రతిసారీ కేంద్ర మంత్రులను కలిసి సమస్యలను పరిష్కరించుకుంటానంటూ మీడియాతో చెప్పారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు. మళ్లీ పది రోజులకే మంగళవారం మరోసారి ఢిల్లీకి వచ్చారు. ఎల్లో మీడియాలో ప్రచారం జరిగినంత ఘనంగా ఆయన పర్యటన జరగలేదు. మంగళవారం రాత్రే హోం మంత్రి అమిత్ షాను కలిశారు. బుధవారం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులెవర్నీ కలవకుండానే విజయవాడ వెళ్లిపోయారు. ప్రత్యేక ప్యాకేజీ గురించి చర్చిస్తారని ముందుగా చెప్పినప్పటికీ, దాని కోసమే అయితే పది రోజుల్లో రెండోసారి ఢిల్లీ రావాల్సిన అవసరం ఏముందనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇటీవలి కేబినెట్ మీటింగ్ అనంతరం మంత్రుల వద్ద ఢిల్లీ టూర్‌పై చర్చ వచ్చిన సందర్భంగా వాళ్లతో కొన్ని విషయాలు మాట్లాడేది ఉందంటూ చంద్రబాబు బదులిచ్చారు. అయినా ఇక్కడ అమిత్‌షాను తప్ప ఎవరినీ కలవలేదు. మీడియాతోనూ మాట్లాడలేదు.

అధికారిక నివాసంలో పూజలు.. ఎంపీలతో చర్చ

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారిక నివాసంగా కేటాయించిన జన్‌పథ్–1 ఆయన బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ శాఖల్లో ఉన్న పెండింగ్ అంశాలపై ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం చంద్రబాబు కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, ఎంపీలు సీఎం రమేష్, లావు శ్రీకృష్ణదేవరాయలు, కేశినేని శివనాథ్(చిన్ని), డి.ప్రసాదరావుతో చంద్రబాబు ఏకాంతంగా చర్చలు జరిపారు. దాదాపు గంటపాటు ఎవరినీ లోపలికి అనుమతించకుండా ఎంపీలతో మాత్రమే పలు విషయాలు మాట్లాడారు. ఈ చర్చల కారణంగా ఎయిర్‌పోర్టుకు గంట ఆలస్యంగా వెళ్లినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

గురుకులాల్లో ఫీ'జులుం'

- మహిళా డిగ్రీ గురుకులాల్లో భారీగా ఫీజులు పెంచిన ప్రభుత్వం
- డిగ్రీ కోర్సులకు రూ.4,225 నుంచి రూ.14 వేలకుపైగా వసూలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల్లో ఇకపై చదువు'కొనా'ల్సిందే. గత విద్యా సంవత్సరం వరకు ఉచిత విద్యను అందించిన ఈ కళాశాలల్లో ప్రతి కోర్సుకు ప్రభుత్వం నిర్దిష్ట ఫీజులు ఖరారు చేసింది. సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థినుల నుంచి కోర్సును బట్టి రూ.4 వేల నుంచి రూ.14 వేల వరకు ఫీజులు వసూలు చేయాలని కళాశాల విద్యాశాఖ కమిషనరేట్ ఆదేశాలు జారీ చేసింది. గత నెలలోనే జారీ చేసిన ఈ ఉత్తర్వులు ఇప్పుడు బయటకు రావడంతో విద్యార్థి సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు కళాశాలలకు, హాస్టళ్లకు ఎలాంటి ఫీజులు లేకుండా విద్యార్థినులు చదువుకున్నారు. అలాంటిది ఇప్పుడు భారీగా ఫీజులు చెల్లించమనడంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు.

ఉన్నట్టుండి ఫీజుల పిడుగు..

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కేటగిరీ కింద ఏడేళ్ల క్రితం రెండు మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలను అందుబాటులోకి తెచ్చారు. వీటిలో ఒకటి కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని కంచికచర్లలోనూ, మరొకటి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో కలికిరిలోనూ ఏర్పాటు చేశారు. ఎస్సీ మహిళలకు డిగ్రీ స్థాయిలో ఉన్నత విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కళాశాలల్లో విద్యతో పాటు హాస్టల్ సదుపాయాన్ని ప్రభుత్వమే సమకూరుస్తోంది.

విద్యార్థినుల నెత్తిన ఫీజుల బండ: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలకు గతంలో ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా నిధులను విడుదల చేసేవారు. రెండు కళాశాలల్లో సుమారు 600 మంది చదువుకుంటున్నారు. కంచికచర్ల కళాశాలలో బీకామ్ (జనరల్) కోర్సుకు రూ.4,225, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)కు రూ.14,172 ఫీజు నిర్ణయించగా, కలికిరిలో బీకామ్ (జనరల్)కు రూ.5,400, బీకామ్ (సీఏ)కి రూ.10,845, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)కు రూ.11,045గా ఖరారు చేశారు.

ఫీజుల వసూలు నిలిపివేయాలి: ఎస్ఎఫ్ఐ

గురుకుల డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులు ఫీజులు చెల్లించాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్న కుమార్, ఎ.అశోక్ ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీశైలం దిశగా కృష్ణమ్మ పరుగులు

- నారాయణపూర్ డ్యామ్ గేట్లు ఎత్తివేత.. 9 గేట్లు తెరిచి 37,260 క్యూసెక్కులు దిగువకు విడుదల

సాక్షి, అమరావతి/విజయపురి సౌత్: కృష్ణా వరద ఉధృతికి కర్ణాటకలోని నారాయణపూర్ డ్యామ్‌లో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో ఆ రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు బుధవారం 9 డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు 37,260 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దాంతో కృష్ణమ్మ శ్రీశైలం వైపు పరుగులు తీస్తోంది. తెలంగాణలోని జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వ ఇప్పటికే 7.66 టీఎంసీలు ఉండటంతో ఒక్క రోజులోనే ఆ ప్రాజెక్టు నిండునుంది. ఆ తర్వాత జూరాల గేట్లు ఎత్తి దిగువకు వరద ప్రవాహాన్ని విడుదల చేస్తారు. మరో నాలుగైదు రోజుల్లో శ్రీశైలానికి ఎగువ నుంచి వరద చేరే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల కృష్ణా ప్రధాన పాయ, ఉప నదుల్లో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి డ్యామ్‌లోకి 92,836 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరిన నేపథ్యంలో గేట్లు ఎత్తి 65 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఆ జలాలు నారాయణపూర్ డ్యామ్‌లోకి చేరుతున్నాయి. కృష్ణా ప్రధాన పాయలో మరో నాలుగైదు రోజులు ఇదే రీతిలో కొనసాగే అవకాశం ఉందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. ఇక కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్రలో వరద ఉధృతి పెరిగింది.



సాగర్ కుడి కాలువ నుంచి విడుదలవుతున్న నీరు

తుంగభద్ర డ్యామ్‌లోకి 49,522 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 39.72 మీటర్లకు చేరుకుంది.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా ఏపీకి 4.5 టీఎంసీలు, తెలంగాణకు 5.414 టీఎంసీలను కేటాయిస్తూ మంగళవారం కృష్ణా బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. సాగర్‌లో నీటిమట్టం కనీస స్థాయికి దిగువన ఉన్న నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 5.705 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించింది. దాంతో శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ కుడి, ఎడమ కేంద్రాల ద్వారా ఏపీకి 15,800, తెలంగాణకు 6,357 కలిపి 22,157 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తుండటంతో నీటి నిల్వ 33.24 టీఎంసీలకు తగ్గింది. సాగర్‌లోకి 21,481 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 122.69 టీఎంసీలకు చేరుకుంది. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు బుధవారం 5,500 క్యూసెక్కులను విడుదల చేశారు.

కొనసాగుతున్న అల్పపీడనం

సాక్షి, అమరావతి: మధ్యప్రదేశ్ తీరంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీని ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్రలో పలుచోట్ల భారీనుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మిగిలినచోట్ల విస్తృతంగా వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు, అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఆస్ట్రేలియాలో ఇద్దరు ఏపీ యువకుల మృతి

బాపట్లటౌన్: ఆస్ట్రేలియా దేశం క్వీన్స్ ల్యాండ్ ప్రాంతంలో జరిగిన సంఘటనలో ఇద్దరు తెలుగు యువకులు మృతి చెందారు. జలపాతంలో దిగిన ఒకరిని రక్షించబోయి మరొకరు.. ఇద్దరూ మృత్యువాత పడ్డారు. మరొకరు కొన ఊపిరితో బయటపడ్డారు. ఈత కోసం దిగిన సమయంలో ఈ ప్రమాదం జరిగిందా లేక జారిపడిపోయారా అనేది తెలియలేదు. మృతులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముప్పరాజు చైతన్య, బొబ్బ సూర్యతేజ అని ఆస్ట్రేలియా ఎంబసీ గుర్తించింది. వీరిలో చైతన్య శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరుకు, సూర్యతేజ బాపట్ల జిల్లాకు చెందినవారు. ఆస్ట్రేలియాలోని క్వీన్స్ ల్యాండ్ వద్ద ఉన్న మిల్లా మిల్లా జలపాతాన్ని తిలకించేందుకు వెళ్లి కన్నుమూశారు.



చైతన్య సూర్యతేజ

22 నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

సాక్షి, అమరావతి: జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)–2020 అమలు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ వేడుకల నిర్వహణలో రాష్ట్రం ముందంజలో ఉండాలని సూచించారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపైన దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి, నిబద్ధతను తెలియజేయడం ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు.

బాలికపై లైంగికదాడి కేసులో ఆర్‌ఎంపీ వైద్యుడి అరెస్ట్

మగబిడ్డకు జన్మనిచ్చిన దళిత బాలిక

చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రం చిత్తూరు నగరంలో ఒక బాలికపై నాలుగేళ్లుగా లైంగిక దాడి చేస్తూ ఆమె బిడ్డను కనడానికి కారణమైన ఆర్‌ఎంపీ వైద్యుడిని చిత్తూరు రెండో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ ఉలసయ్య కథనం మేరకు.. సంతపేట ఓబనపల్లె సమీపంలోని టి.ఎస్.రమేష్ (49) ఆర్‌ఎంపీ వైద్యుడు. అతడికి పెళ్లయి, ఇద్దరు పిల్లలు ఉండగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. రమేష్ క్లినిక్‌లో 17 ఏళ్ల దళిత బాలిక నాలుగేళ్లుగా సహాయకురాలిగా పని చేస్తోంది. నాలుగేళ్లుగా ఆ బాలికకు మాయ మాటలు చెప్పి రమేష్ ఆమెపై లైంగికదాడి చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన బాలిక తీవ్రమైన కడుపునొప్పి అని చెప్పడంతో ఆమెను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ మగబిడ్డకు జన్మనిచ్చింది. నిందితుడు రమేష్‌పై పోలీసులు బాలలపై లైంగికదాడి నిరోధక చట్టం పోక్సో కింద కేసు నమోదు చేసి సంతపేట ప్రాంగణంలో అరెస్టు చేశారు. రమేష్‌పై బంగారుపాళ్యంలో ఓ టీచర్‌ను హత్యచేసిన కేసు కూడా ఉన్నట్లు గుర్తించారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదనరావు




నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా సీనియర్ పాత్రికేయుడు దూర్జటి మధుసూదనరావును నియమిస్తూ ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యవర్గం ఆదేశాలు జారీ చేసింది. ఆయన నాలుగేళ్లు ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల్లో సూళ్లూరుపేట నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

ఐదోవంతు సమయం స్మార్ట్‌ఫోన్‌కే సరి

- ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న స్మార్ట్ ఫోన్ స్క్రీనింగ్ టైమ్
- నగటు వీక్షణ సమయం 3.50 గంటల నుంచి 4.37 గంటలకు పెరుగుదల
- భారత్‌లో 4.30 గంటలుగా నమోదు
- స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోతున్న ఫిలిప్పీన్స్ పౌరులు
- జపాన్‌లో ప్రపంచ నగటు కంటే తక్కువే







వివిధ దేశాల్లో స్క్రీనింగ్ సమయం ఇలా..

స్క్రీనింగ్ సమయం (గంటలు)	ర్యాంక్	దేశం
5.20	1	ఫిలిప్పీన్స్
5.19	2	బ్రెజిల్
5.15	3	దక్షిణాఫ్రికా
5.2	4	థాయ్‌లాండ్
4.58	5	ఘనా
4.48	6	చిలీ
4.47	7	కొలంబియా
4.45	8	ఇండోనేషియా
4.37	9	అర్జెంటీనా, మలేషియా
4.36	11	కెన్యా
4.34	12	యూఏఈ
4.30	19	భారతదేశం
3.39	24	యూఎస్
3.31	26	చైనా
3.26	28	సింగపూర్

సాక్షి, అమరావతి

స్మార్ట్‌ఫోన్‌తో గడిపే (స్క్రీనింగ్) సమయం క్రమంగా పెరుగుతోంది. ప్రపంచంలో వ్యక్తుల రోజు వారీ ఫోన్ సగటు వీక్షణ సమయం 3.50 గంటల నుంచి 4.37 గంటలకు పెరిగింది. భారత్‌లో 4.30 గంటలుగా నమోదైంది. అంటే ఒక వ్యక్తి ఏడాది పొడవునా దాదాపు 70 రోజులు ఫోన్లలోనే ఉంటున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్ యూజర్లు రోజుకు 58 సార్లు ఫోన్లను ప్రతిసారీ తనిఖీ చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. ఫిలిప్పీన్స్ వాసులు అత్యధికంగా సమయం ఫోన్లతో గడుపుతుంటే.. జపాన్ పౌరులు మాత్రం గ్లోబల్ సగటు కంటే తక్కువగా ఫోన్లపై గడుపుతున్నారు. 12–27 ఏళ్లలోపు వయస్కులే స్మార్ట్‌ఫోన్లలో మునిగిపోతున్నట్టు అంతర్జాతీయ సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.

పురుషుల కంటే స్త్రీలలోనే ఎక్కువ

సాంకేతిక యుగంలో స్మార్ట్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ఒకప్పుడు వారాంతాల్లో ఇంటి దగ్గర ఖాళీగా కూర్చుని ఎక్కువ సేపు ఫోన్ చూసేవారు. తాజా పరిణామాలతో సాధారణ రోజుల్లోనే స్మార్ట్‌ఫోన్ల స్క్రీనింగ్ సమయం పెరిగిపోయింది. ఇక్కడ ప్రతి నిముషానికి ఒకసారి ఫోన్ చూసుకోవడం అలవాటుగా మారిపోయింది. ఫిలిప్పీన్స్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, థాయ్‌లాండ్, ఘనా దేశాల్లో రోజు వారీ స్క్రీనింగ్ సమయం 5 గంటలు దాటిపోతోంది. నాలుగు దక్షిణ అమెరికా, 4 సౌత్ ఈస్ట్ ఆసియా దేశాలు టాప్–10 అత్యధిక స్క్రీనింగ్ జాబితాలో నిలిచాయి. అగ్ర రాజ్యంగా పిలిచే అమెరికాలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఎక్కువగా స్మార్ట్‌ఫోన్‌లో గడుపుతున్నారని.. వీరిలో దాదాపు 40 శాతం మంది అధిక స్క్రీనింగ్ అలవాటును తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. మరోవైపు పురుషుల కంటే స్త్రీలు ఎక్కువ సమయం ఫోన్‌లో గడుపుతున్నట్టు తెలుస్తోంది. వారి రోజువారీ సగటు స్క్రీనింగ్ సమయం 2.47 గంటలుగా ఉంటే.. పురుషులకు 2.34 గంటలుగా గుర్తించారు. ఎక్కువ మంది స్మార్ట్‌ఫోన్ వినియోగంలో ఎక్కువ సమయం ఇంటర్నెట్‌కు కేటాయిస్తున్నారు.

ఒంగోలు జాతి దూడకు జన్మనిచ్చిన జెర్సీ ఆవు

పిండమార్పిడి ద్వారా జననం

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లా శెట్టిగుంట పశువైద్యశాల పరిధిలోని జ్యోతీ కాలనీలో గోకుల్ మిషన్, డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో 2023 సెప్టెంబర్ 23న జెర్సీ ఆవుకు ఒంగోలు జాతి పిండాన్ని మార్పిడి చేశారు. దీని ద్వారా బుధవారం స్థానిక పాడి రైతు లక్ష్మీదేవికి చెందిన జెర్సీ ఆవుకు ఆరోగ్యవంతమైన ఒంగోలు జాతి దూడ జన్మించింది. డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ పిండ మార్పిడి ద్వారా అంతరించిపోతున్న ఆవుజాతులను కాపాడుకొని అభివృద్ధి చేయవచ్చన్నారు.

మత్తులో దూడను కొరికి చంపేశాడు



గుడుపల్లె (చిత్తూరు జిల్లా): మద్యం మత్తులో ఓ లేగదూడను కొరికి చంపేశాడు ఓ మందు బాబు. మండలంలోని ఒంటిపల్లెకు చెందిన సుబ్రమణ్యం బుధవారం కర్ణాటక సరిహద్దులోని బిసానత్తం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న బార్‌లో అతిగా మద్యం తాగి తిరుగు ప్రయాణం చేశాడు. బారుకు పర్లాంగు దూరంలో ఓ మహిళ తన పొలం వద్ద పాడి పశువులను కట్టి వేసింది.సుబ్రమణ్యం అక్కడ ఉన్న లేగ దూడ వద్దకు వెళ్లి దానిపై కూర్చుని గుర్రం లా సవారీ చేసేందుకు ప్రయత్నించాడు. ఆ దూడ బరువును మోయలేక పడిపోయింది. దీంతో సుబ్రమణ్యం దాని గొంతుపై కాలుపెట్టి నోటితో కొరికి చంపేశాడు. లేగ దూడ అరుపులు విన్న స్థానికులు సుబ్రమణ్యంను చెట్టుకు కట్టేసి కొట్టి పోలీసులకు అప్పగించారు.

నేటి నుంచి తెలంగాణలో డీఎస్సీ

- 11,062 టీచర్ పోస్టులకు పరీక్ష.. తొలిసారిగా ఆన్‌లైన్‌లో
- రోజుకు రెండు షిఫ్టుల్లో ఆగస్టు 5 వరకు నిర్వహణ
- 56 పరీక్షా కేంద్రాలు.. అన్ని చోట్లా సీసీ కెమెరాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) గురువారం నుంచి మొదలు కానుంది. వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ పరీక్ష జరుగుతుంది. అయితే మధ్యలో ఆరు రోజుల పాటు సెలవులు ఉన్నాయి. మొత్తం 11,062 టీచర్ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం 2,79,957 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తు గడువు పొడిగించడంతో ఇటీవల టెట్ అర్హత పొందిన 48 వేల మంది కూడా వీరిలో ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పరీక్షకు 1.60 లక్షల మంది, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ (ఎస్జీటీ) పోస్టుల కోసం 80 వేల మంది దరఖాస్తు చేశారు. మిగతా వారిలో భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. తొలిసారిగా కంప్యూటర్ బేస్డ్ (ఆన్‌లైన్)గా జరిగే ఈ పరీక్ష కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మొత్తం 56 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 27 కేంద్రాలున్నాయి. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

బయో మెట్రిక్ హాజరు

అభ్యర్థులకు బయో మెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖ సూచించింది. ప్రతిరోజూ రెండు షిఫ్టులుగా పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ ఒక విడత, సాయంత్రం 2 నుంచి 4.30 గంటల వరకు మరో విడత ఉంటుంది. జూలై 21, 27, 28, 29, ఆగస్టు 3, 4 తేదీల్లో పరీక్ష ఉండదు. ఎస్‌ఏ పరీక్షను జూలై 18, 20, 22, 24, 25, 30, 31, ఆగస్టు 1, 2 తేదీల్లో చేపడతారు. పీఈటీ పరీక్షను జూలై 18, 26 తేదీల్లో నిర్వహిస్తున్నారు. భాషా పండితులకు జూలై 26, ఆగస్టు 2, 5 తేదీల్లో డీఎస్సీ ఉంటుంది. పీఈటీలకు ఆగస్టు 5న, ఎస్జీటీలకు జూలై 19, 22, 23, 26, ఆగస్టు 1వ తేదీన పరీక్ష ఉంటుంది. స్పెషల్ ఎడ్యుకేషన్‌కు జూలై 20న నిర్వహిస్తారు. కాగా, ఆరేళ్ల తర్వాత మళ్లీ డీఎస్సీ జరుగుతోంది.

ఎంబీయూలో టీసీఎస్ ఇంటర్వ్యూలు



ఎంబీయూలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన ప్యానలిస్టు బృందం సభ్యులు

చంద్రగిరి (తిరుపతి జిల్లా): మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)లో రెండు రోజులుగా జరుగుతున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇంటర్వ్యూలు బుధవారం ముగిశాయి. ఈ ఇంటర్వ్యూలకు ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి దాదాపు 1,800 మంది విద్యార్థులు హాజరవ్వగా.. ఎంబీయూ నుంచి 430 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారందరినీ 175 మంది ప్యానలిస్టుల బృందం ఇంటర్వ్యూ చేసింది. వారం రోజుల్లో ఫలితాలను ప్రకటిస్తారని వర్సిటీ అధికారులు చెప్పారు. కాగా, ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులను చాన్సలర్ మోహన్‌బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణు అభినందించారు. ఎంబీయూ క్యాంపస్‌ను ప్లేస్‌మెంట్ కోసం నోడల్ సెంటర్‌గా ఎంపిక చేసినందుకు టీసీఎస్ బృందానికి వీసీ డాక్టర్ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ సారథి, క్యాంపస్ ప్లేస్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఢిల్లీబాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి తదితరులు ధన్యవాదాలు తెలిపారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.